

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★




రేపు నల్లగొండ జిల్లా చండూరులో ఉజ్జిని నారాయణరావు భవన్ ప్రారంభోత్సవం

వ్యాసం 2లో


సంపుటి 09, సంచిక: 222 | ఆదివారం | 12-07-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## కాళేశ్వరం ప్రాజెక్టును

# ఎన్‌డిఎస్‌ఎకే అప్పగిస్తాం

- కేంద్రాన్ని ఒప్పించి, వారితోనే నీటిని ఎత్తిపోయించండి : ఎంపి ఈటలకు సవాల్
- కెసిఆర్ నేతృత్వంలోని కిలాడి కమిటీ ఒత్తిడికి ప్రభుత్వం లొంగబోదు
- ఆ కమిటీకి చైర్మన్‌గా కెసిఆర్ ఉండగా, హరీశ్‌రావు, కెటిఆర్‌తో పాటు ఈటల కూడా సభ్యుడిగా చేరారు
- కాళేశ్వరం మూడు బ్యారేజీల పునరుద్ధరణ చర్యలకు కేంద్రం ఇటీవలే ప్రత్యేక సాంకేతిక పర్యవేక్షణ కమిటీ వేసింది
- కనీస పంపింగ్‌లెవల్ 93.50మీటర్లు ఉంటేనే ఎత్తిపోత సాధ్యం
- మేడిగడ్డ బ్యారేజీలో లోపాలున్నాయని 2020 మే 18నే ఎఇ డి.వి. రమణారావు లేఖ రాశారు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- హరీశ్‌రావును కెసిఆరే నమ్మలేదు... ప్రభుత్వం ఎలా నమ్ముతుంది
- పాత కమీషన్ల వసూళ్ల కోసమే మంత్రి పదవి అడుగుతున్నాడని విమర్శ
- ప్రాజెక్టుల గేట్లు మూసేస్తే బ్యారేజీలకు దెబ్బ అని వ్యాఖ్య



నేను రెండే రెండు డిమాండ్లు ఈటల రాజేందర్ ముందుంచుతున్నా. ఎన్‌డిఎస్‌ఎను కలిసి నీళ్లు ఎత్తిపోయాలని చెప్పండి. ఎన్‌డిఎస్‌ఎకు మేము సంపూర్ణంగా సహకరిస్తాం. సిబిఐ వద్ద మూలుగుతున్న కాళేశ్వరం కేసుపై విచారణ ముందుకు తీసుకెళ్లేలా చేయండి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, అవినీతి ఆరోపణలపై విచారణను మేం సిబిఐకి అప్పగించాం. 2025 సెప్టెంబర్ 1వ తేదీన ఈ కేసును సిబిఐకి అప్పగిస్తూ జీవో నెం.104 జారీ చేశాం. ఇప్పటికీ విచారణ ఎందుకు వేగంగా సాగడం లేదో సమాధానం చెప్పాలి.

— సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

'కాళేశ్వరం ప్రాజెక్టును ఎన్‌డిఎస్‌ఎ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ)కు అప్పగిస్తాం. నీళ్లు ఎత్తిపోయాలని ఎన్‌డిఎస్‌ఎనే కోరండి. మేమైతే నీళ్లు ఎత్తిపోయం. అలా చేస్తే భద్రాచలం మునుగుతుంది. బిఆర్‌ఎస్ కోరుతున్నట్లు కాళేశ్వరం (కన్నెపల్లి పంప్‌హౌస్) నీటిని ఎత్తిపోసే అంశం సాధ్యం కాదు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ఒక వేళ ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్‌ను బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ఒప్పిస్తే నీటిని ఎత్తిపోసేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల గేట్లను మూసివేస్తే తప్ప పంప్‌హౌస్‌ల వద్ద నీటిని ఎత్తిపోసి నీటిని నిల్వ చేస్తే బ్యారేజ్ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని పునరుద్ఘాటించారు. కెసిఆర్ నేతృత్వంలోని 'కిలాడీ' కమిటీ ఒత్తిడికి ప్రభుత్వం లొంగబోదని, తాము ఎన్‌డిఎస్‌ఎ కమిటీ సూచనల మేరకే పని చేస్తామని సిఎం స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎంసిహెచ్‌ఆర్‌డిలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ తరువాయి 8లో



## ఉన్మాది కిరాతకం

### భార్య ఇద్దరు పిల్లలతో పాటు మరో ముగ్గురు మహిళల దారుణ హత్య

- మైనర్ బాలికను వేధిస్తున్నాడని నిందితుడిపై పోక్సో కేసు
- కక్షతో ఉన్మాదం
- రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో దారుణ విషాదం
- షాబాద్ ఎస్ఐ రమేశ్ సస్పెన్షన్



ప్రజాపక్షం/రంగారెడ్డి/షాబాద్

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో ఓ సైకో కిల్లర్ తన భార్య ఇద్దరు పిల్లలతో సహా మరో ముగ్గురు మహిళలను అత్యంత కిరాతకంగా నరికి చంపిన ఘోర సంఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు గురిచేసింది.సంఘటనకు సంబంధించి స్థానికులు పోలీసుల కథనం ప్రకారం జిల్లా షాబాద్ మండలం నాగర్ కుంట గ్రామపంచాయతీ పరిధిలోని దైవాలగూడా కు చెందిన పోక్సో కేసు నిందితుడు పార్వతి రాజ్ కుమార్ (28) షాబాద్ లో నివాసం ఉంటూ..ఆ పక్కనే నివాసం ఉంటున్న మైనరు బాలిక (17)ను లైంగికంగా వేధిస్తుండడంతో బాలికతో పాటు తన తల్లి స్థానిక పోలీస్ స్టేషన్ లో మే 16 న ఫిర్యాదు చేశారు.దీంతో పోలీసులు పార్వతి రాజ్ కుమార్ పై పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసేందుకు యత్నించారు. అయితే పరారీలో తరువాయి 8లో

## రూ.7.86 కోట్ల టోకరా

### బెంగళూరు నగల వ్యాపారిని మోసగించిన -హైదరాబాదీ

ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యాపార లావాదేవీల పేరిట కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను స్వీకరించి, భారీ మొత్తాన్ని చెల్లించకుండా బిచాణ ఎత్తివేసిన నగల దుకాణం ఉదంతం తాజాగా బెంగళూరులో వెలుగు చూసింది. బెంగళూరుకు చెందిన నగల వ్యాపారికి హైదరాబాద్‌కు చెంది న నగల దుకాణ యజమాని రూ.7.86 కోట్ల టోకరా వేసి దుకాణం ఎత్తివేశారనే ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బెంగళూరు జ్యువెలరీ హౌస్ యజమాని తరువాయి 12లో

## వియత్నాంలో స్పీడ్‌బోటు బోల్తా

### ఇద్దరు తెలుగువారు సహా 15 మంది భారత టూరిస్టులు మృతి

- మరో నలుగురు ఆంధ్రా పర్యాటకులు గల్లంతు!
- బోటులో ఉన్నవారంతా మొబైల్ కంపెనీ ఉద్యోగులే
- తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ

**హనోయ్:** వియత్నాంలో స్పీడ్‌బోటు బోల్తా పడింది. విహారయాత్రకు వెళ్ళి ఈ బోటులో ప్రయాణిస్తున్న 15 మంది భారతీయ పర్యాటకులు మరణించారు. మరణించినవారిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉన్నారు. వీరిలో ఒకరిని కడప నగరానికి చెందిన శ్రీధర్‌గా, మరొకరిని మచిలీపట్నానికి చెందిన మహిళ జయశ్రీగా గుర్తించారు. ఆమె భర్త కిషోర్ పరిస్థితి విషమంగా తరువాయి 12లో



## అత్యంత ప్రాధాన్యతతో భూ రీ సర్వే

- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి
- ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి యూనిఫాం అందించాలి
- జిల్లా కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్ర వ్యాప్తంగా భూ రీ సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీ సర్వే, భూ భారతి అమలు, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బిహెచ్‌కె ఇండ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో తరువాయి 8లో

## ఎన్యూమరేషన్ ఫారాలు

# తక్షణమే డిజిటలైజేషన్

తప్పులు దొర్లకుండా చేయాల్సిన బాధ్యత అధికారులదే : రాష్ట్ర సిఇఒ సుదర్శన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' ప్రక్రియను పారదర్శకంగా, అత్యంత వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా ఈ ప్రక్రియ సాగాలని ఆయన స్పష్టం చేశారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న 'సర్' ప్రక్రియను సిఈఓ సుదర్శన్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు తరువాయి 12లో

## గాయని ఎస్.జానకి

# కన్నుమూత

### గుండెపోటుతో మైసూర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచిన గానకోకిల



హైదరాబాద్/ప్రజాపక్షం

ప్రముఖ నేపథ్యగాయని ఎస్.జానకి ఇక లేరు. మైసూరులోని తన నివాసంలో గుండెపోటుతో ఆమె తుదిశ్వాస విడిచారు. ఎనభై ఎనిమిదేళ్ల జానకి వయోభారంతో పాటు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. కొద్ది నెలల క్రితం ఆమె కుమారుడు చనిపోవడంతో అప్పటి నుంచి జానకి మానసికంగా కృంగిపోయారు. ఇంట్లోనే కార్డియాక్ అరెస్ట్ రావడంతో వెంటనే కుటుంబసభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గుండెపోటుతో తుదిశ్వాస తరువాయి 12లో





ప్రజాపక్షం
Telugu National Daily

ఖమ్మం
ఆదివారం
12-07-2026
www.prajapaksham.in






## అర్ధరాత్రి వచ్చే అతిథి!



అమెరికాలోని కాలిఫోర్నియా, ఆల్టాడెనా ప్రాంతంలో ఒక ఇంటి యజమానికి ఊహించని వింత అనుభవం ఎదురైంది. తన ఇంటి కింద సెల్లార్ నుండి ప్రతిరోజూ రాత్రిపూట వింత వింత శబ్దాలు వస్తుండటాన్ని ఆయన గమనించాడు. నిద్రకు భంగం కలిగిస్తున్న ఆ శబ్దాల వెనుక ఉన్న రహస్యాన్ని తెలుసుకోవడానికి పరిశీలించగా, అక్కడ ఒక భారీ నల్ల ఎలుగుబంటి నివాసం ఉంటున్నట్లు తేలింది. దాదాపు 550 పౌండ్ల (సుమారు 250 కిలోల) బరువున్న ఆ భారీ ఎలుగుబంటి, ఇంటి కింద ఉన్న ఖాళీ స్థలంలోకి పదేపదే దూరి, అక్కడ బాగా అలవాటు పడిపోయింది. పగలంతా అడవిలో తిరిగినా, రాత్రి అయ్యేసరికి ఆ ఇంటి కింద హాయిగా విశ్రాంతి తీసుకోవడం దానికి అలవాటుగా మారింది. అది అటు ఇటు కదులుతున్నప్పుడు వచ్చిన శబ్దాలే ఇంటి యజమానిని భయపెట్టాయి. చివరకు వన్యప్రాణి అధికారుల సహాయంతో ఆ భారీ ఎలుగుబంటిని అక్కడి నుండి సురక్షితంగా బయటకు పంపి, మళ్లీ అది లోపలికి రాకుండా ఇంటి కింద ఉన్న ప్రవేశ మార్గాలను మూసివేశారు. ఈ వింత 'అతిథి' ఉదంతం స్థానికంగా పెద్ద చర్చనీయాంశమైంది.



## పార్శిల్‌లో 'ఉడుత'..


థాయ్‌లాండ్‌లోని ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' కార్పొరేట్ కార్యాలయంలో ఒక వింత సంఘటన చోటుచేసుకుంది. ఆఫీసుకు డెలివరీ అయిన ఒక పార్శిల్ బాక్స్‌ను సిబ్బంది తెరిచినప్పుడు, అందులో నుండి ఊహించని విధంగా ఒక ఉడుత ఒక్కసారిగా బయటకు దూకింది. పార్శిల్ నుండి బయటపడిన ఆ ప్రాణి తీవ్ర భయంతో ఆఫీస్ అంతటా పరుగులు తీయడం ప్రారంభించింది. వర్క్‌స్పేస్‌లోని కంప్యూటర్, కుర్చీలు, ఫైళ్లపైకి ఎక్కుతూ అది చేసిన హడావుడితో ఆఫీసులో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. ప్రశాంతంగా పని చేసుకుంటున్న ఉద్యోగులు ఈ వింత అతిథిని చూసి షాక్‌కు గురయ్యారు. కొందరు భయంతో కేకలు వేయగా, మరికొందరు దానిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఈ ఆకస్మిక పరిణామంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పనికి కాసేపు బ్రేక్ పడింది. చివరకు సిబ్బంది అంతా కలిసి, సుమారు 20 నిమిషాలు కష్టపడి, ఆ ఉడుతకు ఎటువంటి గాయం కాకుండా సురక్షితంగా పట్టుకుని, ఆఫీస్ వెలుపల చెట్లలో వదిలేశారు. కొరియర్ ప్యాకేజీలో ఉడుత ఎలా వచ్చిందనేది ఎవరికీ అర్థం కాలేదు కానీ, ఈ ఘటనకు సంబంధించిన చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## జంతువుల్లోనూ సానుభూతి!



మనుషుల్లోనే సానుభూతి కరవవుతున్న కాలంలో, జంతువుల్లో అలాంటి గుణం ఉంటుందా అన్న ప్రశ్న ఉదయించకమానదు. ఈ ప్రశ్నకు కొన్ని శాస్త్రీయ పరిశోధనలు ఆసక్తికరమైన సంకేతాలను అందిస్తున్నాయి. ఒక ప్రముఖ అధ్యయనంలో శాస్త్రవేత్తలు ఒక ఎలుకను పారదర్శకమైన చిన్న పెట్టెలో బంధించి, మరో ఎలుకను బయట స్వేచ్ఛగా సంచరించేలా ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల పరిశీలన తర్వాత, బయట ఉన్న ఎలుక పెట్టె తలుపు ఎలా తెరవాలో నేర్చుకుని, లోపల చిక్కుకున్న తన సహచర ఎలుకను బయటకు విడుదల చేసింది. ఈ ప్రయోగంలో మరో విశేషం కూడా ఉంది. బయట ఉన్న ఎలుకకు చాక్లెట్ వంటి ఇష్టమైన ఆహారం అందుబాటులో ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో అది ముందుగా తన తోటి ఎలుకను విడిపించి, అనంతరం రెండూ కలిసి ఆహారాన్ని పంచుకుని తిన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ ప్రవర్తన ఎలుకల్లో సహకార భావన, సామాజిక బంధం, తోటి జీవి పరిస్థితిని గుర్తించే సామర్థ్యం ఉన్నట్లు సూచిస్తోంది. అయితే దీనిని మనుషుల సహానుభూతితో పూర్తిగా సమానంగా భావించడం సరైంది కాదని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రవర్తన వెనుక సహజ సామాజిక స్వభావం, పరస్పర సహకారం, సామూహిక జీవన లక్షణాలు వంటి అనేక కారణాలు ఉండవచ్చని వారు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా, పరిమాణంలో చిన్నవైన ఎలుకలు కూడా సంక్లిష్టమైన సామాజిక ప్రవర్తనను ప్రదర్శించగలవు.

## అంతరించిపోతున్న ఆకాశ నౌకలు



ఒకప్పుడు ఆకాశంలో గంభీరంగా తేలియాడుతూ విమానయాన రంగానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన 'బ్లింప్'లు నేడు అరుదైన దృశ్యాలుగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం కేవలం రెండు డజన్లకు పైగా, అంటే సుమారు 25 బ్లింప్‌లు మాత్రమే క్రియాశీలకంగా ఉపయోగంలో ఉన్నట్లు అంచనా. బ్లింప్ అనేది హీలియం వంటి గాలి కంటే తేలికైన వాయువుతో నింపబడిన ఒక రకమైన ఎయిర్‌షిప్. సాధారణ విమానాల మాదిరిగా రెక్కల ద్వారా కాకుండా, ఈ వాయువు కల్పించే తేలే శక్తితో గాల్లో ప్రయాణిస్తుంది. అందువల్ల ఇవి నెమ్మదిగా, స్థిరంగా ప్రయాణించగలవు. ఎక్కువసేపు గాల్లో ఉండటం వీటి ప్రధాన ప్రత్యేకత. 20వ శతాబ్దం ప్రారంభంలో బ్లింప్‌లను ప్రయాణికుల రవాణా, సైనిక నిఘా, వైమానిక చిత్రీకరణ, ప్రకటనలు వంటి అనేక అవసరాలకు వినియోగించేవారు. అయితే వేగవంతమైన విమానాల ఆవిర్భావం, నిర్వహణ వ్యయం పెరగడం, ముఖ్యంగా 1937లో జరిగిన హిండెన్‌బర్గ్ ఎయిర్‌షిప్ ప్రమాదం తర్వాత వీటి వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం బ్లింప్‌లను ప్రధానంగా క్రీడా పోటీల వైమానిక చిత్రీకరణ, పర్యాటక విహారయాత్రలు, ప్రకటనలు, శాస్త్రీయ పరిశోధనలు, పర్యావరణ పర్యవేక్షణ వంటి ప్రత్యేక రంగాల్లో ఉపయోగిస్తున్నారు.

## ఆలోచనల్లో మేటి తేనెటీగలు



చిన్న పరిమాణంలో ఉన్నప్పటికీ తేనెటీగల మెదడు అత్యంత సమర్థంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు చాలాకాలంగా గుర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన కొన్ని పరిశోధనలు, విశ్రాంతి సమయంలో తేనెటీగ లు పగటిపూట సేకరించిన సమాచారాన్ని మెదడులో మళ్లీ ప్రాసెస్ చేస్తున్నాయని సూచిస్తున్నాయి. అయితే దీనిని మనుషుల మాదిరిగానే అన్నింటినీ 'సింహావలోకనం' చేసుకుంటాయని చెప్పడానికి ఇప్పటి వరకు తగిన శాస్త్రీయ ఆధారాలు లేవు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, విశ్రాంతి సమయంలో తేనెటీగల నాడీ వ్యవస్థ గత అనుభవాలను పునర్వ్యవస్థీకరించడం ద్వారా జ్ఞాపకాలను బలపరుస్తుంది. దీనివల్ల పూలు ఉన్న ప్రదేశాలను గుర్తుంచుకోవడం, తేనెపట్టు నుంచి ఆహార వనరుల వరకు సరైన మార్గాన్ని గుర్తించడం, కొత్త పరిసరాలను నేర్చుకోవడం వంటి సామర్థ్యాలు మెరుగుపడతాయి. మనుషుల్లో నిద్ర సమయంలో జ్ఞాపకాలు క్రమబద్ధీకరించబడినట్లే, తేనెటీగల్లో కూడా ఇలాంటి జీవసంబంధ ప్రక్రియలు జరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. తేనెటీగలు వేలాది పూల స్థానాలను గుర్తుంచుకోవ డం, సూర్యుడి స్థానాన్ని ఆధారంగా చేసుకుని దిశను నిర్ధారించ డం, అలాగే ప్రసిద్ధ 'వాగుల్ డ్యాన్స్' ద్వారా ఇతర తేనెటీగలకు ఆహారం ఉన్న ప్రదేశాన్ని తెలియజేయడం వంటి క్లిష్టమైన పనులను సమర్థంగా నిర్వహిస్తాయి. ఇవన్నీ వాటి అసాధారణ జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యానికి నిదర్శనాలు. ఈ పరిశోధనలు చిన్న జీవుల మెదడు కూడా అత్యంత సంక్లిష్టంగా పనిచేస్తుందని తెలియజేస్తున్నాయి. అయితే తేనెటీగలు మనుషుల మాదిరిగా కలలు కంటాయనే విషయం ఇంకా నిర్ధారణ కాలేదు. కాబట్టి వాటి ప్రవర్తనను శాస్త్రీయ ఆధారాల ప్రకారమే అర్థం చేసుకోవడం అవసరం.

**– బిఎస్ఎస్ మైత్రేయి**

# ఉన్నత విద్య కేంద్రీకరణకు తీవ్ర అభ్యంతరాలు

ఉన్నత విద్యను పూర్తిగా తమ అధీనంలో ఉంచుకోవటానికి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లుకు పలు అత్యున్నత స్థాయి విద్యాసంస్థలనుంచి, పలు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకత స్వాగతించదగింది. ఈ బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం ఆదేశించిన ఫెడరల్ వ్యవస్థకు వ్యతిరేకం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికే వ్యతిరేకం. దాని లక్ష్యం యూనిటరీ వ్యవస్థ – అనగా అధ్యక్ష తరహా పాలన. అప్పుడు రాష్ట్రాలు నామమాత్రావశిష్టమవుతాయి. అన్ని అధికారాలు అధ్యక్షుని చేతిలోనే ఉంటాయి. రాజ్యాంగాన్ని మార్చే శక్తిని ప్రజలు ఇవ్వని కారణాన, రాజ్యాంగంలోని వెసులుబాట్లను ఉపయోగించుకుని అధికారాలను కేంద్రీకరిస్తూ చట్టాలు చేస్తున్నది. జిఎస్‌టి వ్యవస్థను ప్రవేశపెట్టి – అదేదో రెండవ స్వాతంత్ర్య సాధన అన్నంత బిల్డప్ ఇచ్చి – స్వాతంత్ర్యం సిద్ధించిన అర్ధరాత్రిని సంకేతంగా తీసుకుని ఆ చట్టాన్ని పార్లమెంటు భవన్ నుంచి అర్ధరాత్రి అమలులోకి తెచ్చింది. ఆ చట్టం రాష్ట్రాల ఆర్థిక సార్వభౌమత్వాన్ని గుంజుకుంది. జాతీయ విద్యావిధానమంటూ ఒక తిరోగమన విధానాన్ని దేశంపై రుద్దింది. జాతీయ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ)ని నెలకొల్పి 'ఒకే దేశం–ఒకే పరీక్ష' అంటూ వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్షలను దానికి అప్పగించింది. పరీక్ష పేపర్ల లీకుతో ఆ నిర్వహణ ఎంత భ్రష్టుపట్టిందో చూస్తున్నాం. అంతకుముందు రాష్ట్రాలు తమ స్వంత ఎంసెట్ పరీక్ష ద్వారా ఎంబిబిఎస్, ఇంజనీరింగ్, బి.ఫార్మసీ తదితర సీట్లు భర్తీ చేసుకునేవి. ప్రాంతీయ భాషలో కూడా పరీక్ష ఉండేది గనుక మాతృభాషలో చదువుకున్న గ్రామీణ విద్యార్థులకు సైతం ప్రవేశపరీక్షలో న్యాయం జరిగేది. అటువంటి కేంద్రీకరణ పరంపరలో కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త బిల్లు "వికసిత్ భారత్ శిక్షా అధిస్థాన్ (విబిఎస్ఎ) బిల్లు,' 2025. ఈ బిల్లు ప్రస్తుతం బిజెపి ఎంపి డి.పురంధేశ్వరి చైర్మన్‌గా జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్, అఖిల భారత సాంకేతిక విద్య కౌన్సిల్, ఉపాధ్యాయ విద్య జాతీయ కౌన్సిల్ చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో ఒకేఒక అత్యున్నత సంస్థ (విబిఎస్ఎ) ఏర్పాటుకు ఈ బిల్లు ఉద్దేశించింది. రెగ్యులేటరీ, అక్రిడిటేషన్, స్టాండర్డ్స్ : కౌన్సిళ్లు ఈ బిల్లు కిందకు వస్తాయి. ఈ నూతన నియంత్రణ వ్యవస్థ నుంచి తమను మినహాయిస్తున్నట్లు స్పష్టంగా బిల్లులో చేర్చాలని ఐఐటిలు, ఐఐఎంలు వంటి జాతీయ ప్రాముఖ్యతగల సంస్థలు(ఐఎన్‌ఐలు), వాటితోపాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (ఐఐఎస్ఇఆర్‌లు)కోరాయి. ఐఎన్ఎస్‌లు, ప్రఖ్యాతిగాంచిన సంస్థల స్వయం ప్రతిపత్తి రక్షణను క్లాజు 49 వాగ్దానం చేస్తున్నదనే ప్రభుత్వ వాదనతో ఆ సంస్థలు సంతృప్తిపడలేదు.

ఆంధ్రప్రదేశ్, మేఘాలయ, మధ్రప్రదేశ్ వంటి ఎన్‌డిఎ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బిల్లులోని కేంద్రీకరణ నిబంధనలను గట్టిగా వ్యతిరేకించినట్లు జెపిసికి ఆ ప్రభుత్వాలు సమర్పించిన మెమొరాండంలు తెలియజేస్తున్నాయి. కాన్పూర్, హైదరాబాద్, సంబాల్‌పూర్ ఐఐటిలు, ఐఐఎస్ఇఆర్–మొహాలీ బిల్లు పరిధినుంచి పూర్తి మినహాయింపు కోరాయి. పరిశోధన, పాఠ్యప్రణాళిక, అకడమిక్ కార్యకలాపాలకు సంబంధించి సంపూర్ణమైన వ్యవస్థాగత స్వయంప్రతిపత్తి అవసరాన్ని అనేక ఇతర ఐఐటిలు, ఐఐఎంలు, ఐఐఎస్ఇఆర్‌లు వక్కాణించాయి. ఐఐటిలు, ఐఐఎంలు, ఐఐఎస్ఇఆర్‌లను నెలకొల్పిన చట్టాలకన్నా ప్రతిపాదిత బిల్లులోని నిబంధనలు ప్రాధాన్యం పొందుతున్నాయని ధనబాద్ ఐఐటి, కోల్‌కతా ఐఐఎస్ఇఆర్, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ ఎత్తి చూపాయట. లా, మెడిసిన్‌లను బిల్లు పరిధిలో చేర్చకపోవటాన్ని ఐఐటి–బొంబాయి ప్రశ్నించిందట! బిల్లులోని పెనాల్టీ స్వరూపాన్ని అనేక సంస్థలు విమర్శించాయట.

ఈ అధికార కేంద్రీకరణ బిల్లును రానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశంలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ బిల్లును "చాలా చెడ్డ విద్యా చట్టం"గా అభివర్ణించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ ఈ విబిఎస్ఎ బిల్లును గట్టిగా వ్యతిరేకించాల్సిందిగా ఎన్‌డిఎ ప్రభుత్వాలకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు రాష్ట్రాల ప్రయోజనాలకు హాని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గట్టిగా అభిప్రాయపడినట్లు తెలుస్తున్నది. ఉన్నత విద్య విషయంలో సమన్వయం, ప్రమాణాల నిర్ణయం వరకే ఎంట్రీ 66 కింద పార్లమెంటరీ అధికారం పరిమితం చేయబడిందని గుర్తు చేసిన రమేశ్ ఈ బిల్లు ఆ అధికారాన్ని అతిక్రమిస్తున్నదన్నారు.

ఈ బిల్లు ఫలితం గా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్, అఖిల భారత సాంకేతిక విద్య కౌన్సిల్ ప్రస్తుతం కలిగిఉన్న గ్రాంట్‌ల పంపిణీ అధికారం కేంద్ర విద్యామంత్రిత్వశాఖ కిందకు వెళుతుందని, దీనితో ఉన్నత విద్యా సంస్థలపై కేంద్ర కంట్రోలు పెరుగుతుందన్నారు. ఉన్నతవిద్య నియంత్రణ వ్యవస్థలో కీలక మార్పులు తలపెట్టిన ఈ బిల్లుపై విద్యావేత్తలతో, సంస్థలతో మరింత విస్తృత చర్చ జరగాలి. ఉన్నత విద్యాసంస్థల మాటకు విలువ ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాన్ని గుంజుకునే ప్రయత్నాలకు రాజకీయాలతో నిమిత్తం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు గట్టిగా వ్యతిరేకించి ఈ తిరోగమన బిల్లు ను కేంద్రం ఉపసంహరించుకునేటట్లు చేయాలి. ●

# నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు శిఖరం 'ఉజ్జిని'

*రేపు నారాయణరావు 10వ వర్థంతి. చింతపల్లిలో సిపిఐ కార్యాలయానికి నామకరణం సందర్భంగా ఈ చిరువ్యాసం ప్రచురిస్తున్నాం – సం॥*

ఉజ్జిని నారాయణరావు మన నుండి దూరమై నేటికి పది సంవత్సరాలు అవుతుంది. వారు స్వయంగా చింతపల్లి మండల కేంద్రంలో వెయ్యి గజాల స్థలం సేకరించి అందులో కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు కోసం నాలుగు గదులతో శాశ్వతంగా ఆఫీసు నిర్మాణం చేసినారు.. ఆ ఆఫీసును ఆధునీకరించి 'కామ్రేడ్ నారాయణ రావు భవన్' గా నామకరణం చేయాలని దేవరకొండ నియోజకవర్గ కమిటీ నిర్ణయించింది.. ఆ మేరకు నేడు వారి 10వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆ భవన్‌కు కామ్రేడ్ నారాయణరావు భవన్‌గా నామకరణం చేయనున్నారు. ఈ సందర్భంగా 'ఉజ్జిని నారాయణరావు ఉద్యమ ప్రస్థానం' పేరుతో వారితో ఐదు దశాబ్దాలుగా ఉద్యమ అనుబంధం ఉన్న ఉజ్జిని రత్నాకర్ రావు రూపొందించిన పుస్తకాన్ని మండల కేంద్రంలో సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించనున్నారు.

ఉజ్జిని నారాయణరావు ఉద్యమమే ఊపిరిగా.. పోరాటమే బాటగా.. కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా చేతబట్టి ఆరు దశాబ్దాలపాటు పేద ప్రజల కోసం కష్టజీవుల కోసం నిరంతరం ఉద్యమాలు నడిపిన నాయకుడు ఉజ్జిని.

ఆయన జీవితకాలమంతా అట్టడుగు ప్రజల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేశారు. సైద్ధాంతిక నిబద్ధత గల ఉజ్జిని నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం నుంచి తొలిసారిగా 1967లో సిపిఐ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో సైకిల్ మోటార్‌తోనే ప్రచారం చేశారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ చీలిక తో ఓడిపోయినప్పటికీ తిరిగి 1972లోకూడా పోటీచేసి ఓటమి ఎదురైనప్పటికీ నిరంతరం ప్రజల్లోనే కొనసాగారు. ఆ తర్వాత 1985,1989, 1994లో వరుసగా మునుగోడు నియోజకవర్గం నుంచి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. నిజాం రాచరిక వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న జాగిర్దారి, వతందారి, భూస్వామ్య, దొరల దౌర్జన్యాలను ఎదిరించాలని కమ్యూనిస్టు పార్టీ(ఆంధ్ర మహాసభ) పిలుపుతో దేవరకొండ తాలూకాలో నారాయణరావు గారు తన సహచరులైన పల్లా పర్వత రెడ్డి, బొడ్డుపల్లి రామశర్మ, పైగిడి మర్రి మల్లప్ప తదితరులతో కలిసి 1950లో కమ్యూనిస్టు పార్టీ చేరారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ దళాలు రహస్యంగా దేవరకొండ ప్రాంతానికి రావడంతో వారితో సంబంధాలు ఏర్పాటు చేసుకొని దళాలకు అన్ని విధాలుగా.. షెల్టర్స్ సహకారం అందిస్తూ అడవి బాట పట్టారు. భూస్వామ్య వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగించారు.

సాయుధ పోరాట విరమణతో 1952లో జరిగిన మొదటి ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ(పిడిఎఫ్) అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేశారు. ఆనాటి పాత దేవరకొండ తాలూకాలోని పెద్దమునగల్, దేవరకొండ, చిన్న కొండూరు నియోజకవర్గాలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకున్నారు.

1953లో సిపిఐ దేవరకొండ తాలూకా నిర్మాణ మహాసభ జరిపి దానికి కార్యదర్శిగా ఎన్నికై 1968 వరకు, తిరిగి 1972 నుండి 1982 వరకు తాలూకా కార్యదర్శిగా పనిచేశారు.



**భూ పోరాటాలు :** కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో దున్నేవానికి భూమి నినాదంతో ప్రభుత్వ బంచరాయి భూములు, భూస్వాముల కింద అక్రమంగా ఉన్న భూములు, చెట్లు లేని అడవి బంజరు భూములను గుర్తించి దేవరకొండ తాలూకాలో వివిధ గ్రామాలలో 10,000 ఎకరాల భూములను భూమిలేని పేదలతో ఆక్రమింపజేసి వారికి



పట్టాలు వచ్చేంతవరకు ఉద్యమాలు నడిపించారు. ఇందులో ప్రస్తుత చింతపల్లి మండలంలోని పోలేపల్లి రాంనగర్ భూస్వామి శీలం అల్వాల్ రెడ్డి స్వాధీనం లో ఉన్న 600 ఎకరాల భూములను పంచారు. శివన్నగూడెం, కుదాబక్షి పల్లి గ్రామాల్లోని భూస్వాముల భూములపై పోరాటం చేసి భూముల ను ఇప్పించారు. శివన్నగూడెం, సగంపేట, మెల్లవాయి, మధులాపురం తదితర గ్రామాలలో దేవాలయ భూములు భూస్వాముల చేతుల్లో ఉండేవి. అట్టి భూములను భూమిలేని పేదలకు ఇవ్వాలని దేవాలయ భూముల పోరాటాన్ని నడిపించి వందలాదిమంది పేదలకు ఇప్పించటంలో నారాయణరావు కృషి మరువలేనిది. ఎక్కడ ప్రభుత్వ భూములు, సీలింగు భూములు, అటవీ, దేవాదాయ భూములు, చెరువు శిఖం భూములు ఉన్నా భూస్వాముల నుండి బయటకుతీసి అవి పేదలకు చెందాలని పోరాటాలకు నడుంబిగించిన భూ పోరాట యోధుడు ఉజ్జిని. ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పెంచిన అదనపు భూమి శిస్తులకు వ్యతిరేకంగా సత్యాగ్రహాలు చేపట్టాలని కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపుతో దేవరకొండ తహసిల్దార్ కార్యాలయం ముందు 60 రోజులు పాటు రోజు 4– 5 గ్రామాలనుంచి రైతులను సమీకరించి సత్యాగ్రహం చేపడుతూ శిస్తు తగ్గించుకోవడంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. రక్షిత కౌలుదారుల సాగులో ఉన్న భూములను వారికి పట్టాలు ఇప్పించడంలో ప్రముఖ పాత్ర పోషించారు.

ఆనాడు గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం ఆసరా చేసుకుని అతి తక్కువ వేతనాలు కూల్లు ఇస్తుండేది. గ్రామాల్లో కూలి సంఘాలను ఏర్పాటు చేసి కూలి రేట్లు పెంచడంలోనూ జీతగాళ్ల( పాలేర్లకు) జీతాలు పెంచడంలోనూ ఉద్యమాలు నడిపించారు. చాలా గ్రామాలలో ఆబ్కారి విధానం (కల్లు సారాయి దుకాణాల వేలం) ఉండేది. ఈ అరాజు విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర గీతపని వారల సంఘం అధ్యక్షులు బి.ధర్మబిక్షం సహకారంతో తాలూకాలో గీత కార్మికులను సంఘటన పరిచి సంఘాలు పెట్టి 'గీసే వానికి చెట్టు', విధానం కొరకు గీత పనివారల సంఘాలు ఏర్పాటు చేసి తాలూకాలో వేలములను బహిష్కరించి వేలం లేని విధంగా కార్మికులకు ఇప్పించారు.

కరువు పీడిత ప్రాంతంగా ఉన్న దేవరకొండ తాలూకాకు కృష్ణా జలాలు అందించాలని..అందుకు ఎస్ఎల్బీసీ (శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం) చేపట్టాలని, కమ్యూనిస్టు పార్టీ ద్వారా అనేక సందర్భాల్లో ఉద్యమాలు చేపట్టడం జరిగింది. మునుగోడు నియోజకవర్గం శాసనసభ్యులుగా ఫ్లోరిన్ పీడిత గ్రామాలకు శాశ్వత రక్షిత మంచి పథకం చేపట్టాలని ఉద్యమించి కృష్ణా జలాలను 90% గ్రామాలకు ఇప్పించడం జరిగింది.

ఇప్పటి రాజకీయాల్లో ధన బలం, అధికార ప్రదర్శన, ఆధిపత్యం పెరిగింది. విలువలకు తిలోదాకాలు ఇచ్చి పార్టీ కండువా మార్చడం సాధారణమైంది. ఓటర్లను ప్రలోభపెట్టే ధోరణి విస్తరించింది. పదవిని సంపాదన మార్గంగా వినియోగించే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితులకు ఉజ్జిని జీవితం పూర్తిగా వ్యతిరేకం.

**నిరంతరం ప్రజలలో ఉండేవారు :**

జనబలం అసలైన బలమనినమ్మేవారు.. ప్రజలలో ఉండేవారు. ప్రజల మధ్యలో ఉండటం తిరగడం నాయకత్వానికి మూలమని చాటారు. పారదర్శకత ప్రజా విశ్వాసాన్ని పెంచుతుందని వివరించారు. నిబద్ధతతో సేవచేస్తే గౌరవం స్వయంగా వస్తుందని నిరూపించారు. ప్రజా ప్రతినిధి అంటే అధికార ప్రదర్శన కాదు. సేవా భావం కావాలి. నైతిక విలువలు రాజకీయాలకు ప్రామాణికం కావాలి. ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఉండాలి. ఈ మార్గాన్ని చూపిన ఆదర్శ నాయకుడు ఉజ్జిని నారాయణరావు.

శాసనసభ్యుడిగా ఉన్నప్పటికీ మొదటి టర్మ్ పూర్తిగా బస్సులోనే తిరిగేవారు. రెండవ టర్మ్ లో జీపులో అంగరక్షకులు లేకుండా తిరిగేవారు. ఆ తర్వాత మూడవ టర్మ్ లో ఎంబాసిడర్ కార్ వాడారు.

సిపిఐ లో ఆరు దశాబ్దాల పాటు నల్లగొండ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులుగా, దేవాదాయ భూముల సాగుదార్ల రైతు సంఘం అధ్యక్షులుగా, ప్రజాప్రతినిధులుగా పనిచేసి తన 90వ ఏట వృద్ధాప్యంతో 2016 జులై 13 కన్నుమూశారు. వారు మన నుండి దూరమై 10సంవత్సరాలు అవుతున్న దేవరకొండ తాలూకా ప్రజలు..మునుగోడు నియోజకవర్గ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నారు. ప్రజల కోసం బతికిన వారు ఎల్లకాలం జీవిస్తారనే సత్యానికి ఉజ్జిని జీవితం నిలువెత్తు నిదర్శనం.

**ఉజ్జిని రత్నాకర్ రావు**

# సంపద పెరిగినా... దేశం స్థాయి మారలేదు!

**డా॥ జ్ఞాన్ పాఠక్**

ప్రపంచంలో నామమాత్ర స్థూల దేశీయోత్పత్తి పరంగా భారత్ 4.18 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో నాలుగో అతిపెద్ద దేశం అని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే దేశపు ఆర్థిక వ్యవస్థ ఎంత అనే దానికంటే, ఆ దేశ ప్రజల సగటు ఆదాయం ఎంత అనే అంశం మీదనే అభివృద్ధిని అంచనా వేయాలి. ఈ నేపథ్యంలో వరల్డ్ బ్యాంక్ తాజాగా విడుదల చేసిన దేశాల ఆదాయ వర్గీకరణ భారత్ ఆర్థిక పురోగతిపై మరో కోణాన్ని చూపిస్తోంది. 2025 ప్రపంచ బ్యాంక్ గణాంకాల ఆధారంగా విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, భారత్ ఇంకా దిగువ మధ్య ఆదాయ దేశంగానే ఉంది. 2025లో భారత్ తలసరి స్థూల జాతీయ ఆదాయం 2,760 అమెరికన్ డాలర్లుగా మాత్రమే నమోదైంది. భారత్ 2007లో తక్కువ ఆదాయ దేశాల జాబితా నుంచి దిగువ మధ్య ఆదాయ దేశాల జాబితాలోకి చేరింది. ఆ తర్వాత దాదాపు 19 సంవత్సరాలుగా ఎలాంటి ఎదుగూబొదుగూ లేకుండా కొనసాగుతూ వస్తోంది. అంటే ఇన్నేళ్లుగా ఆర్థికాభివద్ధి జరిగినా ఎగువ మధ్య ఆదాయ దేశంగా మారే స్థాయికి భారత్ చేరుకోలేకపోయింది. 2025 నాటికి వరల్డ్ బ్యాంక్ మొత్తం 218 దేశాలను నాలుగు ఆదాయ వర్గాలుగా విభజించింది. వీటిల్లో 25 దేశాలు తక్కువ ఆదాయ దేశాలు, 47 దేశాలు దిగువ మధ్య ఆదాయ దేశాలు, 59 దేశాలు ఎగువ మధ్య ఆదాయ దేశాలు, 87 దేశాలు అధిక ఆదాయ దేశాలు. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచినా, వ్యక్తిగత ఆదాయం పరంగా ఇంకా దిగువ మధ్య ఆదాయ దేశాల జాబితాలోనే ఉండటం గమనార్హం. ఈ ఏడాది వరల్డ్ బ్యాంక్ వర్గీకరణలో ఏ దేశం దిగువ ఆదాయ వర్గంలో లేదు. జోర్డాన్, మైక్రోనేషియా, ఫిలిప్పీన్స్, శ్రీలంక, వియత్నాం దేశాలు దిగువ మధ్య ఆదాయ దేశాల నుంచి ఎగువ మధ్య ఆదాయ దేశాలుగా ఎదిగాయి. అలాగే టోగో తక్కువ ఆదాయ దేశాల జాబితా నుంచి దిగువ మధ్య ఆదాయ దేశాల జాబితాలోకి చేరింది. అయితే భారత్ మాత్రం ఈసారి కూడా తన ఆదాయ వర్గాన్ని మెరుగుపరుచుకోలేకపోయింది. దక్షిణాసియా దేశాల్లో శ్రీలంక ప్రత్యేక గుర్తింపు పొందింది. 2022లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో ఆ దేశం దివాలా తీసే స్థాయికి చేరినా, కేవలం మూడేళ్లలోనే ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుచుకుంది.

2025లో శ్రీలంక వాస్తవ జిడిపి 5 శాతం వద్ధి నమోదు చేసింది. పరిశ్రమలు, ఆర్థిక సేవలు, పర్యాటక రంగాల్లో పుంజుకోవడం వల్ల ఆ దేశం ఎగువ మధ్య ఆదాయ దేశంగా గుర్తింపు పొందింది. ఈ మార్పు శ్రీలంక ఆర్థిక పునరుద్ధరణకు నిదర్శనంగా నిలిచింది. 2026 జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన 2027 ఆర్థిక సంవత్సరానికి వరల్డ్ బ్యాంక్ ఆదాయ పరిమితుల ప్రకారం, 1,175 డాలర్ల కంటే తక్కువ తలసరి ఆదాయం ఉన్న దేశాలు తక్కువ ఆదాయ దేశాలుగా, 1,176 నుంచి 4,635 డాలర్ల వరకు ఉన్న దేశాలు దిగువ మధ్య ఆదాయ దేశాలుగా, 4,636 నుంచి 14,375 డాలర్ల వరకు ఉన్న దేశాలు ఎగువ మధ్య ఆదాయ దేశాలుగా, 14,375 డాలర్లకు పైగా ఉన్న దేశాలు అధిక ఆదాయ దేశాలుగా వర్గీకరించారు. ఇవి గత ఏడాది అమల్లో ఉన్న పరిమితుల కంటే ఎక్కువ.

2025–26లో తక్కువ ఆదాయ దేశాల పరిమితి 1,135 డాలర్లు కాగా, దిగువ మధ్య ఆదాయ దేశాల పరిమితి 1,136 నుంచి 4,495 డాలర్ల వరకు ఉండేది. ఎగువ మధ్య ఆదాయ దేశాల పరిమితి 4,496 నుంచి 13,935 డాలర్ల వరకు, అధిక ఆదాయ దేశాల పరిమితి 13,935 డాలర్లకు పైగా ఉండేది. వరల్డ్ బ్యాంక్ ప్రతి ఏడాది జూలై 1న, అంతకుముందు క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించిన తలసరి స్థూల జాతీయ ఆదాయం ఆధారంగా దేశాలను వర్గీకరిస్తుంది. ఒకసారి వర్గీకరణ ప్రకటించాక తదుపరి ఏడాది జులై 1 వరకు అదే అమల్లో ఉంటుంది. మధ్యలో గణాంకాలు సవరించినా ఆ ఏడాదికి వర్గీకరణను మార్చరు. దేశాల ఆదాయాన్ని లెక్కించేందు కు వరల్డ్ బ్యాంక్ అట్లాస్ పద్ధతిని ఉపయోగిస్తుంది. ఇందులో స్థానిక కరెన్సీని అమెరికన్ డాలర్లలోకి మార్చి, మారకపు విలువల్లో వచ్చే హెచ్చు తగ్గుల ప్రభావాన్ని తగ్గించేలా తలసరి స్థూల జాతీయ ఆదాయాన్ని లెక్కిస్తారు. ఈ ఏడాది విడుదల చేసిన వర్గీకరణలో మొత్తం 218 దేశాలు ఉన్నాయి. ఈ జాబితా 2027 జూన్ చివరి వరకు ప్రపంచవ్యాప్తంగా ప్రామాణిక సూచికగా ఉపయోగించబడుతుంది. ఈ ఆదాయ వర్గీకరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే ఏ దేశాలకు రాయితీ రుణాలు, అభివృద్ధి సహాయం అందించాలనే విషయాన్ని నిర్ణయించడంలో ఇది కీలకంగా ఉపయోగపడుతుంది. అలాగే ప్రభుత్వాలు, పరిశోధకులు, అంతర్జాతీయ సంస్థలు ప్రపంచ దేశాల ఆర్థిక పురోగతిని పోల్చి చూడటానికి ఈ వర్గీకరణను ఉపయోగిస్తాయి. స్థూల జాతీయ ఆదాయం అంచనాలను ఆయా దేశాల అధికారిక గణాంకాల ఆధారంగా వరల్డ్ బ్యాంక్ ఆర్థికవేత్తలు సిద్ధం చేస్తారు.

జనాభా అంచనాల కోసం ఐక్యరాజ్య సమితి విడుదల చేసే ప్రపంచ జనాభా విభాగంతో పాటు ఇతర విశ్వసనీయ వనరులను ఉపయోగిస్తారు. ప్రతి ఏడాది అందుబాటులో ఉన్న తాజా సమాచారం తో వర్గీకరణను రూపొందించినప్పటికీ, ఒక్క సూచికతోనే దేశ అభివృద్ధిని అంచనా వేయలేమని వరల్డ్ బ్యాంక్ పేర్కొంటోంది. 1987 నుంచి ప్రపంచ ఆదాయ వర్గీకరణలో మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పట్లో ప్రపంచ దేశాల్లో 30 శాతం దేశాలు తక్కువ ఆదాయ వర్గంలో ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 11 శాతానికి తగ్గింది. వరల్డ్ బ్యాంక్ పరిశీలించే దేశాల సంఖ్య కూడా 163 నుంచి 218కు పెరిగింది. నాలుగు దశాబ్దాలుగా వేలాది ఆర్థిక గణాంకాలను విశ్లేషిస్తూ రూపొందిస్తున్న ఈ ఆదాయ వర్గీకరణ ప్రపంచ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవడానికి విశ్వసనీయమైన ప్రమాణంగా గుర్తింపు పొందింది. మొత్తంగా చూస్తే, ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన భారత్, వ్యక్తిగత ఆదాయం విషయంలో దిగువ మధ్య ఆదాయ దేశంగానే కొనసాగుతోంది.

ఆర్థిక వ్యవస్థ పరిమాణం ప్రతి పౌరుడి ఆదాయంలో ప్రతిబింబించినప్పుడే దేశం ఎగువ మధ్య ఆదాయ దేశంగా ఎదుగుతుందని వరల్డ్ బ్యాంక్ తాజా నివేదిక స్పష్టం చేస్తోంది.

# కోదాడలో అత్యాధునిక ఆర్‌టిసి బస్‌స్టేషన్, డిపో

- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన
- ఐదున్నర ఎకరాల్లో కార్పొరేట్‌స్థాయి నిర్మాణం
- కోదాడను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ/హుజూర్‌నగర్ :** కోదాడ పట్టణంలో రూ.16.92 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ డిపో, ఆధునిక బస్‌స్టేషన్ నిర్మాణ పనులకు శనివారం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కోదాడలో కార్పొరేట్ స్థాయిలో అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన మోడల్ బస్‌స్టేషన్, డిపోను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతిరోజు సుమారు 30 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా ఒక బస్‌స్టేషన్, డిపో నిర్మాణానికి రూ.17 కోట్లకు చేరువైన నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. సుమారు ఐదున్నర ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక హంగులతో కూడిన మోడల్ బస్ స్టేషన్, డిపోను నిర్మిస్తున్నామని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన కోదాడకు వచ్చే ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆదర్శవంతమైన బస్సు స్టేషన్‌ను అందుబాటులో తీసుకువస్తామని చెప్పారు. కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి అభివృద్ధి నిధులను తీసుకొచ్చి కోదాడను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. కోదాడ పట్టణంలో నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందుబాటు రూ.26 కోట్లతో 100 పడకల హాస్పిటల్ సిటీస్కాన్ మిషన్, నాగార్జున సాగర్ కాలువలో లైనింగ్ పనులు, లిఫ్ట్ ఇరిగేషన్ రెడ్లకుంట, శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు గత ప్రభుత్వంలో పడకేసినవి పూర్తిగా నిరుపయోగంగా ఉండి పోయి, కొన్ని వేల ఎకరాలకు సాగునీరు తీసుకువస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులు చింతకుంట్ల లక్ష్మీ నారాయణరెడ్డి, కెవిఎల్ ప్రసాద్, బషీర్, కందుల కోటేశ్వరరావు, మేకల వెంకట్రావ్, పార సీతయ్య, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, వైస్ చైర్మన్ దేవరం మల్లీశ్వరి పాల్గొన్నారు.

**ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలన్నదే లక్ష్యం**
**రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని రాష్ట్ర రోడ్డు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో రూ.3.52 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న బస్‌స్టేషన్ నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రూ.3.52 కోట్లతో బస్ స్టేషన్ నిర్మాణం చేసుకోవడం సంతోషంగా ఉందని, తెలంగాణ వ్యాప్తంగా 10,173 ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందని, 35 లక్షల మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్నారన్నారు. మహిళా సంఘాలకు 600 బస్సులను అందించి మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కడుపు నింపేందుకు సన్న బియ్యంతో పాటు, మహిళలకు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, వైస్ చైర్మన్ కస్తూరి మల్లిఖార్జున్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక, ఆర్టీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కవిత, పట్టణ ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఎమిరేట్స్ ఎంఆర్ఓ ఆపరేషన్స్ కొనసాగించండి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ ఎ380 సర్వీసులను ప్రారంభించడానికి ఎమిరేట్స్ విమానయాన సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. ఎమిరేట్స్ విమానయాన సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ సంస్థ (ఇండియా నేపాల్) వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ సర్హన్ శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్– ఎమిరేట్స్ ఎ380 సర్వీసులను ప్రారంభించడంతో పాటు సంస్థ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాలలో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వాటి ప్రాధాన్యతను వివరిస్తూ, తెలంగాణలో ఎమిరేట్స్ ఎంఆర్ఓ ఆపరేషన్స్‌ను కొనసాగించాలని కోరారు. విమాన సర్వీసులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్ విషయంలో ఎమిరేట్స్ ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ సర్వీసులను ప్రారంభించడానికి మహ్మద్ సర్హన్ సానుకూలతను వ్యక్తం చేశారు. అలాగే క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో స్పాన్సర్‌షిప్ అందించడానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

# ఉత్తమ కమ్యూనిస్టులుగా జీవితం గడిపిన దొడ్డ సోదరులు ఆదర్శప్రాయులు

- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** తమ యావత్ జీవితాన్ని ఆదర్శ జీవితంగా గడిపిన దొడ్డ నర్సయ్య, దొడ్డ నారాయణరావు ఆదర్శప్రాయులని వారి ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో జరిగిన స్వాతంత్ర సమరయోధుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా సిపిఐ కార్యదర్శి మాజీ ఎంపిపి దొడ్డ నారాయణరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై వారు మాట్లాడుతూ దొడ్డ సోదరుల త్యాగం నిబద్ధత వల్ల చిలుకూరు గ్రామానికి ప్రతిష్ట పెరిగిందని, వయసు పెరిగినప్పటికీ అన్ని ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారని, ఇవాళ్ల ప్రపంచ యావత్తు కమ్యూనిస్టు పార్టీ వైపు చూస్తున్నదని ఇటీవల కాలంలో శ్రీలంకలో అధికారంలోకి వచ్చిందని అనేక దేశాలలో ముఖ్యంగా ప్రపంచంలోని 160 దేశాలలో ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అది ట్రంప్ కూడా కమ్యూనిస్టులు అంటే భయపడుతున్నాడని, ఇటీవల కాలంలో అమెరికా నగరంలో మేయర్ పదవిని కూడా కమ్యూనిస్టులే గెలుచుకున్నారని వారు ఈ సందర్భంగా ఉదాహరించారు. దొడ్డ నారాయణరావు ఒక ఆదర్శ నాయకుడిగా మచ్చలేని ప్రజా నాయకుడిగా పని చేశారని రాజకీయాలకు అతీతంగా కృషి చేసే వారని, ప్రజా ఉద్యమాలలో కీలకపాత్ర పోషించారని ఏ పార్టీ నాయకులైనా నారాయణరావు గౌరవించారన్నారు. ఈ దేశంలో ఈ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ కృషి గొప్పదని ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల వద్దకు తీసుకుని పోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకొని అమలు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉన్నదని వారు అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు స్వాగత ఉపన్యాసం చేయగా సిపిఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ సభకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, సాహెబ్అలీ, బద్దం కృష్ణారెడ్డి, నంద్యాల రామిరెడ్డి, దేవరం మల్లీశ్వరి, బత్తినేని హనుమంతరావు, డిసిసిబి మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, బూర వెంకటేశ్వర్లు, చేపూరి కొండలు, దొడ్డ నారాయణరావు కుమారులు దొడ్డ రమేష్‌బాబు, దొడ్డ శ్రీధర్, ఝాన్సీ, డాక్టర్ అంది సత్యం, డాక్టర్ జాస్తి సుబ్బారావు, రావెళ్ల సీతరామయ్య, సిపిఐ సర్పంచులు మండవ జయమ్మ, గుగులోత్ లలిత, కడియాల పద్మ, వాడకొప్పుల ఉమా పోతురాజు సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ కాటంరాజు, చిలువేరు ఆంజనేయులు, దొడ్డ నారాయణరావు కుటుంబసభ్యులు, పార్టీ ప్రజా సంఘాల నాయకులు కొండా కోటయ్య, దొడ్డ వెంకటయ్య, రెమిడాల రాజు, పిల్లుట్ల కనకయ్య పాల్గొన్నారు.

# నీటిని ఎత్తిపట్టడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కన్నెపల్లి పంప్‌హౌజ్ వద్ద లక్ష క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నప్పటికీ, వాటిని ఎత్తిపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహారిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. ఈ పంప్‌హౌజ్‌ల ద్వారా నీటిని ఎత్తిపోయవచ్చని రిటైర్డ్ ఉద్యోగులు ప్రభుత్వానికి సూచించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి తన పాలన పట్ల పూర్తి విశ్వాసం ఉంటే శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలని,లేదా కనీసం స్థానిక సంస్థలు, పార్టీ ఫిరాయించిన పది మంది ఎంఎల్ఎలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకైనా సిద్ధమవ్వాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసనమండలిలో ప్రధానప్రతిపక్ష నేత ఎస్. మదుసూధనాచారి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, టి.రాజయ్య, మాజీ ఎంపి నామా నాగేశ్వర్‌రావు, గంద్ర వెంకటరమణారెడ్డి తదితరులతో కలిసి కెటిఆర్ మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కన్నెపల్లి పంప్‌హౌజ్ వద్ద నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. ఒక వేళ ప్రభుత్వం స్పందిచకపోతే ఈ విషయంలో బిఆర్ఎస్ తరపున ఒక కార్యచరణ తీసుకోనున్నట్టు వెల్లడించారు. కాళేశ్వరంలో మేడిగడ్డతో సంబంధం లేకుండా మొత్తం గోదావరి పరివాహక ప్రాంతంలోని రైతులకు, ప్రజలకు నీళ్లు అందించే అవకాశం ఉన్నప్పటికీ సిఎం తన మూర్ఖత్వంతో తెలివితక్కువతనంతో గత ప్రభుత్వం పైన ద్వేషంతో పంటలను, ప్రజలను ఎండబెడుతున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో వర్షం కూడా పడకపోవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారని, గోదావరి బేసిన్ లో ఉన్న రిజర్వాయర్ల స్టోరేజీ కూడా సగానికి పైగా ఖాళీగా ఉన్నాయన్నారు. మరోవైపు కన్నెపల్లి వద్ద లక్షల క్యూసెక్కుల నీరు కిందికి పారుతుందని, అక్టోబర్ వరకు కూడా సుమారు ఒక లక్ష క్యూసెక్కుల నీరు కిందికి వృధాగా పోయే అవకాశాలు ఉన్నాయని, ఈ నీటిని ప్రతిరోజూ 2 టిఎంసిల చొప్పున వంద రోజుల పాటు ఎత్తిపోస్తే గోదావరి బేసిన్ లోని మిడ్ మానేరు, లోయర్ మానేరు, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, అనంతగిరి, మల్కపేట, బస్వపూర్ రిజర్వాయర్లు అన్నీ నిండుతాయని వివరించారు. ఈ విషయాన్ని ఇటీవల తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్లు స్పష్టంగా ముఖ్యమంత్రికి వివరిస్తూ ఒక లేఖ రాశారని కెటిఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తమపైన కోపం, ద్వేషం ఉండవచ్చని, కానీ తెలంగాణ ప్రజలపైన, రైతులపైన అక్కసు పెట్టుకోకుండా కిందికి పారుతున్న నీటిని ఎత్తిపోస్తే అందరికీ మంచి జరుగుతుందని సిఎంకు సూచించారు. ఇప్పటికే అన్నారం, సుందిళ్ల విషయంలో కూడా గ్రౌటింగ్ పూర్తయిందని, అక్కడ సురక్షితంగా నీటిని నిల్వ చేసి వాడుకోవచ్చనే విషయాన్ని ప్రభుత్వంలోని ఇంజనీర్లే స్పష్టం చేస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సొంత ముఖ్యమంత్రి తన రాష్ట్ర ప్రాజెక్టుల గురించి దరిద్రంగా మాట్లాడుతున్నారన్నారు. మేడిగడ్డకు సంబంధమే లేని, ఎక్కడో సుదూరాన ఉన్న భద్రాచలం రాముడితో పాటు 44 ఊర్లు నిండిపోతాయని, మునిగిపోతాయని సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కన్నెపల్లి దగ్గర పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ రాజకీయ ద్వేషంతో కళ్ళు మూసుకుపోయిన రేవంత్ రెడ్డికి బుర్ర తక్కువనా? లేదా నీటిని ఎత్తిపోయాలని చెబుత్ను తమకు బుర్ర తక్కువనా అని కెటిఆర్ ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్తే ఉదయం కాంగ్రెస్‌తో, రాత్రి బిజెపితో ఉంటారని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి చేసుకున్న సొంత సర్వేలోనే బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని తేలిందని, దేవునిపైన ప్రమాణం చేసి సర్వే వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల గుర్తింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రస్తుత రాజకీయ అనుబంధాలు పక్కనబెట్టి నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని టిజెఎసి నేతలు అమరవీరుల సాక్షిగా ఏకగ్రీవంగా ప్రకటించారు. తమ సూచనలను రాతపూర్వకంగా కమిటీకి అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నిర్వహించిన ముఖాముఖి సంప్రదింపుల సమావేశంలో ఉద్యమ కాలంలో తెలంగాణ సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చిన టిజెఎసి స్టీరింగ్ కమిటీ సభ్యులు, అనుబంధ జెఎసిల ప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పెద్దఎత్తున హాజరై ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు పూర్తి మద్దతు ప్రకటించారు. సమావేశానికి ప్రొఫెసర్ ఎం. కోదండరామ్‌తో పాటు టిజిఓ, టిఎన్‌జిఓ, ఆర్‌టిసి జెఎసి, ఎలక్ట్రిసిటీ జెఎసి, అడ్వకేట్ జెఎసి, డాక్టర్స్ జెఎసి, ఇంజనీర్స్ జెఎసి, ఉపాధ్యాయ సంఘాలు, తెలంగాణ మాల మహానాడు, తెలంగాణ వికాస సమితి ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే ఉద్యమ కాలంలో కలిసి పనిచేసిన టిఆర్ఎస్, బిజెపి, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యమకారులకు అధికారిక ప్రశంసా పత్రాలు ఇవ్వాలని, ఇండ్లు లేని నిరుపేద ఉద్యమకారుల కుటుంబాలకు 250 గజాల నివాస స్థలాలు కేటాయించాలని, వృద్ధాప్య పెన్షన్లు, ఉచిత కార్పొరేట్ వైద్యం, ప్రత్యేక హెల్త్ కార్డులు, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా లభించిన ఈ ఏకగ్రీవ మద్దతు వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి ఉద్యమకారుడిని పారదర్శకంగా గుర్తించడం సులభమవుతుందని అన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న డిజిటల్ స్క్రీనింగ్ ఆధారంగా తుది నివేదిక సిద్ధం చేసి సిఎం రేవంత్ రెడ్డికి అందజేస్తామని వెల్లడించారు.

# వైభవంగా యాదాద్రి నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

- ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి కొండా సురేఖ, విప్ బీర్ల అయిలయ్య, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి
- దేవస్థాన చైర్మన్‌గా మన్నె సత్యనారాయణరెడ్డి బాధ్యతలు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు పాలక మండలిప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ నూతన కమిటీ బాధ్యతలను స్వీకరించింది. ఈ వేడుకకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిలు ప్రత్యేకంగా విచ్చేసి నూతన పాలక మండలికి తమ శుభాకాంక్షలు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన మన్నె సత్యనారాయణరెడ్డి ఈ సందర్భంగా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. వారితో పాటు నామినేటెడ్ సభ్యులుగా కొణిదెల సురేఖ, జి.వినోద్ వెంకటస్వామి, చిలప్పగారి విజయ రాజం, విజయేందర్ తుల్ల, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కంతమనేని, ఎం.రాఘవేంద్ర రావు, డి.లక్ష్మీ నారాయణ నాయక్‌లు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, యాదాద్రి క్షేత్రాన్ని దేశంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. భక్తులకు నాణ్యమైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం నూతన పాలక మండలికి అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యాదాద్రి క్షేత్రం తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక వైభవానికి నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. దేశ విదేశాల నుండి వచ్చే లక్షలాది మంది భక్తులకు మరింత మెరుగైన వసతులు, పారదర్శకమైన పరిపాలన, సత్వర సేవలు అందించేలా నూతన పాలక మండలి సమిష్టిగా, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా భక్తుల క్యూ లైన్లు, తాగునీరు, పరిశుభ్రత, వసతి, అన్నదాన సేవలు, పార్కింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ మహోత్సవంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి (ఈఓ), ఆలయ ప్రధాన అర్చకులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# యువతకు నెహ్రూ,గాంధీ భావజాలమే దిక్సూచి

- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ, ఫాసిస్టు శక్తులను ఎదుర్కొనే చైతన్యాన్ని యువతలో పెంపొందించాలని, నెహ్రూగాంధీ భావజాలాన్ని ప్రతి యువకుడు ఆదర్శంగా తీసుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. యువతకు భారతదేశ ఆలోచన (ఐడియా ఆఫ్ ఇండియా), పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలు, కాంగ్రెస్ సిద్ధాంతాలను విస్తృతంగా చేరవేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జవహర్ బాల్ మంచ్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల 'మిరాయి' జాతీయ శిక్షణ శిబిరాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్ బాల్ మంచ్ కార్యకలాపాలకు తన పూర్తి మద్దతు ప్రకటించిన ఆయన, తెలంగాణలో నిర్వహించనున్న తదుపరి జాతీయ బాలల శిబిరానికి కూడా కాంగ్రెస్ పార్టీ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జవహర్ బాల్ మంచ్ జాతీయ అధ్యక్షుడు జి.వి. హరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర చైర్మన్ అడ్వకేట్ మామిడి రిషికేశ్ రెడ్డి సమన్వయం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి జాతీయ సమన్వయకర్తలు, రాష్ట్ర చైర్మన్లు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. యువ నాయకుల్లో నాయకత్వ లక్షణాలు, సంస్థాగత నైపుణ్యాలు, సేవాభావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ రెండు రోజుల 'మిరాయి' జాతీయ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# సోషలిజమే శాంతికి పునాది


- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ శాంతి, సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు సోషలిజమే ప్రత్యామ్నాయమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద శక్తులు యుద్ధాలను ప్రోత్సహిస్తూ, కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశాలపై ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో సోషలిస్టు భావజాలమే ప్రజల మధ్య ఐక్యత, సౌభ్రాతృత్వం, శాంతిని నెలకొల్పగలదని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థి, యువజనుల రాజకీయ శిక్షణ తరగతులను బాలచంద్ర కాంగో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి, ప్రజాస్వామ్యం, లౌకికత, సామాజిక న్యాయం, శాస్త్రీయ సోషలిజం విలువలను కాపాడే బాధ్యత యువతపై ఉందన్నారు. ఇందు కోసం శాంతిని కోరుకునే ప్రతి యువకుడు, ప్రతి విద్యార్థి శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతాన్ని అధ్యయనం చేసి ప్రజా ఉద్యమాల్లో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారీ విధానం అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, దోపిడీని మరింత పెంచుతోందని, ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకున్న సోషలిస్టు సమాజ నిర్మాణమే దీనికి ప్రత్యామ్నాయమని అభిప్రాయపడ్డారు. యువత సిద్ధాంతాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసే కమ్యూనిస్టు కార్యకర్తలుగా ఎదగాలని సూచించారు. పార్టీ జాతీయ సమితి ఏర్పాటు చేస్తున్న శిక్షణా కార్యక్రమాలలో మార్క్సిజం–లెనినిజం, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి అంశాలపై లోతైన అవగాహన కల్పిస్తాయని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని సిద్ధాంతపరంగా బలమైన నాయకత్వంగా ఎదిగి ప్రజల కోసం నిరంతరం పనిచేయాలని యువతకు ఆయన సూచించారు. దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను యువత మరింత బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో సిపిఐ సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీల్ రాజాంవాలే, ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు రోషన్ కుమార్ సిన్హా, ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, కార్యనిర్వహక అధ్యక్షులు నేర్లకంటి శ్రీకాంత్, ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్య ప్రసాద్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేరాలపై డిజిపి ఉక్కుపాదం

- జిల్లాల క్షేత్రస్థాయి వరుస పర్యటనలు
- క్రైమ్ రివ్యూలతో పోలీసింగ్‌కు కొత్త పదును



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చేందుకు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ప్రతి జిల్లాలో పోలీసు అధికారులతో నేరుగా సమావేశమై క్రైమ్ రివ్యూ నిర్వహిస్తూ, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల ధోరణి, దర్యాప్తు పురోగతి, కోర్టుల్లో కేసుల స్థితిగతులపై సమగ్రంగా సమీక్షిస్తున్నారు. ఇటీవల ఖమ్మం జిల్లా మణుగూరులో నిర్వహించిన క్రైమ్ రివ్యూ సమావేశం ఈ కొత్త కార్యాచరణకు నాంది పలికింది. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇదే తరహా సమీక్షలు జరగనున్నాయి. డిజిపి లక్ష్యం కేవలం నమోదయ్యే నేరాల సంఖ్యను తగ్గించడం మాత్రమే కాదు. నేరం జరిగిన వెంటనే సమర్థవంతమైన దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, వేగంగా చార్జ్‌షీట్లు దాఖలు చేయడం, చివరకు నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడేలా కేసులను పటిష్ఠంగా సిద్ధం చేయడం పైనా ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం పోలీసు శాఖ ముందు సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆర్థిక మోసాలు వంటి కొత్త సవాళ్లు ఉన్నాయి. వీటిని ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాల వినియోగాన్ని పెంచాలని డిజిపి అధికారులకు సూచిస్తున్నారు. క్రైమ్ రివ్యూ సమావేశాల్లో పెండింగ్ కేసులు, హత్యలు, దోపిడీలు, చోరీలు, సైబర్ మోసాలు, మహిళలపై దాడుల కేసులు, పిఒసిఎస్ఓ కేసులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, బెయిల్‌పై విడుదలైన నేరస్థులపై నిఘా వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ పనితీరు, కేసుల విచారణలో జాప్యానికి గల కారణాలు, వాటి పరిష్కార మార్గాలపై కూడా సమీక్ష జరుగుతోంది. నిందితులకు శిక్షలు పడే శాతాన్ని పెంచాలంటే దర్యాప్తులో నాణ్యత ఎంతో కీలకమని డిజిపి స్పష్టం చేస్తున్నారు. చిన్నచిన్న సాంకేతిక లోపాల వల్ల కోర్టుల్లో కేసులు బలహీనపడకుండా ప్రతి చార్జ్‌షీట్ పకడ్బందీగా ఉండాలని సూచిస్తున్నారు. విచారణాధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మధ్య సమన్వయం పెంచాలని ఆదేశిస్తున్నారు.

## మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ:** నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని, గ్రామాల అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలంలో రూ.2.50 కోట్ల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పనిచేస్తుందని గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ అభివృద్ధి పనుల కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి సుమారు రూ.2.50 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మెరుగైన రోడ్డు కనెక్టివిటీతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఒకే రోజు రూపిరెడ్డిపల్లి, పోచంపల్లి, మడతపల్లి, పొనగండ్ల, గుడిపల్లి, పెద్దపల్లి, గడిపల్లి, రేగొండ, రావులపల్లి, జూబ్లీ నగర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## అర్హుల పేర్లు పోకుండా జాగ్రత్త పడాలి



**ప్రజాపక్షం/వరంగల్‌టౌన్:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా జరిగేలా బిఎల్‌ఏలు బాధ్యతగా వ్యవహరించాలని వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం 43వ డివిజన్ లోని పలు గ్రామంలోని బిఎల్‌ఏ లకు తిమ్మాపురులోని క్యాంపు కార్యాలయంలో హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు,ఎస్ఐఆర్ ప్రక్రియ ఇంచార్జ్ శ్రీమతి సౌమ్యదిలీప్ రాజ్ ల అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంత శాతం పూర్తయింది, ఓటర్లు అందరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలో పొందుపర్చిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని బిఎల్‌ఏలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మాడుగుల రాజ్ కుమార్, అరుణ విక్టర్, చింత, ప్రకాష్, నరేందర్ రెడ్డి, శివ కుమార్, కొమురెల్లి యాదవ్, అరుణ, దశరథం, డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జనాభా నియంత్రణ లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సిహెచ్ మధుసూదన్ పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఐడిఓసి కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జూలై 11 నుంచి 18 వరకు జిల్లా వ్యాప్తంగా జనాభా నియంత్రణ, మాత శిశు సంరక్షణ, అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడు సంవత్సరములు ఎడం ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలని, దీని వలన తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. బాల్య వివాహాలు ప్రోత్సహించరాదని ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్యం, విద్య సమానత్వం బాధ్యతయుతమైన జీవన విధానం చిన్న కుటుంబంతోనే సాధ్యమని తెలిపారు. ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తారని, 2026 సంవత్సరానికి గాను దీని ప్రధాన థీమ్ యువత ఆశలు ఆకాంక్షలు నెరవేర్చడం నేడు, భవిష్యత్తు కోసం తెలంగాణలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా కుటుంబ నియంత్రణ ఆరోగ్య సంరక్షణ, సుస్థిర అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, జనాభా నియంత్రణ, వనరుల సద్వినియోగం పై ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నాయన్నారు.

**13న జాతీయ నులిపురుగుల దినోత్సవం**

ఈ నెల 13న నిర్వహించబోయే జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమమును విజయవంతం చేయాలని డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సిహెచ్ మధుసూదన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఓ లు డాక్టర్ శ్రీదేవి, సందీప్, డెమో కె శ్రీదేవి, ఏఎంఓ సుధాకర్, సూపర్వైజర్‌లు ఏఎన్ఎంలు హెల్త్ అసిస్టెంట్లు ,ఆశాలు తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## విద్యార్థులకు 'స్పోర్ట్స్ ఆన్ వీల్స్' శిక్షణ



**ప్రజాపక్షం/ములుగు:** టిటి శాట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్పోర్ట్స్ లాడర్ డ్రిల్స్, ఫిట్‌నెస్ వ్యాయామాలు, అథ్లెటిక్స్‌లో ప్రాథమిక శిక్షణ అందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడమే కార్యక్రమం లక్ష్యమని టిజి శాట్ కోచ్‌లు శ్రీనివాస్, సైదులు, కుమార్ బాబు, ఫిజియోథెరఫిస్ట్ రాకేష్ శిఖానా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్య ఇస్తోందని, జిల్లాలోని అన్ని మండలాల్లో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బలుగూరి వేణు, జిల్లా పీడీలు మల్లయ్య, మదన్ మోహన్, లవణీక, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఆదినారాయణ, స్థానిక కోచ్‌లు సతీష్, శ్రీరామ్మ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.తత

# 'సర్' ప్రక్రియలో నిర్లక్ష్యం సహించబోం

**14లోపు 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి**

**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం సహించేది లేదని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి స్పష్టం చేశారు.శనివారం హనుమకొండ పట్టణంలోని గాంధీనగర్, అశోక్ కాలనీ, గోకుల్ నగర్, లష్కర్ సింగారం, లష్కర్ బజార్ తదితర ప్రాంతాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఎస్ఐఆర్ నమోదు ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమీక్షించారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో (బీఎల్‌ఓలు) మాట్లాడిన కలెక్టర్, ఫారముల స్వీకరణ, వాటి డిజిటలైజేషన్ పురోగతి, పెండింగ్ వివరాలను స్వయంగా పరిశీలించారు. లష్కర్ బజార్ పరిధిలో డిజిటలైజేషన్ పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సంబంధిత బీఎల్‌ఓను మందలించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ నెల 14వ తేదీలోపు ఎస్ఐఆర్ నమోదు ఫారాల డిజిటలైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు అందిన దరఖాస్తులను అదే రోజు డిజిటలైజ్ చేసి పెండింగ్ లేకుండా చూడాలని, పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని సూచించారు.డిజిటలైజేషన్ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను జిల్లా స్థాయి అధికారులు స్వయంగా సందర్శించి ప్రతిరోజూ సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించి లక్ష్య సాధనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, ఐకేపీ ఏపీఎంలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు, రిసోర్స్ పర్సన్ల సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. సంబంధిత సిబ్బంది బీఎల్‌ఓలకు పూర్తిస్థాయిలో సహకరించి ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.అర్హత ఉన్న ఒక్క ఓటరు ఓటు హక్కును కోల్పోకూడదని, ప్రతి అర్హ ఓటరిని గుర్తించి, వారి దరఖాస్తులను సకాలంలో స్వీకరించి డిజిటలైజేషన్ పూర్తి చేయడం మనందరి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆదివారం ప్రత్యేక కార్యాచరణతో అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## 45 మందికి రూ.25లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని మాజీ మంత్రి, ఎంఎల్‌సి బస్వరాజ్ సారయ్య నివాసంలో శనివారం సిఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 45 మంది లబ్ధిదారులకు రూ.25లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అయూబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్వరాజు సారయ్య మాట్లాడుతూ ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తోందన్నారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నల్లగొండ రమేష్, నరేంద్ర కుమార్, శిరీష శ్రీమన్, తత్తరీ లక్ష్మణ్, జన్ను అరోహన్, దూరం సంపత్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలపై పరిష్కారానికే ఎఐటియుసి మహాసభలు

**మహాసభలను సక్సెస్ చేయాలి: సతీష్ పిలుపు**



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నేడు ఏఐటీ యూసీ జిల్లా 4వ మహాసభలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజ్ సతీష్ తెలిపారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మహాసభల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రం లోని పైలట్ కాలనీ బస్టాండ్ ఏరియాలోని సింగరేణి కమ్యూనిటీ హాల్లో నిర్వహించే ఏఐటియుసి మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. మహాసభలకు అధ్యక్షులుగా మోటపలుకుల రమేష్, ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరిమి రాజ్ కుమార్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వెంకటేష్ హాజరుకానున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తోందని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఈ మహాసభలు వేదిక అవుతాయని అన్నారు. ఈ 4వ మహాసభలు ఉదయం 9:30 గంటల కు ప్రారంభం జెండా ఆవిష్కరణ, ఉదయం 10 గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభం, 10:30 కు కార్యదర్శి నివేదిక, 11 గంటలకు చర్చలు ప్రారంభం, 1ఒంటిగంటకు భోజన విరామం, రెండు గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభం, నాలుగు గంటలకు జిల్లా నూతన కమిటీ ఎన్నిక, ఐదు గంటలకు మహాసభ ముగుస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ తెలిపారు. జిల్లాలో ఉన్న కార్మికులంతా సకాలంలో హాజరై మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్, ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

**ప్రజాపక్షం/ వరంగల్ :** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిధిలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈ సంవత్సరం థీమ్ పిల్లలకు సరైన అంతరం ఉంటే, కుటుంబాలు ఆరోగ్యంగా మరియు నైపుణ్యంతో ఉంటాయి ఆధారంగా ఈ నెల 11వ తేదీ నుండి 18వ తేదీ వరకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇంచార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఐ. ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కీర్తినగర్‌లో నిర్వహించిన ర్యాలీ, అవగాహన కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి (ఎన్‌సీడీ) డా. సయ్యద్ ఇక్తాదార్ అహ్మద్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కుటుంబ ఆరోగ్యం, తల్లిశిశు సంక్షేమం కోసం పిల్లల మధ్య తగినంత కాన్పుల అంతరం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అందు కోసం దంపతులు తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డా. హుస్సేన్, ప్రసన్న, వెంకటేశ్వర్లు, సిఓ విఠల్, ఇతర ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ప్రజలు పాల్గొన్నారు.

## విపత్తు సమయంలో స్వీయ రక్షణ

**'ఎన్‌డిఆర్ఎఫ్' అవగాహన కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ సత్య శారద సమీక్ష**



**ప్రజాపక్షం/వరంగల్:** వరంగల్ జిల్లాలో 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్, విజయవాడ బృందం ఆధ్వర్యంలో జూలై 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న సామాజిక అవగాహన, విపత్తు సంసిద్ధత కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక, వరదలు, అగ్నిప్రమాదాలు, ఇతర ప్రకృతి విపత్తులకు గురయ్యే ప్రాంతాల గుర్తింపు, ముందస్తు సంసిద్ధత చర్యలు, ప్రజలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ ఎన్‌డీఆర్ఎఫ్ బృందానికి అవసరమైన సమాచారం, పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విపత్తులు ఎప్పుడు, ఎక్కడ సంభవిస్తాయో తెలియదని, అలాంటి పరిస్థితుల్లో ఎన్‌డీఆర్ఎఫ్ అందిస్తున్న శిక్షణ ప్రాణాలను కాపాడడంలో ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, ప్రజాప్రతినిధి ఇటువంటి నైపుణ్యాలను నేర్చుకోవాలని, జిల్లాలోని అన్ని మండలాలు, విద్యాసంస్థల్లో విపత్తు నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ దీపక్ కుమార్ నేతృత్వంలోని బృంద సభ్యులు కె. వెంకటేశ్వర్లు, ఐ. హరి కృష్ణ, ఎస్. సతీష్ కుమార్ ఆచరణాత్మక ఎన్‌డీఆర్ఎఫ్ బృందం విపత్తుల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం పై సహాయక చర్యలను ప్రత్యక్షంగా ఆచరణాత్మక ప్రదర్శనలు నిర్వహించారు. తుఫానులు, వరదలు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు భయాందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చడం, గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించడం, అగ్నిప్రమాదాల సమయంలో మంటలను అదుపు చేసే పద్ధతులు, అగ్నిమాపక పరికరాల వినియోగంపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు పి. సంధ్యారాణి, వై.వి. గణేష్, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ,ఉమారాణి, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్రా అభివృద్ధే సర్పంచుల ప్రధాన లక్ష్యం

**రైతులు తక్కువ నీటితో సాగు చేసే పంటలు వేయాలి**

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**




**ప్రజాపక్షం/గీసుకొండ :** గ్రామాల సమగ్ర అభివృద్ధే సర్పంచుల ప్రధాన లక్ష్యం అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.శనివారం గీసుగొండ మండలం గంగాదేవి పల్లి గ్రామంలోని గ్రామపంచాయతీసమగ్ర అభివృద్ధి ప్రణాళిక సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద, అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సర్పంచులు గ్రామ ప్రజల యొక్క సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి కృషి చేయాలని అన్నారు. ప్రజా ప్రతినిధిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రాథమిక బాధ్యత అన్నారు.5 సంవత్సరాల పదవీకాలంలో గ్రామాన్ని అభివృద్ధి చేసి, ప్రజల విశ్వాసం–మన్ననలు పొందడమే ప్రతి సర్పంచ్ లక్ష్యం కావాలి అన్నారు.గంగదేవి పల్లి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారుసర్పంచులు గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకొని సరైన ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాలను ముందుకు తీసుకు వెళ్ళాలి అన్నారు. ప్రజలకు అత్యవసరమైన పనులను మొదటి ప్రాధాన్యతగా గుర్తించాలని,అలాగే ఆరోగ్యపరమైన చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురిసేఅవకాశం ఉన్నందున రైతులు వర్షాభావ పంటలు తక్కువ నీటితో సాగు చేసే పంటలు వేసే విధంగా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని,ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్య, ఆరోగ్యం, పచ్చదనం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికలు ఏర్పాటు చేయాలన్నారు.అనంతరం జలసిరి ప్రతిజ్ఞా చేశారు.

## బచ్చన్నపేటలో భారీ చోరీ

**9.5 తులాల బంగారం, 1.6 కేజీల వెండి అపహరణ**

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఒక ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి భారీ చోరీకీ పాల్పడ్డారని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వేల నగదుతోపాటు సుమారు 9.5 తులాల బంగారు ఆభరణాలు, 1.6 కిలోల వెండి వస్తువులను దుండగులు అపహరించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన దొంతుల సోమలింగం హైదరాబాద్‌కు వెళ్లగా తిరిగి జులై 10వ రాత్రి సుమారు 10 గంటలకు కుటుంబ సభ్యులు ఇరిగి వచ్చేసరికి ఇంటి ప్రధాన తాళం పగులగొట్టి ఉంది, లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి, అందులోని నగదు, నగలు దొంగలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ఇళ్లకు తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్లేటపుడు తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రజలు భాగస్వాములు కావాలి



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా 23వ పోలింగ్ బూత్ పరిధిలోని ఎస్సి కాలనీలో ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడంతో పాటు వివరాలను సరిచేసేఉకోవాలని సూచించారు.ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోని ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్‌ఓ) దోసపాటి జ్యోతికి అందజేయాలని కోరారు. ఓటరు జాబితా కచ్చితత్వం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గోని ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు హెచ్ శివ నాయకులు కందికట్ల బిక్షపతి జన్ను సారయ్య నమిలి రమేష్ జి ఎల్లయ్య యాకయ్య తదితరులు పాల్గోన్నారు.

## మహిళల చేతుల్లోనే గ్రామాల అభివృద్ధి



**ప్రజాపక్షం/నెక్కొండ:** మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితేనే కుటుంబం, గ్రామం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి అన్నారు. నెక్కొండ మండలంలో పలు గ్రామాలలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘం భవనాలకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలు కేవలం పొదుపు సంఘాలుగానే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన శక్తిగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఏ పేర్కొన్నారు. మహిళలకు శాశ్వత మౌలిక వసతులు కల్పించడం ద్వారా స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ, వ్యాపార అవకాశాలు మరింత విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి..స్వయం సమృద్ధి సాధించి కుటుంబానికి అండగా నిలవాలి. మహిళలు లక్షాధికారులు, కోటీశ్వరులుగా ఎదిగేలా ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. మహిళల ఆత్మ విశ్వాసమే రాష్ట్ర అభివృద్ధికి నిజమైన పెట్టుబడి అని ఎంఎల్‌ఏ దొంతి మాధవ రెడ్డి అన్నారు. నిర్మించనున్న మహిళా సంఘం భవనం మహిళల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి కల్పన, స్వయం ఉపాధి కార్యాకలాపాలకు కేంద్రంగా మారుతుందని తెలిపారు. మహిళా సంఘాలకు మరింత బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్రను మరింత పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదని, సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తోందని ఎంఎల్‌ఏ స్పష్టం చేశారు. నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ మహిళలు, రైతులు, యువత, పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ పిఏసిఎస్ చైర్మన్ చల్లా శ్రీపాల్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, ఉప సర్పంచ్ సింగం శ్రావణి, ప్రశాంత్, రెడ్లవాడ పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేవతితో పాటు మంజుల కాంతయ్య, గొట్లకొండలో గ్రామ వివో నేతలు సునీత, సూర్య, వెంకటాపురంల సిసి మంజుల, రజిత, ఆయా గ్రామాల వివో అధ్యక్షురాలు, మహిళా సంఘాల ప్రతినిధులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## భూక్య మదన్ సింగ్ భౌతిక కాయానికి నివాళులు



ప్రజాపక్షం/సుజాత-నగర్: సుజాతనగర్ మండలం లోని సీతం పేట బంజారా సిపిఐ సీనియర్ నాయకుడు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి సభ్యుడు, సుజాతనగర్ మండల రైతు సంఘం అధ్యక్షుడు భూక్య మదన్ సింగ్ శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించారు. విష యం తెలుసుకున్న సిపిఐ నాయకులు వారి స్వ గృహానికి చేరుకొని పూలమాలవేసి, నివాళులర్పించి, అతని భౌతిక కాయానికి ఎర్రజెండా కప్పి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ మదన్ సింగ్ ఈ ప్రాంతంలో సిపిఐ పార్టీ అభివృద్ధి కోసం రైతాంగ సమస్యల పైన అనేక పోరాటాలు చేశారన్నారు సిపిఐ పార్టీ ఒక గొప్ప నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి భారత కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సుజాతనగర్ మండల కార్యదర్శి కోమరి హనుమ తరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్య దస్రు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు తాళ్లూరి పాపారావు, తాళ్లూరి ధర్మారావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తాళ్ల వెంకటేశ్వరరావు, మండల నాయకులు లా ఘ్యా గోపి చౌహాన్, సిపిఐ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 17న ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) జిల్లా మహాసభ ఈనెల 17న ఖమ్మంలోని ఎంబి ఫంక్షన్ హాల్లో జరుగుతుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి జాకీర్, పేరబోయిన మోహన్‌రావు తెలిపారు. ఆటో బోర్డు ఏర్పాటు చేసి దాని ద్వారా రంగ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆటో డ్రైవర్ల ఉపాధి కోసం ప్రభుత్వం నెలకు ఐదువేల ఆర్థిక భృతి చెల్లించాలని ఏఐటియుసి డిమాండ్ చేస్తుందని వారు తెలిపారు. ఆటో డ్రైవర్లపై ఫిట్‌నెస్ ఫీజులు, లేట్ ఫీజుల భారాన్ని తగ్గించాలని గ్రీన్ ట్యాక్స్, భారీ చలానాలకు సంబంధించిని పునః సమీక్షించాలనే డిమాండ్‌తో పాటు ఆరోగ్య బీమా అమలు చేయాలని, యాప్ ఆధారిత రవాణా సంస్థలను నిషేధించాలని, సబ్సిడీపై ఆటోలను అందజేయాలని డిమాండ్ చేస్తూ ఈ మహాసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జమలయ్య, బి. వెంకటేషం, ఎఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు, బిజి క్లైమెంట్, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మి నారాయణ, రావి శివరామకృష్ణ తదితరులు పాల్గొంటారని ఎండి జాకీర్, పేరబోయిన మోహన్‌రావు తెలిపారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

శ్రీసిటీ చైర్మన్ వెంకట్రావు



ప్రజాపక్షం/ ఖమ్మం : మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే, మహిళల ఆర్థిక ఎదుగుదల సమాజ ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని శ్రీసిటీ చైర్మన్ గంకపాటి వెంకట్రావు తెలిపారు. మాతృశ్రీ సంస్థ ఆధ్వర్యంలో శ్రీసిటీలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు శనివారం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. గతంలోనూ కుట్టు, అల్లికలు నేర్చుకున్న మహిళలకు శ్రీసిటీ చైర్మన్‌గా సొంత నిధులతో కుట్టు మిషన్లు అందజేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు కేవలం మిషన్ నేర్చుకోవడానికి పరిమితం కాకుండా ఇప్పుడు ఉన్న అవకాశాలను అంది పుచ్చుకుని వ్యాపారపరమైన ఆలోచనలు చేయాలన్నారు. వివిధ సంస్థల నుంచి ఆర్థిక పొంది తద్వారా జీవనోపాధికి మార్గాన్ని ఏర్పరచుకోవాలని వెంకట్రావు సూచించారు. ఈ కార్యక్రమంలో విజయరెడ్డి, రమేష్, మాజీ సర్పంచ్ పాండు పాల్గొన్నారు.

## సర్వజ్ఞ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని వీడి యోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. శనివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్వన్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య లక్షణాలు అలవర్చుకోవడం ఎంతో అవసరం అన్నారు. ఓటు యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడానికి ఈ ఎన్నికలు నిర్వహించామని తెలిపారు. గెలిచిన ప్రతి లీడర్ పాఠశాల క్రమశిక్షణ, తోటి విద్యార్థుల ప్రగతికి బాధ్యతగా తంగా పని చేయాలన్నారు. డైరెక్టర్ నీలిమ నూతనంగా ఎన్నికైన లీడర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. పదవులు కేవలం హోదా కోసం కాదని బాధ్యతతో కూడుకున్నవని గుర్తు చేశారు. పాఠశాల కీర్తి ప్రతిష్ఠ ముందుకు తీసుకెళ్లడంలో నూతనంగా ఎన్నికైన లీడర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమకు అభిమానం ఉన్న లీడర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌ఒసి చెక్కు పంపిణీ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసి చెక్కును కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ శనివారం పంపిణీ చేశారు. ఖమ్మం నగరంలోని 46వ డివిజన్‌కు చెందిన గోనెల వీరమ్మ కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానిక నాయకుల బానాల లక్ష్మణ్ ద్వారా విషయం తెలుసుకున్న తుమ్మల యుగంధర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసి రూ. 1.75 లక్షల చెక్కును వీరమ్మ కుమారుడు భువనేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు భువనేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు.

# సాంస్కృతిక విప్లవం ద్వారా సమాజం మార్పు

తన కంఠంతో అమరత్వాన్ని రమణీయం చేసిన నాగన్న

ప్రొ. కొండా నాగేశ్వరరావు




ప్రజాపక్షం/ ఖమ్మం : సాంస్కృతిక విప్లవం ద్వారా సమాజ మార్పు తథ్యమని కళ ద్వారా సమాజ మార్పు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరూ అభినందనీయులని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ॥ కొండా నాగేశ్వరరావు తెలిపారు. సాంస్కృతి ఉద్యమం ప్రజలను మారుస్తుందని తద్వారా ప్రజలు సమాజాన్ని మారుస్తారని ఆయన తెలిపారు. ఇటీవల మరణించిన అరుణోదయ నాగన్న సంస్మరణ సభ శనివారం స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగింది. నాగన్న మిత్ర మండలి ఏర్పాటు చేసిన ఈ సంస్మరణ సభకు స్పర్శ అధ్యయన వేదిక బాధ్యులు కాకి భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కొండా నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగన్న జీవితం ఎందరికో ఆదర్శమని నిరుపేద కుటుంబంలో పుట్టి కళను సాధనంగా చేసుకుని తుదిశ్వాస వరకు ప్రజా చైతన్యానికి పాటుపడిన వ్యక్తి అన్నారు. 'అన్న అమరుడురా' అన్న పాటతో అత్యంత ప్రాచుర్యం పొందటమే కాకుండా అమరత్వాన్ని తన గానంతో రమణీయం చేసిన మహోన్నతుడన్నారు. అనేక విప్లవ ఉద్యమాల విజయాల వెనక సాంస్కృతిక ఉద్యమం దాగి ఉందని నాగేశ్వరరావు తెలిపారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడ వరకు పనిచేసిన నాగన్న కేవలం కళాకారుడు మాత్రమే కాదని ఒక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు కార్యకర్త అన్నారు. నాగన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చూపిన మార్గం, ఆచరించిన సిద్ధాంతం సజీవంగా ఉన్నాయని ఆయన ఆలపించిన వందల పాటలు ఆయన రచించిన చైతన్య గీతాలు ఈ సమాజాన్ని నిత్యం మేల్కొపుతూనే ఉంటాయన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం ఇప్పుడు సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. ఈ సవాళ్లను అధిగమించడానికి కళలు ఆయుధంగా ఎంచుకున్న నాగన్న తుదిశ్వాస వరకు ప్రజా చైతన్యం కోసం పని చేశారన్నారు.నాగన్న సంస్మరణ సభ సందర్భంగా అరుణోదయ, ప్రజా నాట్యమండలి, ప్రజా కళామండలి కళాకారులు ఆలపించిన గేయాలు సభికులను ఆలోచింపజేశాయి. ముఖ్యంగా నాగన్న వారసుడు అజయ్ అలపించిన అన్న అమరుడురా అన్న పాటతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సభలో నాగన్నపై యోచన రాసిన పాటలను అతిథులు ఆవిష్కరించారు. ఆటపాటతో సాగిన ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకులు ఆవునూరి మధు, బిఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, అరుణోదయ విమలక్క, యోచన, ఎస్‌పాల్, దేవేందర్, మిత్ర మండలి సభ్యులు బిచ్చాల తిరుమలరావు, విజయ్, చిత్రా రవి, మానుకోట ప్రసాద్, కోటి పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం చేయూత

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని, పేదల కన్నీళ్లు తుడవటమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.35,91,500 విలువైన చెక్కులను, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య ఖర్చులు భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నామన్నారు. పేదింటి ఆడపిల్లల పెళ్లి భారం కాకుండా ఉండేందుకు కల్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రూ.500 కోట్లతో వైరా మున్సిపాలిటీ అభివృద్ధి

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీని సుందర నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూ.500కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తెలిపారు. వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అదనంగా రూ.50.82 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో శాంతినగర్ నుంచి గండగలపాడు సాయిబాబా ఆలయం వరకు, వైరా రింగు రోడ్డు ఇందిరమ్మ కాలనీ వరకు ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అలాగే పాత గ్రామపంచాయతీ ఆసుపత్రి నుంచి రిజర్వాయర్ వరకు వాకింగ్ ట్రాక్ నిర్మాణం కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నాయకత్వంలో వైరా మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీ కృష్ణ, మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు వుంద్రు శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

# పోలవరం ముంపు ముప్పుపై మౌనం వీడాలి

గోదావరి వరదలపై అధికార యంత్రాంగం కదలాలి

అసంపూర్తి కరకట్టను పూర్తి చేయాలి

సిపిఐ నేతలు కల్లూరి, రావులపల్లి




ప్రజాపక్షం/భద్రాచలం : పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి పొంచి ఉన్న ముప్పు పై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా మౌనం వీడాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు రావులపల్లి రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గోదావరి ఉగ్రరూపం దాల్చిన ప్రతీసారి హడావిడీ చేయడం, వరదలు తగ్గగానే సమస్యను గాలికొదిలేయడం పరిపాటిగా మారిందన్నారు. రాబోయే గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కదిలి ప్రజలప్రాణాలు, ఆస్తుల రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. పోలవరం ముంపుపై ప్రజల్లో తీవ్ర గందరగోళం ఏర్పడిందని, శాస్త్రీయ విధానంలో లెక్కలు తేల్చాలన్నారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడటం సరైందికాదన్నారు. భద్రాచలం శివారులో నిర్మించే కరకట్ట అసంపూర్తిగా ఉందని, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రాతినిధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణం నుండి మారుమూల ఏజెన్సీ గ్రామాల వరకు నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలు విషజ్వరాల భారిన పడకుండా చూడాలన్నారు. భద్రాద్రి రామాలయాభివృద్ధి జరగడం సంతోషమే అని, జరిగే ప్రతి పని నాణ్యతా ప్రమాణాలతో సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరాటి ప్రసాద్, కంచర్ల జమలయ్య, కంభంమెట్టు శ్రీనివాస్, మారెడ్డి శివాజీ, మీసాల భాస్కర్ రావు, ఎస్‌విఎస్ నాయుడు, భద్రాద్రి వెంకటేశ్వరరావు, మహేష్, సాధనపల్లి సతీష్, వేణు, గుంజా రామారావు, సత్తినేడు సాయిరామ్, రుద్ర బ్రదర్స్, చింతల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతకు అండగా రైతు భరోసా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : అన్నదాతలకు రైతు భరోసా అండగా నిలుస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో 1 లక్ష 78,828 మంది మంది రైతుల ఖాతాల్లో రూ.318.42 కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేసింది. ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకింగ్ శాఖల సమన్వయంతో పంపిణీ జరిగింది. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు రైతులకు పెట్టుపడి సాయం, వరికి రూ.500 బోనస్ అందిస్తోంది. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయం కోసం అందిస్తున్ననిధులు పక్కదారి పడుతున్నాయి. సెర్ఫ్ మహిళా సంఘాల నిధులకు సంబంధించి బ్యాంకుల్లో బకాయిలు ఉండటంతో రైతు భరోసా డబ్బులు బ్యాంకుల్లో జమ కావడంతో బ్యాంకు మేనేజర్లు ఇవ్వకుండా నిలుపుదల చేస్తున్నారు. రైతుభరోసా నిధులు ఇవ్వాలంటూ బ్యాంకు మేనేజర్లను బ్రతిమాలుతున్నా ససేమి రా అంటున్నారు. దీంతో బ్యాంకుల ముందు ఆందోళన సిద్ధమవుతున్నారు. దీనిపై కలెక్టర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ రైతుభరోసా నిధులు వేరే రుణబకాయిలు, సేవా చార్జీల పేరుతో నిలుపుదల చేయరాదని, బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేశారు. రైతుభరోసాపై ఎలాంటి అనధికారిక కోతలు విధించరాదని, ప్రభుత్వం జమచేసిన మొత్తాన్ని రైతులకు పూర్తిగా అందించాలని ఆదేశించారు.

## ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందించాలి

ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్



ప్రజాపక్షం/సత్తుపల్లి: విలువలతో కూడిన విద్యను అందించటంతో పాటు, విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. శనివారం పట్టణంలోని మాధురి ఫంక్షన్ హాల్‌లో శనివారం రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వామి వివేకానంద బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని, ఉపాధ్యాయులు వాటిని విద్యార్థులకు చేరవేయాలని సూచించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రోహన బేగం , సత్తుపల్లి ఎంఈవో రాజేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఆనంద్, కార్యక్రమ నిర్వాహకులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల కోసం హెచ్‌ఎంఎస్ పోరాటం

జెవిఆర్ ఒసిపిలో కవిత పర్యటన ఉద్రిక్తం

ప్రభుత్వం, గుర్తింపు సంఘాలపై కవిత ఫైర్



ప్రజాపక్షం/సత్తుపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం, గుర్తింపు కార్మిక సంఘాలైన ఎఐటియుసి, ఐఎన్‌టియుసిలపై తీవ్ర విమర్శలు గుప్పించారు తెలంగాణ రక్షణ సమితి చీఫ్ కల్వకుంట్ల కవిత. శనివారం సత్తుపల్లి జెవిఆర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పర్యటన ఉద్రిక్తతకు దారితీసింది. కార్మికులను కలిసేందుకు ప్రాజెక్టు ప్రాంతానికి వచ్చిన ఆమెను పోలీసులు, సింగరేణి యాజమాన్యం అడ్డుకునే ప్రయత్నం చేశారని హెచ్‌ఎంఎస్ నాయకులు ఆరోపించారు. అనంతరం కార్మికులతో సమావేశమైన కవిత కాంగ్రెస్ ప్రభుత్వం, గుర్తింపు కార్మిక సంఘాలైన ఎఐటియుసి, ఐఎన్‌టియుసిలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జెవిఆర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన కవిత, కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎఐటియుసి, ఐఎన్‌టియుసిలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. తమను ప్రాజెక్టులోకి రానివ్వకుండా అడ్డుకోవడం అధికార పక్షం భయానికి నిదర్శనమని, అదే హెచ్‌ఎంఎస్ బలాన్ని చాటుతోందని అన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన గుర్తింపు సంఘాలు ప్రభుత్వంతో కుమ్మక్కై కార్మిక సమస్యలను గాలికొదిలేశాయని ఆరోపించారు. ఇసి ఆపరేటర్ల ప్రమోషన్లు, ఓపెన్‌కాస్ట్ గనుల్లో భద్రతా లోపాలు, నాసిరకం పనిముట్లు, వైద్య సేవల కొరత, కార్మికుల పిల్లలకు విద్యా సదుపాయాల సమస్యలపై గుర్తింపు సంఘాలు ఎందుకు పోరాటం చేయడం లేదని ప్రశ్నించారు. సత్తుపల్లి సింగరేణి ప్రాంతంలో కార్మికులకు సరైన ఆస్పత్రి, కమ్యూనిటీ హాల్, తాగునీటి వంటి కనీస మౌలిక వసతులు కూడా అందుబాటులో లేవని కవిత ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలు, హెచ్‌ఆర్‌ఏ, మెడికల్ బోర్డు, కార్మిక సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం హెచ్‌ఎంఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. తమను సింగరేణి ప్రాజెక్టులోకి రాకుండా అడ్డుకున్న ఘటనపై చట్టపరంగా పోరాటం చేస్తామని, అవసరమైతే లేబర్ కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్ పోటీ చేస్తుందని, కార్మికులు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎన్ మైనస్ విధానం, డిపెండెంట్ ఉద్యోగాలు, అలియాస్ పేర్ల సమస్యలు, జీతాల పెంపు తదితర అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు కండ్లు ఉండి మీరేం చేశారు...?

వ్యక్తిత్వ హననమే రేవంత్ ఎజెండా

హామీల అమలుకు ఏమి వైకల్యం అడ్డొచ్చింది

మాజీ మంత్రి అజయ్ కుమార్



ప్రజాపక్షం/ ఖమ్మం : తనకు ఒక కన్ను ఉందని వ్యక్తిగత విమర్శలు చేస్తున్నా కాంగ్రెస్ నాయకులు జిల్లాలో ఆరు కండ్లు ఉన్న ముగ్గురు మంత్రులు ఏమి చేశారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ కుమార్ ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు, వ్యక్తిత్వ హననం రేవంత్‌రెడ్డి ఎజెండా అని ఆయన తెలిపారు. శనివారం ఖమ్మంలో పువ్వాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తాను ఒక కన్నును కోల్పోయానని గతంలోనూ కొందరు నన్ను ఇలానే విమర్శించారని కానీ ఆరు కండ్లు ఉన్న ముగ్గురు మంత్రులు ఏమి చేశారో ఈ జిల్లాలో నేను ఏమి చేశానో రేవంత్ తెలుసుకుంటే మంచిదన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి దిగజారుడు విమర్శలు చేస్తుంటే సహచర మంత్రులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చారని బాండు పేపర్లు జాగ్రత్తగా దాచుకుంటే రెండు నెలల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటికి వచ్చి హామీలను నెరవేరుస్తారని చెప్పిన మంత్రులు ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఇక కాంగ్రెస్‌కు అధికారం కల్ల అన్న విషయం కాంగ్రెస్ నాయకులందరికీ తెలుసన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో దిగువన నీటి లభ్యత లేదని కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసి తెలంగాణకు సాగునీటిని అందిస్తే పట్టిసీమకు నీరు అందదని అందుకే గురు దక్షిణగా కాళేశ్వరాన్ని రేవంత్ వదిలేశారని అజయ్‌కుమార్ తెలిపారు. కాళేశ్వరం అనేది మూడు రిజర్వాయర్లు, సబ్ స్టేషన్లు, వందల కిలో మీటర్ల కాలువలు, పలు రిజర్వాయర్ల సమాహారమని, కాళేశ్వరం ద్వారా నీటిని అందిస్తే బిఆర్ఎస్‌కు ప్రజల మద్దతు లభిస్తుందన్న ఏకైక కారణంతోనే నీరు ఇవ్వడం లేదన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిగా కెసిఆర్ ఆలోచన మాత్రమేనని దానిపై బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది వేల కోట్లు ఖర్చు చేసిందని ఆయన గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డికి ప్రజా ప్రయోజనాల కంటే స్వప్రయోజనాలే ముఖ్యమని ఈ రాష్ట్రం పట్ల చిత్తశుద్ధి లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అజయ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, కర్నాటి కృష్ణ, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, మగ్బూల్, బత్తుల మురళీ, దండా జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

**బిఎల్ఏలు క్రియాశీలకంగా పనిచేయాలి**

రఘునాథపాలెం : ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో బిఎల్‌వోలతో బిఎల్ఏలు సమన్వయం చేసుకుంటూ క్రియాశీలకంగా పని చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం రఘునాథపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై బిఎల్ఏలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ, సమన్వయ కమిటీ సభ్యులు గుత్తా రవి, మెంటెం రామారావు, కోటేశ్వరరావు, కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు హరిప్రసాద్, ఆత్మ మాజీ ఛైర్మన్ భూక్యా లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ శంకర్, నాయకులు పొట్లపల్లి నాగరాజు, కుతుంబాక నరేష్, గంగిరెడ్డి విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి. రామారావు



ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: ప్రపంచ జనాభా దినోత్సవం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం పట్టణంలోని కొత్తూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన ఆయన విద్యార్థినులు, ఉపాధ్యాయులు సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. జనాభా నియంత్రణ, తల్లిశిశు ఆరోగ్యం, బాలికల ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించిన ఆయన, ఈ నెల 13న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అర్హులైన విద్యార్థులందరూ తప్పనసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని చెప్పారు. ఈ మాత్రల వల్ల నులిపురుగుల కారణంగా వచ్చే రక్తహీనత, పోషకాహారలోపం, ఎదుగుదల సమస్యలను నివారించవచ్చని వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రామారావు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, జ్వరం వచ్చిన వెంటనే స్వీయ వైద్యం చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.అలాగే హెచ్‌పివి టీకా ప్రాముఖ్యతను వివరిస్తూ బాలికలు తప్పనిసరిగా టీకా తీసుకోవాలని, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో ఇది కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి, హెచ్‌ఈఓ భద్రు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో నాసిరకం భోజనంపై ఆందోళన



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు పురుగులు పట్టిన బియ్యం, కుళ్ళిపోయినా కూరగాయలతో భోజనం అందించినట్లు ఆరోపణలు రావడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఆహారం కారణంగా విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయగా, కొందరు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఈ విషయంపై ప్రిన్సిపాల్ డి మాధురి ని వివరణ కోరగా దురుసుగా సమాధానం ఇస్తూ మీరు ఎందుకు లోపలికి వచ్చారు అని ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం జరిగింది. మేము పత్రిక విలేకరులము అని చెప్పినా కూడా దురుసుగా సమాధానం ఇస్తూ కోపంగా వ్యవహరించిందివిద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో నాణ్యతలేని ఆహారం అందుతున్నట్లు ఆరోపణలు రావడం తల్లిదండ్రుల్లో ఆందోళనకు దారితీసింది.ఇటీవలి కాలంలో తెలంగాణలోని పలు గురుకుల, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో నాసిరకం ఆహారం, పురుగులు పట్టిన బియ్యం, ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు ఆహార నా ణ్యతపై పర్యవేక్షణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి


### మున్సిపల్ కౌన్సిలర్ ఈర్ల స్వరూప సురేందర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియఎస్ఐఆర్ 2026 అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగుతోంది.ఇందులో భాగంగా 7వ వార్డులో ఓటర్ల నమోదు, మార్పులు ,చేర్పుల ప్రక్రియను అధికారులు,ప్రజాప్రతినిధులు వేగవంతం చేశారు. 7వ వార్డు కౌన్సిలర్ ఈర్ల స్వరూపసురేందర్ గత వారం రోజులుగా బూత్ స్థాయి అధికారులతో కలిసి వార్డులో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు. ఓటరు జాబితాలో కొత్తగా పేర్ల నమోదు,చిరునామా మార్పులు,అభ్యంతరాల తొలగింపుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.దరఖాస్తు ఫారమ్‌లను నింపడంలో ప్రజలకు సిబ్బంది ప్రత్యక్షంగా సహకరిస్తున్నారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్2026లో భాగంగా ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని,అర్హులైన ప్రతి పౌరుడు తమ వివరాలను నమోదు చేసుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా మారాలి.అని పిలుపునిచ్చారు.ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించడానికి జూలై 24ను గడువుగా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు.ఆఫీసర్ అశ్విత,వార్డునాయకులు కట్ల అన్వేష్, అనాజ్ ఈశ్వర్,వార్డు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నిజం చేసిన కాంగ్రెస్ సర్కార్

### సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:** పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు పురాణం అనిల్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుండగా, సొంత ఇంటి కోసం ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంతో శాశ్వత పరిష్కారం లభిస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేస్తుండగా, ఎలాంటి రాజకీయ, భేదాభిప్రాయాలకు తావులేదని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువయ్యేలా ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యం ఇస్తోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతులకు రైతు భరోసా, 200 యూనిట్ల లోపు విద్యుత్ సరఫరా, రైతు కూలీలకు ఆర్థిక చేయూత, సన్నబియ్యం పంపిణీ, సామాజిక భద్రతా పింఛన్లు, విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు, ఆరోగ్య సేవల బలోపేతం వంటి సంక్షేమ కార్యక్రమాలను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మొనగారి రాజు రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, నేతలు నక్క రాములు గౌడ్, గుండు లక్ష్మణ్, వేణు, అశోక్ గుప్తా, కర్ణాకర్ రెడ్డి, పురాణం శ్రీనివాస్‌పాల్గొన్నారు.

## నిరుపేదలకు సిఎంఆర్ఎఫ్ ఒక వరం

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఒక గొప్ప వరమని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలో లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. పట్టణానికి చెందిన అనవేణి మనీషకు 60,000 రూపాయలు, మెరుపుల నరేష్‌కు 45,000 రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు.వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో మేలు చేకూరుస్తుందని కొనియాడారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తూ, పేద బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.బాలరాజ్, శ్రీనివాస్, కోడం నాగభూషణం, కత్తెరపాక ఎల్లయ్య, కోలకని రాజేశం, అనవేని మల్లేశం,తడుక వెంకటేశం,నర్మేట సురేష్, సదుల గంగాధర్, ఎండి కలీం, అబ్బగోని లచ్చయ్య పాల్గొన్నారు.



# సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి నిలపాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ధర్మపురి మండలంలోని నక్కలపేట,దోనూర్, తీగల ధర్మారం గ్రామాలలో శనివారం మంత్రి అడ్లూరి సుడిగాలి పర్యటన జరిపారు.ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో సాగునీటి పరిస్థితులను పరిశీలించారు.రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీరు సకాలంలో అందేలా కెనాల్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి నీరు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. రైతులను నేరుగా కలిసిన మంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి హామీ ఇచ్చారు.తీగల ధర్మారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి :** ప్లాస్టిక్ తో పర్యావరణానికి పెనుముప్పు పొంచివుందని దాన్ని నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరూ కృషిచేసి ప్లాస్టిక్ భూతాన్ని అంతమొందించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది మధుసూదన్ రెడ్డి పర్యావరణ హితం కోరుతూ ప్రజల అవసరాలకై జూట్ బ్యాగులను అందిస్తుండగా శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి మధుసూదన్ రెడ్డిని అభినందించారు. క్లాత్ బ్యాగులను,క్యాపులను మంత్రి ఆవిష్కరించారు. రాబోవు పుష్కరాలలోపు ప్లాస్టిక్ రహిత ధర్మపురి గా క్షేత్రాన్ని తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపట్టనున్నట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎస్.దినేష్,మున్సిపల్ చైర్మ న్ వేముల నాగలక్ష్మి ,ఎఎంసి చైర్మన్ చిలుముల లావణ్య,చిలుముల లక్ష్మణ్,వేముల రాజేష్, న్యాయవాది మధుసూదన్ రెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

## ఐవివైలో అలరించిన బ్రోవై రోటోటిక్ ఎక్స్‌పో



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** సాంకేతిక రంగంలో వేగంగా దూసుకుపోతున్న కృత్రిమ మే ధస్సు ఏఐ ప్రపంచాన్ని విద్యార్థులకు చేరువ చేయాలనే లక్ష్యం తో ఐవివై విద్యా సంస్థలు, సిద్ధా ర్థ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అత్యం త వైభవంగా బ్రోవై రోబోటిక్స్ అండ్ ఎక్స్‌పో2026 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఫ్ఐసిసిఐ తెలంగాణ హెల్త్ ప్యానల్, మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిమ్స్ హాస్పిటల్, ఇండియన్ నేవీ, సర్టిఫైజ్ సీఈవో ఐఐఎమ్ సర్జన్ కెప్టెన్ డా.విజయ్ కుమార్ బోడసిగు బృందం విచ్చేశారు. తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు ఆర్టిఫిషియల్, ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, మిషన్ లెర్నింగ్, సెన్సార్ టెక్నాలజీ, ఆటోమేషన్, డ్రోన్ సాంకేతిక, సైబర్ సెక్యూరిటీ, సైబర్ క్రైమ్ నివారణ, డిజిటల్ భద్రత, సెల్ఫ్ లర్నింగ్, ఏఐతో భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు అనేక ఆధునిక సాంకేతిక అంశాలను ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా సులభంగా వివరించారు. రోబోలు ఎలా పని చేస్తాయి. మనం ఇచ్చే ఆదేశాలను ఎలా అర్థం చేసుకుంటాయి ఏఐ మన రోజువారి జీవితంలో ఎలా ఉపయోగపడుతోంది, ఆన్‌లైన్ మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలి వంటి అంశాలను ప్రత్యక్ష డెమోలతో వివరించగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా వీక్షించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## హెల్త్ కార్డుల అమలుపై సందేహాలొద్దు

### ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** హెల్త్ కార్డులపై సందేహాలు వద్దని ఎస్ టి యు రాష్ట్ర అధ్యక్షులు సదానందం గౌడ్ తెలిపారు. శనివారం రోజున పెద్దపల్లి జిల్లా సభ్యత్వ నమోదులో భాగంగా స్థానిక పెద్దపల్లి మండలం లోని జెడ్‌పిహెఎస్ బాలుర ఉన్నత పాఠశాల మరియు యుపిఎస్ అమర్ నగర్ పాఠశాల లను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే హెల్త్ కార్డుల అమలుపై పూర్తి స్పష్టత రాబోతున్నదని, ట్రస్టు సభ్యులుగా క్షేత్రస్థాయి ఉపాధ్యాయుల ప్రతి సందేహాన్ని లేవనెత్తుతూ మార్గదర్శకాల విడుదలకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఉపాధ్యాయులు పీఆర్సీ డీఏ ల బకాయిలు పలు పెండింగ్ బిల్లులు పాత పెన్షన్ విధానం అమలు వంటి కీలక అంశాలపై చర్చించారు.రాష్ట్రోపాధ్యాయ సంఘం అనేక హక్కుల కోసం పోరాడిందని, వాటి ఫలితంగానే ఈరోజు మనం ఈ స్థాయిలో ఉన్నామని 80 ఏండ్ల ప్రస్థానంలో చేసిన పలు ఉద్యమ పోరాటాలను తెలుపుతూ, ఒక్కొక్కటిగా సమస్యల సాధన కోసం ఐక్య వేదిక ద్వారా ప్రయత్నిస్తున్నామని, త్వరలోనే మంచిరోజులు రానున్నాయని సంయమనం పాటించాలని కోరారు. నిజాం కాలంలోనే వేతన స్కేళ్ళ కోసం కొట్లాడి సాధించుకున్న ఘనత ఎస్టీయూ కు ఉందని గుర్తు చేశారు. గత పీఆర్సీ విషయంలో 7 శాతం ఫిట్మెంట్ ను నిరసించి ఉపాధ్యాయుల పక్షాన ఎస్టీయూ నిలబడిన విషయాన్ని గుర్తు చేశారు.

# వేగవంతంగా అభివృద్ధి పనులు పూర్తి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మంథని పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం మంథని పట్టణంలో నిర్మించనున్న మార్కెట్ ఏరియాను, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని,నూతనంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని, రావులచెరువు పునరుద్ధరణ పనులను, రావులచెరువు సమీపంలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.జిల్లాలోని సుమారు 40 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం, భోజనం అందించేందుకు ఏర్పాటు చేస్తున్న హరే కృష్ణ గోదాముల ఏర్పాటును పరిశీలించి అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు.పనుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా నిర్ణీత గడువులోపు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మంథనిలో నిర్మిస్తున్న మార్కెట్ ఏరియా, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, మా ర్కెట్ ఏరియాలో 100 ఫీట్ల రోడ్డు పనులను పరిశీలించి తరగతి గతిన పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.రావులచెరువు పునరుద్ధరణ పనులను నాణ్యతతో పూర్తి చేసి చెరువును సంరక్షించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ముఖ్యంగా డ్రైనేజీ నీరు ఎట్టి పరిస్థితుల్లోనూ రావులచెరువులోకి చేరకుండా శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.అనంతరం హరే కృష్ణ గోదాముల ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్, జిల్లాలోని సుమారు 40 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం, భోజనం అందించే కార్యక్రమానికి మౌలిక వసతులు, నిల్వ సదుపాయాలు, పంపిణీ ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# నిబంధనలకు విరుద్ధంగా బోర్లు

### తగ్గుతున్న భూగర్భ జలాలు
### వెలువడుతున్న కాలుష్యం



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణంలో నిర్మాణాల పేరా విచ్చల విడిగా బోర్ వెల్ వేసి భూగర్భ జలాలు తరుగుదలకు కారణం అవుతున్నారు.దాంతో పాటు బోర్ వేసేటప్పుడు వెలువడుతున్న దుమ్ము ధూళి కాలుష్యం అట్టి పరిసరాలలో జీవించే ప్రజలకు ఇబ్బందిగా మారుతుంది.వేసిన చోట నీరు పడకుంటె పదే పదే స్థలాన్ని మార్చి బోర్ వెయ్యడంతో ఆయా కాలనీల ప్రజలకు ఇబ్బందిగా మారింది. పురపాలక సంఘం పరిధిలో రోజు కు పది నుండి ఇరువై బోర్లు వేస్తుండగా వాటిలో ఒక్క దానికి కూడ ప్రభుత్వ అనుమతి లేనట్లు సమాచారం. జల , భూమి మరియు వృక్షాల చట్టం (వాల్టా), 2002, ను అనుసరించి సుస్థిర పర్యావరణ పద్ధతులను ప్రోత్సహించడానికి భారతదేశంలో (ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో) అమ లు చేయబడిన ఒక సమగ్ర నియంత్రణ. ఇది కాలుష్యాన్ని నివారించడానికి మరియు సహజ వనరులను రక్షించడానికి భూగర్భ ఉపరితల నీటి వినియోగాన్ని నిర్వహిస్తుంది. భూగర్భ జల

**నియంత్రణ :** అన్ని బోర్ వెల్ ల నమోదును మరియు ముఖ్యంగా త్రాగునీటి వనరుల సమీపంలో డ్రిల్లింగ్ కోసం అనుమతిని తప్పనిసరి చేస్తోంది,నిబంధనలను ఉల్లంఘిస్తే ఒక సంవత్సరం నుండి ఐదు సంవత్సరాల వరకు కూడ జైలు శిక్ష పాడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎలినో ప్రభావం వల్ల వర్షాలు తగ్గుముఖం పట్టడంతో భూగర్భ జలాలు అంతరించిపోతున్నాయి. దీంతో విచ్చలవిడిగా బోర్లు వేయడంతో భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి అనుమతులు లేని బోర్ల పై చర్యలు తీసుకొని భూగర్భ జలాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో.. లా ఆండ్ ఆర్డర్ కుప్పకూలింది

### మాజీ మంత్రి హరీష్ రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట:** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఒక పోక్సో కేసు నిందుతుడు ముగ్గురు పసి పిల్లతో సహ ఆరుగురిని కిరాతకంగా చంపేయడం రాష్ట్ర ప్రభుత్వ పోలీసుల వైఫల్యానికి సజీవ సాక్ష్యమని మాజీ మంత్రి,బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. గత మే నెల 16న ఒక మైనర్ బాలికపై అత్యాచారం జరిగితే నిందితుడిని అరెస్టు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని నెల రోజులుగా అతన్ని అరెస్టు చేయకుండా వదిలేయడంలో అతను కోర్టు నుండి యాంటీసిపేరటి బేయిల్ తెచ్చుకోని ఆ కుటుంబాన్ని అంతం చేశాడని అన్నారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబంలో మిగిలిన వికలాంగ చిన్నారి పేరు మీద ప్రభుత్వం వెంటనే కోటి రూపాయాలను ఫిక్స్ డిపాజిట్ చేయాలని అమ్మాయిని పెంచి సంరక్షించే పూర్తి భాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని,పరారీలో ఉన్న వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు మెట్‌పల్లి మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా శనివారం మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్‌శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో 6వ, 15వ వార్డుల్లో ప్రజలకు డెం గ్యూ, చికున్‌గున్యా,మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం 15వ వార్డులో నీరు నిల్వ ఉండే గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, వర్షాకాలంలో ఎక్కడైనా వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాలు,గుంతలు,మురుగు నీరు చేరే ప్రదేశాల్లో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.దోమల నివారణ కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ యాంటీ లార్వా స్ప్రే, ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరం సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు.డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ఇంటి చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందించాలని ప్రజలను కోరారు.ముఖ్యంగా కూలర్లు, నీటి కుండీలు, ఇతర పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రతి రెండు రోజులకు ఒకసారి ఖాళీ చేయాలని సూచించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మురికి కాలువలపై బ్లీచింగ్ పౌడర్ చల్లే కార్యక్రమం నిరంతరం కొనసాగుతోందని తెలిపారు.

# శాతవాహన యూనివర్సిటీలో అమరవీరుల స్థూపం

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమైనవని,వారి ఆశయాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలవాలంటే రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో తెలంగాణ ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని,ఉత్తర తెలంగాణకు ఉన్నత విద్యకు కేంద్రంగా ఉన్న కరీంనగర్ లోని శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ డిమాండ్ చేశారు. రోజు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం యూనివర్సిటీ ప్రాంగణంలో తెలంగాణ అమరవీలకు ఏర్పాటు చేయాలని కోరుతూ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ఉమేష్ కుమార్‌కు, రిజిస్టర్ సతీష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ 2008 లో ఏర్పాటయిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులు ఆనాడు క్రియాశీలక పాత్ర పోషించారని,యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తెలంగాణ ఉద్యమ చరిత్ర, అమరవీరుల త్యాగాల గురించి అవగాహన కల్పించేలా యూనివర్సిటీ ప్రాంగణంలోతెలంగాణ అమరవీల స్థూపం ఏర్పాటు చేయాలని,అమరవీరుల స్థూపం కేవలం ఒక స్మారక చిహ్నం మాత్రమే కాదు అది తెలంగాణ ఆత్మగౌరవానికి, త్యాగాల చరిత్రకు, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతి సంవత్సరం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు మరియు విద్యార్థి కార్యక్రమాలకు ఇది స్ఫూర్తి కేంద్రంగా ఉపయోగపడుతుందని, శాతవాహన యూనివర్సిటీలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు నిర్మాణంలో ఉన్న దృష్ట్యా తెలంగాణ అమరవీరుల స్థూపం ఏర్పాటు కొరకు కూడా యూనివర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకోవాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ కన్వీనర్ జంగపల్లి వరుణ్ శివాజీ,నాయకులు లోలాపు ప్రవీణ్, మహేష్‌తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలోనే ప్రజల అభివృద్ధి సాధ్యం

### సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి రూ 25 కోట్లు , గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తుండగా, ప్రజా పాలనలోనే పేదల అభివృద్ధి సాధ్యపడుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్పష్టం చేశారు. శనివారం మల్లారెడ్డి పల్లిలో సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరితో కలిసి సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.నియోజకవర్గ పరిధిలోని సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి రూ 25 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ గజ్వేల్ కు రూ 200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సీఎం రేవంత్ రెడ్డి కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీయట్ లో మధ్యాహ్న భోజనంతో పాటు పిల్లలకు ఉదయం అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకోగా, నిరుపేద విద్యార్థులకు మంచి చదువు, నాణ్యమైన భోజనం అందించి భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుండగా, గజ్వేల్ కు రెండు విడతల్లో 6 వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రూ రెండు లక్షల పంట రుణమాఫీ చేయగా, పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయడంతో పాటు రైతు భరోసా పథకం కింద రూ 12 వేలు ఖాతాలలో జమ చేసినట్లు స్పష్టం చేశారు. మధ్య దళారీలకు అవకాశం లేకుండా ప్రత్యేక యాప్ ద్వారా ఎరువులు కేటాయిస్తుండగా, సన్నధాన్యానికి రూ 500 బోనస్ ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని చెప్పారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే క్రమంలో రూ 10 లక్షలు రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు సిఎంఆర్ఎఫ్ తో రోగులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుండగా, నిరుద్యోగుల కోసం ప్రతి నియోజకవర్గానికి అడ్వాన్స్ టెక్నాలజీ



సెంటర్ ఏర్పాటు చేస్తూ విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చి నిరుపేద కుటుంబాలకు మేలు చేస్తుండగా, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని 'rఎం రేవంత్ రెడ్డి వర్తింపజేస్తున్నట్లు వివరించారు.నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు అశోక్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్లు, నేతలు చెన్నయ్య, గోరేమియా, గోపాల్ రెడ్డి, కుమార్, మహేందర్ గౌడ్, అంజిరెడ్డి, పొన్నాల నర్సారెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

## ఒక్క మొక్క – వందల ప్రాణాలకు ఆక్సిజన్



**ప్రజాపక్షం/రామగిరి :** ప న్నూర్ గ్రామ పంచాయతీ పదవ వార్డు సభ్యురాలు గౌడ వైష్ణవి ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని సెంటినరీకాలనీ లో ఘనంగా నిర్వహించారు. పన్నూర్ పదవ వార్డుతో పాటు సెంటినరీ కాలనీ మార్కెట్ – క్వార్టర్స్ మధ్య ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా మొక్కలు నాటారు.ముఖ్య అతిథులుగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, పన్నూర్ సర్పంచ్ చిందం మహేష్,ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్ ,లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డా.శరణ్య యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, పర్యావరణ ప్రేమికుడు గౌడ సత్యం ఎన్నో సంవత్సరాలుగా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో విశేష సేవలు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆయన సేవా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా వారి కూతురు పదవ వార్డు సభ్యురాలు గౌడ వైష్ణవి కూడా వారి బాటలో యువ ప్రజాప్రతినిధిగా హరితహారం కార్యక్రమాన్ని ముందుండి విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల్లో పర్యావరణంపై చైతన్యం కల్పిస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆమెను ఇతర ప్రజాప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మున్ని రఘుపతి, మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విరాళాల చోరీ ‘మాయని మచ్చ’

తీవ్ర అవమానకరం : నృపేంద్ర మిశ్రా




**అయోధ్య :** అయోధ్య ఆలయానికి సంబంధించిన విరాళాల చోరీ ఆరోపణలు తీవ్ర కళంకం అని, దీనివల్ల ప్రతి ఒక్కరూ అవమానభారాన్ని అనుభవిస్తున్నారని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు ఆలయ నిర్వహణ వ్యవస్థను మెరుగుపరుస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రామమందిర నిర్మాణ కమిటీ సమావేశం మొదటి రోజు కోసం మిశ్రా శుక్రవారమే అయోధ్యకు చేరుకున్నారు. ‘ఇది (విరాళాల చోరీ ఆరోపణ) చాలా అవమానకరం; దీనివల్ల మేము క్షమాపణ కోరడమే కాకుండా, తీవ్ర అవమానానికి, నిరాశకు గురయ్యాము’ అని కమిటీ సమావేశం రెండో రోజుకు ముందు మిశ్రా విలేకరులతో అన్నారు. ‘ఇది ఇప్పుడు ఆలయ నిర్వహణకు సంబంధించిన అంశం. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూసేందుకు నిర్వహణ వ్యవస్థను కచ్చితంగా మెరుగుపరుస్తాం’ అని ఆయన పేర్కొన్నారు. ఆలయ ట్రస్ట్ సిఇఒ నియామకం కోసం డిమాండ్ చేసిన వారిలో ముందున్న మిశ్రా, తగిన వ్యక్తిని సూచించేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ట్రస్ట్ ఒక మహిళా సిఇఒను నియమించే అవకాశం ఉందనే ఊహాగానాలు ఉన్నప్పటికీ, మిశ్రా దీనిపై ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. సిఇఒ నియామక కమిటీకి ఒక (రిటైర్డ్) న్యాయమూర్తి నేతృత్వం వహిస్తున్న విషయంతెలిసిందే. ఆ కమిటీ తన సిఫార్సులను ట్రస్ట్‌కు సమర్పిస్తుందని, ఆ తర్వాత ట్రస్ట్ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. విరాళాల చోరీ వివాదం నేపథ్యంలో ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామాలను ఆమోదించిన తర్వాత, ఆలయ నిర్వహణ వ్యవస్థను మెరుగుపరిచే చర్యలపై నిర్ణయం తీసుకోవడానికి ట్రస్ట్ ఈనెల 22న మళ్లీ సమావేశం కానుంది. అయితే ఆ సమావేశ ఎజెండా గురించి తనకు ఏమీ తెలియదని మిశ్రా చెప్పారు. శుక్రవారం తాను అయోధ్యలో జరుగుతున్న నిర్మాణ పనులను సమీక్షించానని, స్మారక చిహ్నంగా అభివృద్ధి చేస్తున్న పాత ఆలయ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఇక మిగిలింది 24 గంటలూ వెలిగే జ్యోతి ఏర్పాటు మాత్రమేనన్నారు. ప్రధాన స్మారక నిర్మాణానికి సంబంధించిన పనులు ఈనెల చివరి నాటికి పూర్తవుతుందని భావిస్తున్నామన్నారు. శుక్రవారం జరిగిన కమిటీ సమావేశానికి ఆలయ ట్రస్ట్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్ కూడా హాజరయ్యారు. అయోధ్య ఆలయం అద్వితీయమైనది అని అభివర్ణించిన మిశ్రా, ఇది సుదీర్ఘ పోరాట ఫలితమని అన్నారు.

### 2030 నాటికి భారత్‌–న్యూజిలాండ్ దేశాలు

## వాణిజ్యాన్ని రూ.35,000 కోట్ల రెట్టింపు

మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆక్లాండ్‌కు చేరుకున్న ప్రధాని మోదీ



**ఆక్లాండ్ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ, న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ మధ్య జరిగిన చర్చల అనంతరం శనివారం భారత్, న్యూజిలాండ్ తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యస్థాయికి ఉన్నతీకరించుకున్నాయి. అలాగే, 2030 నాటికి తమ వార్షిక ద్వైపాక్షిక వస్తు, సేవల వాణిజ్యాన్ని రూ. 35,000 కోట్లకు రెట్టింపు చేసేందుకు ఐదేళ్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. ఈ సమావేశం 10 ఒప్పందాలు సహా 18 నిర్దిష్ట ఫలితాలను అందించింది. వాటిలో రాబోయే నాలుగేళ్లలో సంబంధాలను విస్తరించడానికి ఒక రోడ్ మ్యాప్, ఇండో–పసిఫిక్ సముద్ర సహకారాన్ని పెంపొందించేందుకు ఒక ఫ్రేమ్‌వర్క్, భారత నౌకాదళం, న్యూజిలాండ్ రక్షణ దళం మధ్య పరస్పర లాజిస్టిక్స్ మద్దతు ఒప్పందం ముఖ్యమైనవి. ‘మా సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యస్థాయికి పెంచాలని మేం నిర్ణయించుకున్నాం. స్పష్టమైన లక్ష్యాలు, నిర్దిష్టమైన ఫలితాలతో ప్రతీ రంగంలోనూ ముందుకు సాగుతాం’ అని చర్చల అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలియజేశారు. మోదీ, లక్సన్ ఇండో–పసిఫిక్‌పై అభిప్రాయాలను పరస్పరం మార్చుకున్నారని, స్వేచ్ఛాయుత, బహిరంగ, సుసంపన్నమైన ప్రాంతం పట్ల తమ ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించారని ఒక సంయుక్త ప్రకటన పేర్కొంది. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, నియమాల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను పరిరక్షించడం సంబంధిత ప్రాముఖ్యతను కూడా వారు నొక్కిచెప్పారు. అంతర్జాతీయ చట్టానికి ముఖ్యంగా 1982 ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టంపై కన్వెన్షన్‌కు అనుగుణంగా నౌకాయానం, విమానయానం, సముద్రాల ఇతర చట్టబద్ధమైన వినియోగాల కోసం ఇద్దరు ప్రధానమంత్రులు పిలుపునిచ్చారని ఆ ప్రకటన తెలిపింది. ఇండో పసిఫిక్‌లో సహకారాన్ని పెంపొందించడంలో దృష్టి సారించిన నేపథ్యంలో సహకారం, సమన్వయం, సమాచార మార్పిడిని బలోపేతం చేయడానికి, సముద్ర భద్రతా చర్చలను ఏర్పాటు చేయడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో చైనా పెరుగుతున్న దూకుడు నేపథ్యంలో, ఆ ప్రాంతంలో సహకారాన్ని విస్తరించడంపై ప్రధానంగా దృష్టి సారించిన తన మూడు దేశాల పర్యటనలో భాగంగా మోదీ నిన్నరాత్రి ఆక్లాండ్‌కు చేరుకున్నారు. ‘ఉక్రెయిన్ విషయంలో కొనసాగుతున్న యుద్ధం అపారమైన బాధలకు, ప్రపంచవ్యాప్త పరిణామాలకు కారణం అవుతోంది’ అని మోదీ, లక్సన్ చర్చల సందర్భంగా తమ ఆందోళన వ్యక్తం చేశారు.

### ప్రపంచానికి భారతదేశం ఒక కొత్త అభివృద్ధి నమూనాను అందిస్తోంది : ప్రధాని మోదీ

ప్రపంచ సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారతదేశ అభివృద్ధి వేగం అపూర్వమైనదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం న్యూజిలాండ్‌లో అన్నారు. భారతదేశం ప్రపంచానికి ఒక కొత్త అభివృద్ధి నమూనాను అందిస్తోందని పేర్కొన్నారు. ఆక్లాండ్‌లో ‘కియా ఓరా మోదీ’ అనే టైటిల్‌తో జరిగిన ఒక భారతీయ కమ్యూనిటీ కార్యక్రమంలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోపర్ లక్సన్ కూడా పాల్గొన్నారు. భారత్–న్యూజిలాండ్ సంబంధాలు మధురమైన జ్ఞాపకాలు, శాశ్వతమైన స్నేహం, ఉమ్మడి విలువలు, పరస్పర నిబద్ధతపై నిర్మించబడ్డాయని అన్నారు. ‘ప్రపంచ సవాళ్ల నడుమ భారతదేశం అభివృద్ధి చెందుతున్న వేగం అపూర్వమైనది. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థ’ అని ప్రేక్షకుల హర్షధ్వానాలు, కరతాళ ధ్వనుల మధ్య మోదీ అన్నారు. భారతదేశం ప్రపంచానికి ఒక అభివృద్ధి మార్గాన్ని చూపిస్తోందని మోదీ తెలియజేశారు. అంతరిక్ష రంగమే భారత్–న్యూజిలాండ్ మధ్య ఆర్థిక భాగస్వామ్యానికి ఉన్న సంబంధాన్ని చాటిచెబుతోందని వివరించారు. 2026నాటికి ఇరుదేశాల క్రీడా సహకారానికి 100 సంవత్సరాలు పూర్తి అవుతాయని గుర్తుచేస్తూ, ఇరుదేశాలు తమ సంబంధాలను మరింత పెంపొందించుకోవడానికి ఆసక్తిగా ఉన్నాయని ప్రధానమంత్రి మోదీ తెలియజేశారు.

## నేనొక సాధారణ పౌరుడిని

‘ఆధునిక గాంధీ’ని లేదా హీరోని కాదు: సోనమ్ వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ :** తాను కేవలం ఒక ‘సాధారణ పౌరుడిని‘ మాత్రమేనని, ‘ఆధునిక గాంధీ’ని లేదా హీరోని కాదు అని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. నాయకత్వం వహించడానికి వేరొకరి కోసం ఎదురుచూడకుండా, ప్రజలు తమ సొంత జీవితాలకు తామే హీరోలుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సిజెపి) జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన శనివారంతో 22వ రోజుకు చేరుకోగా, వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 14వ రోజుకు చేరింది. దీక్ష ప్రారంభించినప్పటి నుండి సోనమ్ బరువు 7.5 కిలోలు తగ్గిందని, రక్తపోటు 106/74 ఎంఎం/హెచ్‌గా నమోదైంది. సిజెపి తెలిపింది. ముందు రోజుతో పోలిస్తే తనలో శక్తి తగ్గినట్లు అనిపిస్తోందని, అయినప్పటికీ ఉద్యమం పట్ల తన నిబద్ధత కొనసాగుతుందని శుక్రవారం రాత్రి సోనమ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూనే, రెండు రకాల వ్యాఖ్యలు తనను నిరాశపరిచాయని వాంగ్‌చుక్ చెప్పారు. ‘చాలా మంది నన్ను 21వ శతాబ్దపు గాంధీ లేదా ఆధునిక గాంధీ అని పిలుస్తున్నారు. మరికొందరు నన్ను హీరో అంటున్నారు. ఈ వ్యాఖ్యలు నాకు అసౌకర్యాన్ని కలిగిస్తాయి. నేను గాంధీని కాదు, హీరోని కూడా కాదు. నా బాధ్యతలను నెరవేర్చడానికి ప్రయత్నించిన ఒక సాధారణ పౌరుడిని మాత్రమే’ అని ఆయన అన్నారు. హీరోల కోసం వెతకడం మానేసి, పౌరులుగా బాధ్యత తీసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ‘దయచేసి వేరొకరిలో హీరో కోసం వెతకకండి. మీ సొంత జీవితానికి మీరే హీరోగా ఉండండి. ఒక పౌరుడిగా మీ బాధ్యతలను నెరవేర్చండి’ అని ఆయన అన్నారు. పరీక్షల అవకతవకల కారణంగా జరిగిన విద్యార్థుల ఆత్మహత్యల గురించి ప్రస్తావిస్తూ, నిష్క్రియంగా ఉండకుండా ఉద్యమంలో పాల్గొనాలని వాంగ్‌చుక్ ప్రజలకు పిలుపునిచ్చారు. నిరసనకారులు లేవనెత్తిన సమస్యలను ఎంపిలు చేపట్టాలని కోరేందుకు, ఈనెల 20న పార్లమెంటుకు తలపెట్టిన పాదయాత్రలో ప్రజలు పాల్గొనాలని ఆయన తన విజ్ఞప్తిని పునరుద్ఘాటించారు.

## కుళ్లిన, గడువు తీరిన ఆహార పదార్థాలు

స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు ఎఫ్ఎస్ఎస్ఎఐ నోటీసులు




**న్యూఢిల్లీ:** ప్రముఖ క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫారమ్ ‘స్విగ్గీ ఇన్‌స్టామార్ట్’ ద్వారా వినియోగదారులకు కుళ్లిన, గడువు ముగిసిన ఆహార పదార్థాలు సరఫరా అవుతున్నాయనే ఫిర్యాదులపై భారత ఆహార భద్రత. ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) తీవ్రంగా స్పందించింది. ఫుడ్ సేఫ్టీ యాక్ట్ 2006 నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు శనివారం (జులై 11న) ఏకంగా తొమ్మిది నోటీసులు జారీ చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఎఐ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు దీనిపై ఇన్‌స్టామార్ట్ ప్రతినిధి స్పందిస్తూ, ‘ఎఫ్ఎస్ఎస్ఎఐ గుర్తించిన జాబితాను మేము పరిశీలిస్తున్నాము. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాము’ అని తెలిపారు. కాగా, వినియోగదారుల నుండి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ పలు కీలక విషయాలను వెల్లడించింది. శిశువుల ఆహారానికి సంబంధించి, ఒక చిన్నారికి సంబంధించిన ఆహార ఉత్పత్తి అత్యంత పాడైపోయిన, సురక్షితం కాని స్థితిలో సరఫరా అయ్యింది. దానిని వెనక్కి పంపిన తర్వాత కూడా, మళ్లీ అదే ఉత్పత్తిని పంపిణీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అదే విధంగా నిత్యావసరాలలో, కలుషితమైన గుడ్లు, పాలు, దెబ్బతిన్న ప్యాక్ చేసిన ఆహార పదార్థాలను ఇన్‌స్టామార్ట్ డెలివరీ చేసిందని ఫిర్యాదులు అందాయి. నకిలీ లైసెన్సుల ఫిర్యాదులు కూడా ఉన్నాయి. కొన్ని ఫుడ్ బిజినెస్ సంస్థలు తప్పుడు లేదా నకిలీ లేదా చెల్లని ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్ నంబర్లతో నమోదయ్యాయని, మరికొన్ని సంస్థలు తమ అసలు పేర్లకు భిన్నమైన పేర్లతో జాబితాలో ఉన్నాయని అధికారులు గుర్తించారు. వివిధ అంశాల్లో వినియోగదారులు ఫిర్యాదు చేసినప్పటికీ ఇన్‌స్టామార్ట్ నుండి సరైన స్పందన లేదు. ఒక కేసులో ఆహార భద్రత సమస్యను పరిష్కరించకుండా కేవలం రీఫండ్ మాత్రమే ఆఫర్ చేశారు. ఈ నేపథ్యంలో, విక్రేతల ఎంపిక, నాణ్యత పర్యవేక్షణ, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలపై ఎఫ్ఎస్ఎస్ఎఐ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై పూర్తి వివరణ మరియు నివేదికను సమర్పించాలని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌ను ఆదేశించింది. ఒకవేళ సంతృప్తికరమైన సమాధానం ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆహార భద్రతపై కఠినంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే పలు ఎనర్జీ డ్రింక్స్, ఆల్కహాల్ తయారీ సంస్థలు, ఇతర క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫారాలకు కూడా నోటీసులు జారీ చేసింది.

## విరాళాల చోరీపై మౌనమేల?

ప్రధాని నరేంద్రమోదీని నిలదీసిన కాంగ్రెస్

**త్రిస్సూర్ :** అయోధ్యలోని రామమందిరానికి ఇచ్చిన విరాళాల చోరీ వ్యవహారాన్ని భారతదేశంలోనే ఒక పుణ్యక్షేత్రానికి సంబంధించి జరిగిన అతిపెద్ద దోపిడీ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఆరోపించారు. ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు.

శనివారం కేరళలోని త్రిస్సూర్ గురువాయూర్ ఆలయం వెలుపల వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశంపై ప్రధాని నుంచి కాంగ్రెస్ సమాధానం కోరుతుందని చెప్పారు. ‘మేము ఈ అంశాన్ని దేశవ్యాప్తంగా లేవనెత్తుతున్నాము, ఇకపై కూడా లేవనెత్తుతాము. ఈ దోపిడీ దేశంలోని కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసింది. కానీ ప్రధాని, హోంమంత్రి దీనిపై మౌనంగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్ పోలీసుల ఆధ్వర్యంలో కేవలం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) మాత్రమే ఏర్పాటు చేశారు, దీని వెనుక ఉన్న ఉద్దేశం అసలు దోషులను కాపాడటమే’ అని ఆయన ఆరోపించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగే దర్యాప్తు ద్వారానే ఈ దోపిడీ వెనుక ఉన్న అసలు దోషులు బయటపడతారని ఆయన పేర్కొన్నారు. గత 2025 ఏళ్లుగా ఆలయం పేరుతో భక్తుల నుంచి విహెచ్‌పి , ఆర్ఎస్ఎస్ వంటి సంఘ్ పరివార్ సంస్థలు విరాళాలు సేకరించాయని, ఆ డబ్బు, బంగారమే ఇప్పుడు దోపిడీకి గురైందని వేణుగోపాల్ చెప్పారు. ప్రధాని పర్యవేక్షణలో నియమితులైన ఆలయ ట్రస్ట్ నిర్వాహకులకు తెలిసే ఈ పని జరిగిందని ఆయన ఆరోపించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ ‘నిజమైన భక్తులు కాదని’ కూడా ఆ కాంగ్రెస్ నేత ఆరోపించారు.



‘హిందువుల పేరుతో దోచుకోవడం, ఓట్ల కోసం ప్రజలను విభజించడంపైనే వారికి ఆసక్తి ఉంది. ఇది కేవలం దోపిడీ మాత్రమే కాదు, భక్తుల విశ్వాసంపై జరిగిన దాడి’ అని ఆయన అన్నారు. ‘తమ రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను వాడుకునే’ బిజెపి, ఆర్ఎస్ఎస్ లాగా కాకుండా, కాంగ్రెస్‌కు ఇది రాజకీయ అంశం కాదని ఆయన స్పష్టం చేశారు. కేరళలోని బిజెపి ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించిన వేణుగోపాల్, అసలు దోషులను కాపాడాలనే వారి ఉద్దేశాన్ని ఇది సూచిస్తోందని పేర్కొన్నారు. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలకు సంబంధించి కూడా ఇలాంటి దోపిడీ ఆరోపణలు వస్తున్నాయని ఆయన తెలిపారు.

## శిథిలాల తొలగింపునకు కమిటీ

నివేదిక సమర్పించేందుకు ముగ్గురు సభ్యులతో ఏర్పాటు చేసిన కేరళ ప్రభుత్వం



**తిరువనంతపురం :** వయనాడ్ టన్నెల్ (సురంగ మార్గం), టౌన్‌షిప్ ప్రాజెక్ట్ ప్రాంతాలను సందర్శించి, అక్కడ కొండచరియలు విరిగిపడటం వల్ల పేరుకుపోయిన శిథిలాలను తొలగించడంపై నివేదిక సమర్పించేందుకు కేరళ ప్రభుత్వం ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈనెల 7న వయనాడ్‌లో సంభవించిన కొండచరియల విరిగిపడే ఘటన జరిగిన ప్రదేశం నుండి ఏడు మృతదేహాలను వెలికితీశారు. ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, శుక్రవారం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్, హోం మంత్రి రమేష్ చెన్నితాల, ప్రజా పనుల శాఖ మంత్రి పి.కె. బషీర్‌లతో జరిగిన సమావేశంలో ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ముగ్గురు సభ్యుల కమిటీలో ఎన్ఐటి కాలికట్ ప్రొఫెసర్ డాక్టర్ సంతోష్ జి. థంపి, పర్యావరణ, వాతావరణ మార్పుల డైరెక్టరేట్ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ జూడ్ ఇమ్మాన్యుయేల్, నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్ (ఎన్‌సిఇఎస్ఎస్) డైరెక్టర్ ప్రతినిధి ఉంటారని ఆ ప్రకటన పేర్కొంది. ఈ మేరకు విపత్తు నిర్వహణ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఈ కమిటీ టన్నెల్, వయనాడ్ టౌన్‌షిప్ ప్రాజెక్ట్ ప్రాంతాలను సందర్శించి, ఆయా ప్రదేశాలలో పేరుకుపోయిన శిథిలాలను సురక్షితంగా తొలగించే విషయంలో జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ (డిడిఎంఎ)కి మార్గనిర్దేశం చేస్తుంది.

టన్నెల్ విషయంలో, శిథిలాలను ప్రజా పనుల శాఖ (పిడబ్ల్యుడి) గుర్తించిన నిర్దేశిత ప్రదేశాలకు తరలించాలి; అలాగే టౌన్‌షిప్ విషయంలో, మట్టిని వేయడానికి తగిన స్థలాన్ని ప్రాజెక్ట్ అమలు విభాగం (పిఐయు) గుర్తిస్తుంది. శిథిలాల తొలగింపు ప్రక్రియలో తగిన భద్రతా చర్యలతో కూడిన ఒక సంక్షిప్త కార్యాచరణ ప్రణాళికను కూడా కమిటీ రూపొందిస్తుందని, దీనిని పిడబ్ల్యుడి, పిఐయు కచ్చితంగా పాటించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలను సందర్శించి, వీలైనంత త్వరగా నివేదికను సమర్పించాలని ప్రభుత్వం కమిటీని ఆదేశించింది. మిటీకి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందించాలని వయనాడ్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు ఆ ప్రకటన తెలిపింది.

### డాన్ బాబా బంగళాలో సోదా

## భారీగా డబ్బు, ఆయుధాల స్వాధీనం

**ముంబై:** మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో తీవ్ర నేరాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి పేరు గడించిన డాన్ ‘బాబా ఫర్జాన్’ విలాసవంతమైన బంగళాపై పోలీసులు దాడి చేశారు. వివిధ గదుల్లో కుప్పలుతెప్పలుగా పడి ఉన్న నోట్ల కట్టలతో పాటు వివిధ రకాల ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. 1990 దశకంలో అల్లర్లు, దాడులు, హత్యాయత్నం, కిడ్నాప్ వంటి నేరాలతో ఆ ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన డాన్ బాబా ఫర్జాన్ అనారోగ్యంతో ఆరు నెలల కిందట మరణించాడు. కాగా, అతడి నేరాలపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు శనివారం ఉదయం ఆయన బంగ్లాపై దాడి చేశారు. ఆ సమయంలో ఫర్జాన్ రెండో భార్య షీలా గణపత్రావు సాల్వే (52) ఆ ఇంట్లో ఉన్నారు. క్రైమ్ బ్రాంచ్ పోలీసుల సోదాల్లో గదుల్లోని పెట్టెల్లో రూ. 100, రూ. 200, రూ.50, రూ. 20, రూ.10 నోట్ల కట్టలు పెద్ద మొత్తంలో బయటపడ్డాయి. ఐదు కరెన్సీ లెక్కింపు యంత్రాలతో ఆ నగదును లెక్కించారు. లెక్కల్లో చూపని రూ. 5,26,29,560 డబ్బును స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు రూ. 5,50,000 విలువైన ఆయుధాలు కూడా ఆ ఇంట్లో లభించాయి. మ్యాగజైన్లతో కూడిన రెండు పిస్టల్స్, నాలుగు రైఫిల్స్, 12 బోర్ రైఫిల్స్, రెండు ఎయిర్ గన్స్, ఒక .22 ఎంఎం రైఫిల్, ఒక కత్తి, వదు చిన్న కత్తులు, 17 రకాల ఇతర కత్తులు, 21 పదునైన ఆయుధాలు ఉన్నాయి. 12బోర్, 0.22 ఎంఎం రైఫిల్స్, ఒక పిస్టల్, ఒక రివాల్వర్ లైసెన్స్‌లు బాబా ఫర్జాన్ పేరు మీద నమోదైనట్లు ప్రాథమిక విచారణలో తేలింది. రూ.21,34,350 విలువైన బంగారు ఆభరణాలు, రూ. 8,09,248 విలువైన వెండి ఆభరణాలు, రూ.34,836 విలువైన విదేశీ కంపెనీలకు చెందిన 45 మద్యం సీసాలు కూడా ఆ ఇంట్లో లభించాయి. వీటితోపాటు ఆర్థిక పత్రాలు, బ్యాంక్ ఖాతాలు, బినామీ ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

## ఎర్ర కోటకు బాంబు బెదిరింపు

భద్రత కట్టుదిట్టం: తనిఖీలు ముమ్మరం
ఆకతాయి పనే: ఢిల్లీ పోలీసులు

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ బాంబు బెదిరింపుతో ఉలిక్కిపడింది. చరిత్రాత్మక కట్టడమైన ఎర్ర కోటను పేల్చేస్తామంటూ బాంబు బెదిరింపు రావడంతో దిల్లీ పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎర్ర కోటను భద్రతా వలయంగా మార్చివేసింది. రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేపట్టింది. అయితే అనుమానస్పద వస్తువులు ఏమీ లభించకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ముంబై పోలీసు కంట్రోల్ రూమ్‌కు బాంబు బెదిరింపు ఫోన్ వచ్చిందని, వారు దానిని దిల్లీ పోలీసు కంట్రోల్ రూమ్‌కు బదిలీ చేశారని అధికార వర్గాలు వెల్లడించాయి. ముమ్మర తనిఖీల అనంతరం ఎక్కడ ఏమీ అనుమానస్పద వస్తువులు లేకపోవడంతో ఇది ఉత్తుత్తి బెదిరింపుగా అధికారులు నిర్ధారణకు వచ్చారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవం దృష్ట్యా ఇప్పటికే ఢిల్లీ పహారా నీడలో ఉన్నది. ‘బాంబు బెదిరింపు రావడంతో ప్రోటోకాల్ ప్రకారం బాంబ్ స్క్వాడ్ వచ్చింది. యాంటీ సాబటేజ్ తనిఖీలు నిర్వహించింది. అణువణువు గాలించింది. ఎర్ర కోట పరిసరాలన్నీ తనిఖీ చేసింది. ఎక్కడ ఏమీ లభించకపోవడంతో ఇది ఉత్తుత్తి బెదిరింపుగా నిర్ధారించాం’ అని సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. అయితే ఆ ఫోన్ ఎవరు, ఎందుకు చేశారనే కోణంలో విచారణ జరుగుతున్నదని, త్వరలోనే ఆ వ్యక్తిని పట్టుకుంటామని ఆయనన్నారు.

## అనిల్ అంబానీ రూ.వెయ్యి కోట్ల ఆస్తులు అటాచ్

**న్యూదిల్లీ:** రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపుపై మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా రూ.1,021 కోట్లు విలువు చేసే ఆస్తులను అటాచ్ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం ఉత్తర్వులు జారీచేసింది. రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అధ్వర్యంలోని రిలయన్స్ పవర్ ఈక్విటీ షేర్లతో పాటు రిలయన్స్ పవర్, ససన్ పవన్ రుణ మొత్తంలో కొంత భాగాన్ని మనీలాండరింగ్ కేసులో అటాచ్ చేసేందుకు మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. రిలయన్స్ హోం ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్)పై సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్, ఆర్‌సీఎఫ్ఎల్ సేకరించిన రూ.15,548 కోట్ల నిధులు దారిమళ్లిన వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎనిమిది మందిపై నాలుగు చార్జిషీట్లు... మనీలాండరింగ్, ఫెమా కేసులో దర్యాప్తు కొనసాగిస్తోంది. తాజా ఉత్తర్వులతో ఇప్పటివరకు మొత్తం రూ.20,367 కోట్ల విలువ చేసే ఆస్తులను అటాచ్ చేసింది. అదనంగా రూ.77.86 కోట్ల విలువైన ఆస్తులను ఫెమా కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది.

## బిజెపి నేతకు దక్కని ఎమ్మెల్యే టికెట్.. దాటియాలో చెలరేగిన అల్లర్లు..



**ఇండోర్ :** మధ్యప్రదేశ్‌లోని దాటియా అసెంబ్లీ పరిధిలో అల్లర్లు చెలరేగాయి. దాటియా ఉపఎన్నికకు తమ పార్టీ అభ్యర్థిగా అశుతోష్ తివారిని బిజెపి అధిష్ఠానం ప్రకటించడంతో వివాదం మొదలైంది. మాజీ హోంమంత్రి నరోత్తం మిశ్రాకు టికెట్ దక్కకపోవడంతో ఆయన అనుచరులు శుక్ర, శనివారాల్లో భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. సుమారు 3 వేల మందికి పైగా కార్యకర్తలు జాతీయ రహదారి (ఎన్‌హెచ్44)పై బైఠాయించారు. దాదాపు 12 గంటల పాటు రహదారిని దిగ్బంధించి నిరసన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో శనివారం ఎస్‌పి సహ పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. అయితే, పోలీసులపై నిరసనకారులు రాళ్ల దాడికి దిగారు. ఈ దాడిలో జిల్లా ఎస్‌పి, ఇతర ఉన్నతాధికారులు సహ పలువురు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. అలాగే, పోలీసు వాహనాలతో పాటు ఇతర వాహనాలనూ ఆందోళనకారులు ధ్వంసం చేశారు. దీంతో టియర్ గ్యాస్ ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. 2023 మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో దాటియా నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా అప్పటి రాష్ట్ర హోంమంత్రి నరోత్తం మిశ్రా పోటీ చేశారు. కాంగ్రెస్ తరఫున రాజేంద్ర భారతి బరిలో దిగారు. రాజేంద్ర భారతి చేతిలో 7,500కు పైగా ఓట్ల తేడాతో మిశ్రా ఓటమి పాలయ్యారు. అయితే, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓ కేసులో రాజేంద్ర భారతికి ఢిల్లీ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో ఆయన ఎమ్మెల్యే పదవికి అనర్హుడయ్యారు. ఈ మేరకు దాటియా స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఉపఎన్నికలో తనకే మరోసారి అవకాశం వస్తుందని నరోత్తం మిశ్రా భావించారు. ఇప్పటికే నామినేషన్ పత్రం కూడా సిద్ధం చేసుకున్నారు. అయితే, బిజెపి అధిష్ఠానం మాత్రం అనూహ్యంగా శుక్రవారం నాడు అశుతోష్ తివారిని అభ్యర్థిగా ప్రకటించింది. అధిష్ఠానం నిర్ణయం మిశ్రా అనుచరులను తీవ్ర ఆగ్రహానికి గురి చేసింది. దీంతో ఆయన మద్దతుదారులు, వేలాది మంది కార్యకర్తలు ఎన్‌హెచ్44పై బైఠాయించి రాకపోకలను అడ్డుకున్నారు. పోలీసులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆందోళన విరమించకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా, ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం దాటియాతో పాటు బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లోని మరో రెండు అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. దాటియా అసెంబ్లీ స్థానానికి జులై 30న పోలింగ్, ఆగస్టు 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. బిజెపి అభ్యర్థి ఎంపిక చుట్టూ నెలకొన్న వివాదం ఉపఎన్నిక ప్రచారాన్ని మరింత ఉత్కంఠ భరితంగా మార్చింది.

### రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయంలో...

## నా సహనాన్ని బలహీనతగా భావించొద్దు

- కేంద్రాన్ని ఘాటుగా హెచ్చరించిన జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా
- 20న ఢిల్లీలో ‘ఎన్‌సి’ నిరసనకు మద్దతు ఇవ్వాలని రాజకీయపార్టీలను కోరిన ఒమర్



**శ్రీనగర్ :** రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయంలో తన సహనాన్ని బలహీనతగా పొరపాటు పడొద్దని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం కేంద్రాన్ని హెచ్చరించారు. అలాగే ‘తగిన సమయం’ అనే నిర్వచనాన్ని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒమర్ అబ్దుల్లా తన గ్రాండ్‌మదర్ అక్బర్ జహాన్ రెండవ వర్ధంతి సందర్భంగా హజ్రత్‌బల్‌లోని తన తాతల సమాధి వద్ద జరిగిన ఒక భారీ కార్మికుల సదస్సులో ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ‘లడఖ్ ప్రజలతో చర్చలకు కేంద్రం సిద్ధంగా ఉన్నప్పుడు జమ్ముకశ్మీర్ ప్రజలతో ఎందుకు సిద్ధంగా ఉండదు’ అని ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. తన గ్రాండ్ మదర్‌కు నివాళులు అర్పిస్తూ, తాను ఆమె నుంచి చాలా నేర్చుకున్నానని, కానీ సహనం కలిగి ఉండటమే అతి పెద్ద పాఠమని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. ‘ఆమె చూపినట్లుగా మనం సహనం పాటించాలి. కానీ సహనం అనేది బలహీనతకు మార్గం కాదు. సహనం అంటే మౌనానికి మార్గం కాదు’ అని సిఎం నిర్వేదం వ్యక్తం చేశారు. హక్కుల కోసం గళం విప్పకూడదని దీని అర్థం కాదని, మా సహనాన్ని మీరు దుర్వినియోగం చేస్తారని, మమ్మల్ని బలహీనులుగా భావిస్తారని దీని అర్థంకాదని, ఈ సహనమే మా బలం, గళమని, దైవ సంకల్పం ఉంటే ఈ సహనమే మా విజయం అవుతుందని దాల్ సరస్సు వైపు చూస్తూ సదస్సును ఉద్దేశించి అబ్దుల్లా అన్నారు. ఒకటిన్నర సంవత్సరాలకు పైగా అధికారంలో ఉన్న తర్వాత కూడా జమ్ముకశ్మీర్‌లోని అధికార పార్టీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని ఎందుకు ఆలోచిస్తుందో కేంద్రం ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన ఘాటైన స్వరాన్ని వినిపించారు. తాను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత కేంద్రం తన హామీలను నెరవేర్చడానికి కొంత సమయం కావాలని కోరుకున్నానని అబ్దుల్లా తెలియజేస్తూ, వాస్తవానికి వారు పరిస్థితిని ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నారని చెప్పారు. ‘తన పార్టీ అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించడమే జమ్ముకశ్మీర్ ప్రజలకు శిక్షగా మారిందా అని ప్రశ్నించారు. పభుత్వాన్ని పనిచేయనివ్వనప్పుడు మమ్మల్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అనుమతించకుండా ఉండాల్సింది. అందువల్ల ప్రయోజనం ఏమిటి? అటువంటప్పుడు మీరు ఎన్నికలు నిర్వహించకుండా ఉండాల్సింది’ అని ఆయన కేంద్రపై నిప్పులు చెరిగారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారాజమ్ముకశ్మీర్ ప్రభుత్వాన్ని నియంత్రించాలని చూస్తోంది అని ఆరోపిస్తూ ‘మీరు రాజ్‌భవన్ ద్వారా ప్రజలను వేధించి, ఉద్యోగులను తొలగించి బుల్డోజర్లు నడిపినప్పుడు మమ్మల్ని ఎందుకు తీసుకొచ్చారు ?’ అని ముఖ్యమంత్రి అబ్దుల్లా కేంద్రాన్ని ప్రశ్నించారు. ‘జమ్ముకశ్మీర్ ప్రజల కోసం ఏదైనా సాధించాలనే తపనతో మేము ఇప్పటికీ గాడిదల్లా కష్టపడుతున్నామంటే అది ప్రజలకోసమే’ అని ముఖ్యమంత్రి తన స్వరాన్ని పెంచారు. దేశవ్యాప్తంగా ఒకే రాజ్యాంగం ఉండాలనే ఉద్దేశంతో ఆర్టికల్ 370ను రద్దు చేశారు. అయితే ఇప్పుడు లడఖ్‌కు ప్రత్యేక రాయితీలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం జులై 20న జంతర్‌మంతర్ వద్ద పార్టీ తలపెట్టిన నిరసనను ప్రస్తావిస్తూ, ఢిల్లీలో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) నిరసనకు మద్దతు ఇవ్వాలని అబ్దుల్లా రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

## తండ్రి హత్యకు ప్రతీకారం: మొజ్తాబా ప్రతిజ్ఞ



**టెహ్రాన్:** తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని అమరుడైన ఇస్లామిక్ విప్లవనాయకుడు అలీ ఖమేనీ కుమారుడు–ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు ఆయన ఒక లిఖిత పూర్వక సందేశం విడుదల చేశారు. తన తండ్రి–పూర్వ దేశనేతలను హత్య చేసిన శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తాబా పేర్కొన్నారు. గురువారం సాయంత్రం (జులై 09) ఖమేనీ అంత్యక్రియలు ముగిసిన తర్వాత శనివారం ఈ ప్రకటన విడుదలైంది. "ప్రతీకారం తీర్చుకోవడం జాతి ఆవశ్యకత, అది తప్పకుండా జరిగితీరాలి" అని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ చేసిన సంయుక్త దాడుల్లో అలీ ఖమేనీతోపాటు మొజ్తాబా ఖమేనీ తల్లి కూడా మరణించారు. ఈ దాడుల సమయంలో అక్కడే ఉన్నప్పటికీ అలీ ఖమేనీ కుమార్తె, అల్లుడు,మనుమరాలు, ఇతర ప్రముఖులు, మతనాయకులు మరణించారు. మొజ్తాబా ఖమేనీ మాత్రం కొద్దిదూరంలో ఉన్న గదిలో ఉండటంవల్ల తీవ్రమైన గాయాలతో ప్రాణాలు నిలబెట్టుకున్నారు. అప్పటి నుండి ఆయన రహస్య ప్రదేశంలో చికిత్స పొందుతున్నారు. జులై 7,8,9 తేదీల్లో జరిగిన అంతిమయాత్ర,అంత్యక్రియల కార్యక్రమాల్లో మొజ్తాబా ఖమేనీ ఎక్కడా కనిపించలేదు. కానీ మరో ముగ్గురు కుమారులు ముందువరుసలో నిలబడి ఆయన పార్థివదేహం వద్ద ప్రార్థనలు నిర్వహించారు. తండ్రి మరణించిన కొద్ది రోజులకే దేశ సర్వోన్నత నాయకుడుగా బాధ్యతలు చేపట్టిన మొజ్తాబా ఖమేనీ, అసలు నాయకుడుగా పనికిరాడని విమర్శించిన ట్రంప్ ఆ తర్వాత ఇరాన్ పాలకులపై ప్రశంసలు కురిపించడం ప్రారంభించారు. ప్రస్తుత ఇరాన్ పాలకులు గత పాలకులకంటే భిన్నమైనవారని పేర్కొన్నారు. మొజ్తాబా ఇప్పటివరకూ బాహ్య ప్రపంచానికి కనిపించలేదు. అప్పుడప్పుడు లిఖిత పూర్వక సందేశాలు విడుదల చేస్తున్నారు. ఐఆర్‌జిసి నాయకుడుగా యుద్ధాన్ని భిన్నమైన తరహాలో నడిపిస్తున్నారని మొజ్తాబా ప్రశంసలు అందుకున్నారు. భద్రతా కారణాల రీత్యా ఆయన తండ్రి అంత్యక్రియలకు హాజరు కాలేదు. ఇరాన్ ప్రజలు ఖమేనీ నాయకత్వంపట్ల సంపూర్ణ గౌరవం,చిత్తశుద్ధి ప్రకటించి నివాళులు అర్పించిన తర్వాత ప్రతీకారం తీర్చుకోవడం జాతి ఆవశ్యకతగా పేర్కొంటూ మొజ్తాబా లిఖిత ప్రకటన చేశారు. ఆయన నాయకత్వాన్ని కొట్టిపారేయలేమని, గతానుభవాలతో రాటుదేలి భిన్నమైన రాజకీయ నేతగా మొజ్తాబా అవతరిస్తున్నారని విశ్లేషకులు పేర్కొన్నారు.

**ఇజ్రాయెల్‌ను వదిలిపెట్టం: ఐఆర్‌జిసి**

భవిష్యత్తులో ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహమ్మద్ బఘేర్ జోల్ఘద్ర్ హెచ్చరించారు. అమెరికా తమపై దాడులు చేస్తోందని, రోజూ హెచ్చరికలు చేస్తోందని, దీనికి ప్రతీకారంగా భవిష్యత్తులో చేపట్టబోయే దాడులలో ఇజ్రాయెల్ కూడా లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించారు. ఇరాన్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని ధ్వంసం చేసే ప్రతి దాడికి ఎదురుదాడులు ఉంటాయని చెప్పారు. ఈ దురాక్రమణ చర్యలు, నేరాలకు బాధ్యత వహిస్తున్న జియోనిస్టు పాలకులు తమ యోధుల నుండి ఎదురయ్యే ప్రతిస్పందన నుండి వారు తప్పించుకోలేరని హెచ్చరించారు. ఇస్లామాబాద్ ఒప్పందం పూర్తిగా విచ్ఛిన్నమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్న తరుణంలో ఏప్రిల్‌లో ఆగిపోయిన యుద్ధంలోకి మళ్ళీ రెండు దేశాలు వెళ్ళే ప్రమాదానికి ఆయన ప్రకటన ఒక సూచనగా కనిపిస్తోంది.

### నన్ను హత్య చేస్తే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తాం

# ప్రపంచవ్యాప్తంగా 1000 క్షిపణులు గురిపెట్టి ఉంచాం

**ఖమేనీ అంత్యక్రియల్లో నినాదాలపై ట్రంప్ తీవ్ర హెచ్చరిక**
**హోర్ముజ్‌లో దాడులు చేయబోమని లిఖిత హామీ ఇవ్వాలని డిమాండ్**

**వాషింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి ఇరాన్‌పై 1000 క్షిపణులు గురిపెట్టి ఉంచామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్ ఇస్లామిక్ విప్లవయోధుడు,అమెరికా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన అలీ ఖమేనీకి ఆరు రోజులపాటు జరిగిన అంత్యక్రియల ప్రక్రియలో లక్షలమంది ప్రజలు "ట్రంప్‌ను హతమారుస్తాం, ట్రంప్‌కు ఉరిశిక్ష విధించాలి" అంటూ నినాదాలు చేయడం, బ్యానర్లు ప్రదర్శించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "పదవిలో ఉన్న అధ్యక్షుడినైన నన్ను హత్య చేయడానికి ప్రయత్నం చేసినా, లేక ఆ ప్రయత్నంలో విజయం సాధించినాగానీ ఇరాన్‌ను సమూలంగా నాశనం చేస్తాం, ప్రపంచంలో అనేక ప్రాంతాల నుండి 1000 క్షిపణులను ఇరాన్‌పై గురిపెట్టి ఉంచాం, ఈ క్షిపణులు ఎప్పుడైనా బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నాయి, మరిన్ని క్షిపణులను వేలాదిగా ఇరాన్‌పై ప్రయోగిస్తాం,ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం" అని తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పోస్టింగ్ రాశారు. ఏడాదికాలంపాటు అమెరికా సైన్యం అక్కడే ఉండి సమర్థవంతంగా ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను సర్వనాశనం చేయడానికి, తమ సమర్థతను ప్రకటించడానికి సిద్ధంగా ఉంది" అని రాశారు. ఈ పరస్థితుల్లో ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యుల పార్థివ దేహాలకు అంత్యక్రియలు ముగిసిన మళ్ళీ కొత్త వివాదం ప్రారంభమైంది. హోర్ముజ్ జలసంధిలో శత్రుపూరిత చర్యలకు పాల్పడితే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధిలో చమురు ట్యాంకర్లపై మరోసారి దాడులు చేయబోమని ఇరాన్ లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమేనీ అంతిమయాత్రలో ప్రజలు ఆవేదనతో చేసిన నినాదాలు, ప్రదర్శించిన బ్యానర్లపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. జులై నాలుగోతేదీ నుండి తొమ్మిదో తేదీవరకూ ఇరాన్–ఇరాక్ దేశాలలోని పలు నగరాల్లో ఖమేనీ అంతిమయాత్ర ర్యాలీలు జరిగాయి. ఈ ప్రదర్శనలలో లక్షలమంది ప్రజలు తీవ్ర భావోద్వేగాలు ప్రదర్శించారు. అంతిమయాత్ర మార్గంలోని ప్రధాన రహదారుల్లో పలు భవంతులపై "కిల్ ట్రంప్..." అనే పెద్ద పెద్ద బ్యానర్లను వేలాడదీసి ఉంచారు. ఖమేనీకి ప్రజలు అంతిమ నివాళులు అర్పిస్తూనే నెతన్యాహూ–ట్రంప్‌లపై ప్రతీకారం తీర్చుకోవాలనే నినాదాలు ప్రపంచవ్యాప్తంగా మీడియాలో పతాకశీర్షికల్లో నిలిచాయి. ఒకవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ఇజ్రాయెల్‌లోని ఒక వైమానిక స్థావరం నుండి అమెరికా తన అత్యాధునిక స్టెల్త్ ఫైటర్ జెట్‌ను ఉపసంహరించుకుందని ఇజ్రాయెల్ పత్రిక పేర్కొంది.కనీసం పది ఎఫ్–22 స్టెల్త్ ఫైటర్లు అమెరికా దిశగా ప్రయాణిస్తూ బ్రిటన్‌లోని ఆర్ఎఎఫ్ ఫెయిర్‌ఫోర్డులో దిగినట్లు సోషల్ మీడియా వీడియో దృశ్యాలు కనిపించాయి.



ట్రంప్ నిర్ణయాన్ని ప్రభావితం చేసేందుకే ఇజ్రాయెలీ ఇంటెలిజెన్స్ హెచ్చరిక

ట్రంప్‌ను హత్య చేసేందుకు ఇరాన్ కుట్రలు చేస్తోందని ఇజ్రాయెలీ ఇంటిలిజెన్స్ ఒక నివేదిక ఇచ్చిందని వాల్‌స్ట్రీట్ జర్నల్ వార్త ప్రచురించింది. ఈ వారంలోనే ఈ సమాచారాన్ని అమెరికా అధికారులకు ఇజ్రాయెల్ ఇంటిలిజెన్స్ చేరవేసిందని పేర్కొంది. ఇలాంటి విషయాలతో సంబంధం ఉన్న ఇద్దరు అధికారులను ఉటంకిస్తూ సిఎన్ఎన్ శనివారంనాడు ఈ నివేదికపై మరింత ధృవీకరణ ఇచ్చింది. ఈ నివేదిక వెలువడిన కొద్ది గంటలకు ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ద్వారా ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చినట్లు సిఎన్ఎన్ శనివారం ప్రకటించింది.ట్రంప్ ఆదేశాల మేరకు 2020లో ఇరాన్ అగ్రశ్రేణి సైనిక జనరల్ ఖాసెమ్ సులేమానీపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో ఆయన హత్యకు గురయ్యారు. దీనికి ప్రతీకారంగా ట్రంప్‌పై హత్యాప్రయత్నాలు జరుగుతాయని అమెరికా ప్రభుత్వం చాలాకాలంగా హెచ్చరికల మధ్య ఉంది. అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు.

ఇరాన్‌పై దాడులు ఉద్ధృతం చేయాలా? వద్దా? అని ట్రంప్ సందిగ్ధంలో ఉన్న సమయంలో ఆయన నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నమే ఈ నివేదిక అయి ఉండవచ్చునని ఇతర అమెరికన్ అధికారులు తమ తాజా సమాచారంలో పేర్కొన్నారు. ట్రంప్‌ను హత్య చేసేందుకు సాధ్యమయ్యే ప్రణాళికల గురించి గడచిన కొన్ని వారాలుగా అమెరికా నిఘా సంస్థలకు సమాచారం అందుతూనే ఉందని, ఈ పరంపరలో ఇజ్రాయెలీ నివేదిక సరికొత్తదని అధికారులు చెప్పారు. తుది ఒప్పందానికి రాకపోతే 'తమ పని పూర్తిచేస్తాం' అని ట్రంప్ హెచ్చరించిన తర్వాత గడచిన మంగళవారం సాయంత్రం హోర్ముజ్ జలసంధిలో మూడు అమెరికా చమురు ట్యాంకర్లపై ఐఆర్‌జిసి దాడులు చేశాయి. దీంతో ఇరాన్‌తో కుదిరిన ఎంఓయు రద్దయినట్లు ట్రంప్ ప్రకటించి యుద్ధ దాడులు ప్రారంభించారు.

# ఒమన్‌లో అమెరికా–ఇరాన్ సంభాషణలు

**•మస్కట్ చేరిన అబ్బాస్ అరాఘ్చి •వాళ్ళతో చర్చలు**
**కొనసాగించండి: వాన్స్‌కు ట్రంప్ ఆదేశం •ఎంఒయు మాత్రం రద్దైనట్టే**

**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య శనివారం (జులై 11) చర్చలకు రంగం సిద్ధమైందని టాస్ వార్తా సంస్థ పేర్కొంది. వాళ్ళతో (ఇరాన్ చర్చలబృందం) సంభాషణలు కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన తరపు సంప్రదింపుకర్తలకు ఆదేశాలు ఇచ్చారు. అదే సమయంలో ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి శనివారం మస్కట్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఒమన్‌లో ఆయనకు ఘన స్వాగతం లభించింది. హోర్ముజ్ జలసంధిలో పరిణామాలు, ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష చేసేందుకు ఆయన మస్కట్ వెళ్ళినట్లు ఇరాన్ అధికారిక మీడియా తెలియజేసింది. హోర్ముజ్ జలసంధిలో పరిణామాలు, నిర్వహణకు సంబంధించిన విషయాలపై గడచిన కొన్ని నెలలుగా ఇరాన్–ఒమన్ మధ్య జరుగుతున్న చర్చల కొనసాగింపు చర్యల్లో భాగంగా అబ్బాస్ అరాఘ్చి ఈ పర్యటనకు వెళ్ళారని ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయియా భిన్నంగా మాట్లాడారు. కాగా, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్,పశ్చిమాసియాలో ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్, విదేశాంగమంత్రి మార్కో రుబియో, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్‌లకు ట్రంప్ ఆదేశాలు ఇస్తూ, ఇరాన్‌తో చర్చలు కొనసాగించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఐతే ఎంఒయు (ఇస్లామాబాద్ ఒప్పందం) మాత్రం రద్దైపోయిందని స్పష్టం చేశారని సిబిఎస్‌ను ఉటంకిస్తూ టాస్ వార్తాసంస్థ పేర్కొంది. ఒమన్‌లో ఈ సంభాషణలు శనివారం జరుగుతాయని కూడా సిబిఎస్ పేర్కొంది. మరోవైపు బఖాయియా మాట్లాడుతూ, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో జరిగిన చర్చల్లో హోర్ముజ్ జలసంధి అత్యంత ప్రముఖపాత్ర వహించిందని చెప్పారు. ఈ జలసంధి తమ అధీనంలోనే ఉంటుందని మరోసారి ఉద్ఘాటించారు. ఈ జలసంధిలో నౌకల రాకపోకల నియమ నిబంధనలను ఒమన్ సహాయంతో తామే రూపొందించి నియంత్రిస్తామని చెప్పారు. ఒమన్‌లో సాధారణ నౌకాయాన ఏర్పాట్లు, సముద్ర సేవల బాధ్యతలను ఇరాన్ స్వీకరించిందని, దీనికి కట్టుబడి చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైంది. ఏప్రిల్ నెలలో ట్రంప్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించారు. జూన్ 17,18 తేదీలలో ఇరాన్–అమెరికా నాయకులు ఎంఓయు ఒప్పందంపై సంతకాలు చేసే ప్రక్రియ పూర్తిచేశారు. తర్వాత స్విట్జర్లాండ్ నగరం బర్గెన్‌స్టాక్‌లో ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో సాంకేతిక చర్చలు ప్రారంభమయ్యాయి. హోర్ముజ్‌లో ప్రత్యామ్నాయ దారుల వినియోగంపై వివాదం రేగింది. మళ్ళీ రెండు రోజులపాటు రెండు దేశాలమధ్యా దాడులు జరిగాక సమన్వయం పాటించి దోహాలో ఖతార్ మధ్యవర్తిత్వంలో పరోక్ష చర్చలు జరిపాయి. ఖమేనీ అంతిమయాత్ర సమయంలో ట్రంప్‌ను హత్య చేయాలన్న నినాదాలు ఆయనకు ఆగ్రహం రప్పించాయి. తుది ఒప్పందం చేసుకోకపోతే "మా పని పూర్తి చేస్తాం" అని హెచ్చరించారు. దాంతో దాడులు మొదలయ్యాయి. దీంతో అంకారాలో నాటో సదస్సు సమయంలో కాల్పుల విరమణ–ఎంఓయు రద్దైనట్లు ట్రంప్ ప్రకటించారు. కానీ మళ్ళీ జులై 11న ఒమన్‌లో చర్చలకు రంగం సిద్ధమైనట్లు వార్తలు వచ్చాయి.

## ఇరాన్ అణు కర్మాగారాల పునర్నిర్మాణ పనులు?

**ఉపగ్రహ చిత్రాలపై సిఎన్ఎన్ నివేదిక**

**వాషింగ్టన్:** ఇరాన్‌లో అమెరికా చేసిన దాడుల్లో ధ్వంసమైన అణుకర్మాగారాల వద్ద పునర్నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభమైనట్లు ఉపగ్రహ చిత్రాలు చెబుతున్నాయని సిఎన్ఎన్ నివేదిక పేర్కొంది. దేశ పౌర ప్రయోజనాల కోసం యురేనియం శుద్ధి,అణు కార్యక్రమం ఇరాన్ కు ఉన్న హక్కు అని ఆ దేశ నాయకులు మొదటినుండీ ఉద్ఘాటిస్తూ వస్తున్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదని ట్రంప్ పదే పదే చర్చల్లో బెదిరింపులు,హెచ్చరికలూ చేస్తున్నప్పటికీ ఆ విషయంలో ఇరాన్ తలవంచలేదు. ఇరాన్ క్షిపణి కార్యక్రమంపై రాజీ లేదని, ఈ విషయంలో ఎవరితో బేరసారాలు ఉండబోవని కూడా స్పష్టం చేసింది. ఇస్లామాబాద్ ఒప్పందం (జూన్ 17,18 సంతకాలు) ముగిసిందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ అణు కేంద్రాలవద్ద పునర్నిర్మాణ ప్రయత్నాలపై సిఎన్ఎన్ నివేదిక వెల్లడైంది. అణుబాంబులు తయారు చేయడానికి పేలుడు పదార్థాలను నిల్వచేసినట్లు భావిస్తున్న పర్చిన్‌లోని అణుకర్మాగారం ఇటీవల బంకర్ బస్టర్ బాంబు దాడులకు గురైంది. ఈ ప్రాంతంలో ఇప్పుడు మళ్ళీ పునర్నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు జూన్ నెల ఉపగ్రహ చిత్రాలు తెలియజేస్తున్నాయని సిఎన్ఎన్ పేర్కొంది. ఇనిస్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ సంస్థ సహకారంతో ఈ ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించారు.

# ఎన్‌డిఎస్‌ఎకే అప్పగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఎన్‌టిఎస్‌ఎ కమిటీ సూచనలను పాటిస్తుంటే, కెసిఆర్ తరపున మాత్రం కిలాడీల కమిటీ ఏర్పాటు చేసుకున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కిలాడీ కమిటీకి కెసిఆర్ చైర్మన్‌గా ఉండగా, హరీశ్‌రావు, కెటిఆర్‌తో పాటు ఈటల రాజేందర్ కూడా సభ్యులుగా చేరారని అన్నారు. ఈటల రాజేందర్ కిలాడీ కమిటీని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ వద్దకు తీసుకెళ్లి, ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్‌తో మాట్లాడి ఒప్పిస్తే మూడు బ్యారేజీలు అప్పగించేందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని సిఎం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డిఎస్‌ఎ సూచనల మేరకే ప్రాజెక్టు పునరుద్ధరణపై ముందుకు వెళ్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ చర్యలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే (2026 జూన్ 30న) ప్రత్యేక సాంకేతిక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్టు సిఎం వెల్లడించారు. మూడు బ్యారేజీల వద్ద నిర్మాణపరమైన సమస్యలు ఉన్నాయని, ఈ బ్యారేజీల డిజైన్, పునరుద్ధరణ ప్రతిపాదనలకు సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు విచారణలు, నిర్మాణ పనులు, నాణ్యత నియంత్రణ, ఏమైనా మార్పులు చేస్తే ఈ కమిటీకి తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు.

**ప్రవాహం వేరు..పంపింగ్ నీటిమట్టం వేరు**

నీటి ప్రవాహం ఉండటం వేరని, పంపింగ్‌కు అవసరమైన నీటి మట్టం ఉండటం వేరని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కనీస పంపింగ్ లెవల్ 93.50 మీటర్లు ఉండాలని, కానీ ప్రస్తుతం 89.90 మీటర్లే ఉన్నదని స్పష్టం చేశారు. అన్నారం, సుందిళ్లలో కూడా గేట్లు మూస్తే తప్ప చుక్క నీరు నిల్వ ఉండబోదని, కానీ ఆ బ్యారేజీలు భద్రంగా లేకపోవడంతో గేట్లు మూసివేసి నీటిని నిల్వ చేయరాదని ఎన్‌డిఎస్‌ఎ తన నివేదికలో స్పష్టం చేసిందని అన్నారు. ఈ నేపథ్యంలో 'నీళ్లు ఎత్తిపోయడం' అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. మేడిగడ్డ బెడ్ లెవల్ 88.50 మీటర్లు, క్రెస్ట్ లెవల్ 89.50 మీటర్లు, అక్కడ నుంచి దాదాపు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి (లక్ష్మి) పంప్ హౌజ్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలంటే కావాల్సిన పంపింగ్ లెవల్ 93.50 మీటర్లు ఉండాలన్నారు. మేడిగడ్డ వద్ద ప్రవాహం ఉన్నప్పటికీ నీటి మట్టం పంపింగ్ చేసే స్థాయి 93.50 మీటర్లు లేదని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద ఇదే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసినా, అక్కడ గేట్లు ఓపెన్ ఉన్నందున అవి కూడా మళ్లీ మేడిగడ్డకు రావాల్సిందేనని అన్నారు. ఎన్‌డిఎస్‌ఎ సిఫారసు మేరకు అక్కడ గేట్లు క్లోజ్ మూసేందుకు వీలు లేదని సిఎం స్పష్టం చేశారు.

మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు ఉన్నాయని 2020 సంవత్సరం మే 18న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బివి రమణారావు లేఖ రాశారని, ఆ తర్వాత 11 నెలల్లోనే మేడిగడ్డ బ్యారేజీలో ఉన్న లోపాలు బయటపడ్డాయని సిఎం వివరించారు. 2023 సంవత్సరం అక్టోబర్ 21న మేడిగడ్డ కుంగిపోయిందని, ఆ మరుసటి రోజే ఇంజనీర్లు దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ప్లానింగ్, డిజైనింగ్, ఆపరేషనల్ మెయింటెనెన్స్‌లో లోపాలు ఉన్నాయని 2023 సంవత్సరం, నవంబర్1న ఎన్‌డిఎస్‌ఎ నివేదిక సమర్పించిందన్నారు. 2021 సంవత్సరంలో డిసెంబర్ 30న 'డ్యామ్ సేఫ్టీ యాక్ట్2021' అమలులోకి వచ్చిందని, ఈ చట్టం ప్రకారం ఎక్కడైనా నిర్దేశిత డ్యామ్‌ల పర్యవేక్షణ, నిర్వహణ, తనిఖీలు చేయవచ్చని, కేంద్ర చట్టం ప్రకారమే ఎన్‌డిఎస్‌ఎ తెలంగాణ రాష్ట్రంలోని మేడిగడ్డను సందర్శించిందన్నారు. వివిధ పరీక్షలు, క్షేత్రస్థాయిలో నిపుణులు పరిశీలించిన అనంతరం, పది నెలల తర్వాత ఎన్‌డిఎస్‌ఎ తన తుది నివేదికను సమర్పించిందని వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కాదని ఆ నివేదికలో స్పష్టం చేసిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్ నష్టం వల్ల బ్యారేజీ నుంచి నీటి మళ్లింపునకు పనికి రాకుండా పోయిందని, అన్నారం బ్యారేజీ తీవ్రంగా దెబ్బతిన్నదని, తద్వారా నీటి మళ్లింపు సురక్షితం కాదని, సుందిళ్ల బ్యారేజీ తీవ్రంగా దెబ్బతిన్నందున నీటి మళ్లించటం సురక్షితం కాదని ఎన్‌డిఎస్‌ఎ తన నివేదికలో పొందుపర్చిన విషయాన్ని సిఎం వివరించారు. ఎగ్జిక్యూటివ్ సమ్మరీలో 17వ పాయింట్‌లో మూడు బ్యారేజీల (మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం) తీవ్ర నష్టాలను క్రోడీకరించిందని, సమగ్ర పునరుద్ధరణ డిజైన్ అవసరమని స్పష్టం చేసిందన్నారు. మొత్తం బ్యారేజీ పటిష్టత, భద్రతపై సమగ్ర అంచనా వేసి, ఇప్పుడున్న దుస్థితిని అరికట్టడానికి తక్షణ స్థిరీకరణ చర్యలను సిఫారసు చేసినట్టు సిఎం తెలిపారు. పునరుద్ధరణ డిజైన్లు,రిపేర్లు, ఇతర పనులన్నీ ఎన్‌డిఎస్‌ఎ లేదా సిడబ్ల్యుసి ఆమోదంతోనే చేపట్టాలని ఆ సిఫార్సుల్లో పేర్కొన్నట్టు చెప్పారు.

**హరీశ్‌రావు సూచనల మేరకే ఈటల మాట్లాడుతున్నారు**

గోదావరిలో పారుతున్న నీళ్లను ఎత్తిపోయాలని బిఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని, ఆ వాదనకు మద్దతుగా బిజెపి ఎంపి ఈటల రాజేందర్ కూడా మాట్లాడుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సాగునీటి మంత్రి లేదా ఎన్‌డిఎస్‌ఎ అధికారులతో వివరాలు తెలుసుకుని ఈటల రాజేందర్ మాట్లాడితే ఆయన గౌరవం మరింత పెరిగేదని, హరీష్ సూచనల మేరకే ఈటల మాట్లాడటం ద్వారా ఆయన గౌరవాన్ని కోల్పోయారన్నారు.

**సిబిఐ విచారణను ఏ చీకటి ఒప్పందం ఆపుతుంది?**

కాళేశ్వరం అవినీతిపై సిబిఐ విచారణ చేపట్టకుండా ఏ చీకటి ఒప్పందం ఆపుతుందని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. దీనిపైన ఈటల రాజేందర్ ఎందుకు కేంద్రానికి లేఖ రాయడంలేదని సిఎం నిలదీశారు. పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించాలని, సిబిఐ విచారణకు తక్షణమే ఆదేశాలు తీసుకురావాలని సూచించారు. ఎన్‌డిఎస్‌ఎ పర్యవేక్షణ పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోసే అంశంలో తాము రాజేందర్‌కు సంపూర్ణంగా సహకరిస్తామన్నారు.

**హరీశ్‌రావును కెసిఆర్ నమ్మలేదు..**
**ప్రభుత్వం ఎలా నమ్ముతుంది:**

హరీశ్‌రావును ఆయన మామ కెసిఆర్ నమ్మలేదని, అదనంగా కమీషన్లు వసూలు చేయడంతోనే ఒక ఏడాది పాటు హరీశ్‌రావుకు మంత్రి పదవి ఇవ్వలేదని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టులలో మామకు ఆరు, అల్లుడికి మూడు, కొడుకు ఒక్క మొత్తం పదిశాతం కమీషన్లు వసూలు చేశారన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించిన పాత కమీషన్ల వసూళ్ల కోసమే హరీశ్‌రావు మూడు నెలల పాటు మంత్రి పదవి ఇవ్వాలని అడుగుతున్నారని సిఎం అన్నారు. దోపిడీదారులతో రిటైర్డ్ ఇంజనీర్లు భాగస్వాములు అయ్యారని, రిటైర్డ్ ఉద్యోగుల ముసుగులో కాంట్రాక్టర్ల వద్ద కోట్ల రూపాయాలను తీసుకున్నారని సిఎం ఆరోపించారు. రిటైర్డ్ ఇంజినీర్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి ప్రస్తుతం సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, అప్పుడు చేసిన తప్పులకు రిటైర్డ్ ఇంజినీర్లను చెర్లపల్లి జైలులో పెట్టకుండా తప్పు చేశామని సిఎం అన్నారు.

## ఉన్మాది కిరాతకం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటూనే బెయిల్ కోసం అప్లై చేసుకున్నాడు. మొత్తానికి అతనికి ఈ మధ్య కాలంలోనే బెయిల్ వచ్చింది. దీంతో పగ పెంచుకున్న రాజ్ కుమార్ శుక్రవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో షాబాద్ లో నివాసం ఉంటున్న మైనర్ బాలి(17) ఇంటికి వెళ్లిన రాజ్ కుమార్ బాలిక తల్లి చిట్యాల లక్ష్మీ (45), నానమ్మ చిట్యాల రుక్కమ్మ (65), తన వెంట తెచ్చుకున్న కత్తితో నరికి చంపి మైనర్ బాలిక (17) కారులో షాబాద్ మండల కేంద్రం నుండి సుమారు ఆరు కిలోమీటర్ల దూరం లో ఉన్న తన సొంత గ్రామమైన దైవాలగూడ తీసుకువెళ్లి అక్కడున్న చెరువు పక్కన అత్యాచారం చేసి బాలికను అతికిత కిరాతకంగా నరికి చంపాడు.ఆ తర్వాత తమ సొంత ఇంటికి వెళ్లిన నరరూప రాక్షసుడు రాజ్ కుమార్ భార్య పార్వతి సరిత (30), పిల్లలు పరీక్షిత్ (03), దైవిక్షిత్ (02) కత్తితో పొడిచి చంపాడు. ఈ క్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల వారికి వినపడకుండా ఉండేందుకు టీవీ సౌండ్ పెంచి పెట్టినట్లు స్థానికులు గుర్తించారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన నిందితుడు రాజ్ కుమార్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను ఆరుగురిని హత్య చేసినట్లు చెప్పి.. తాను కూడా చనిపోతున్నట్లు చెప్పినట్లు కుటుంబ సభ్యులు షాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీస్ ఉన్నత అధికారులకు సమాచారం చేరవేయడంతో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. దీంతో క్లూస్ క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్, రప్పించడంతోపాటు పోలీసులను పలు బృందాలను ఏర్పాటు చేసి నింధితుడిని పట్టుకునేందుకు రంగాల్లోకి దింపారు.

**ఘటనపై గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన**

పోక్సో కో కేసులో నిందితుడికి అరెస్ట్ బెయిల్ పై బయటకు వచ్చిన రాజ్ కుమార్ ప్రతీకారంతో ఆరుగురిని కిరాతకంగా హత్య చేసిన ఘటనపై గ్రా మస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు.ఈ దారుణానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటూ శనివారం ఉదయం షాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ఆందోళనకు దిగారు.బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ను ముట్టడించి ఇంతటి దారుణానికి కారణమైన షాబాద్ సిఐ,ఎస్ఐలను వెం టనే సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. పోక్సో కేసు నమోదు చేసినప్పటికీ నిందితుడి కదలికలపై పోలీసులు నిఘా పెట్టలేదని,బాధిత కుటుంబానికి ఎలాంటి భద్రత కల్పించలేదని ఆరోపించారు. బెయిల్ పై విడుదలైన తర్వాత కూడా అతడి నుంచి ప్రమాదం పొంచి ఉందన్న విషయం తెలిసినా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించలేదని మండిపడ్డారు.ఆరుగురి హత్యలకు షాబాద్ సిఐ,ఎస్ ఐల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆందోళనకారులు ఆరోపించారు.రాజ్ కుమార్ పోక్సో చట్టం కింద కేసు నమోదు అయినప్పటికీ.కేవలం 7 సంవత్సరాల లోపు శిక్ష పడే సెక్షన్లు జత చేసి కేసు నమోదు చేసిన పోలీసులపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని,బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలీసు వైఫల్యం వల్లేనె అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆందోళన తీవ్ర రూపం దాల్చడంతో షాబాద్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అదనపు పోలీసు బలగాలను మోహరించారు.అధికారులు బాధిత కుటుం సభ్యులతో,గ్రామ పెద్దలతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు.






**షాబాద్ ఎస్ఐ రమేష్ సస్పెన్షన్ :**
**జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**

షాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబాలను ఉద్దేశించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి షాబాద్ ఎస్ఐ రమేష్ ను సస్పెన్షన్ చేశామన్నారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు తక్షణ ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి అందించడం జరుగుతుందన్నారు.ఆ తర్వాత కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

**భార్యాపిల్లలను చంపడం ఆశ్చర్యంగా ఉంది – ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి**

ఆరు హత్యల కేసు రాత్రి హత్య జరిగిందని తమకు సమాచారం వచ్చిందని చెప్పారు.రెండు చోట్ల హత్యలు జరిగాయని తెలిపారు.మొదట షాబాద్ కేంద్రంలో బాధితురాలి ఇంటికి రాత్రి 11 గంటల సమయంలో నిందితుడు పార్వతి రాజ్ కు మార్ వెళ్లాడని,అక్కడ బాధితురాలి తల్లిని,నానమ్మను హత్య చేశాడని చెప్పారు.ఆ తర్వాత బాలికను నాగర్ కుంట చెరువు దగ్గరకు తీసుకెళ్లి హత్య చేశాడని సిపి తెలిపారు.ఆ తర్వాత ఇంటికి వెళ్లి తన భార్య,పిల్లలను చంపేశాడని వివరించారు.ఆ తరువాత రాజ్ కుమార్ తన తల్లి దండ్రులకు కాల్ చేసి ఆరుగురిని చంపేశానని,తాను కూడా చనిపోతున్నానని చెప్పినట్లు తెలిపాడన్నారు.తమకు సమాచారం రావడంతో ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాలను ఆస్పత్రికి తరలించామని సిపి తెలిపారు.రాజ్ కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడన్నారు.అతని కోసం పలు బృందాలుగా విడిపోయి పోలీస్ లు గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు.భార్యాపిల్లలను కూడా రాజ్ కుమార్ చంపడం తమను ఆశ్చర్యానికి గురి చేసిందని సిపి పేర్కొన్నారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ 2 లక్షల నగదు బహుమతి ఆరుగురు హత్యలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు పి.రాజ్‌కుమార్‌ను పట్టుకునేందుకు దారితీసే విశ్వసనీయ సమాచారం అందించిన వారికి రూ.రెండు లక్షలు నగదు బహుమతి అందజేయనున్నట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రకటించింది. సమాచారం అందించిన వ్యక్తి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, వారి భద్రతకు పూర్తి హామీ ఇవ్వబడుతుంది. నిందితుడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు చేవెళ్ల పోలీస్ కంట్రోల్ రూమ్ 8712665324 నంబర్‌కు ఫోన్ కాల్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించి సమాచారం అందించవచ్చునని పోలీస్ కమిషనర్ తరపున పత్రిక ప్రకటన విడుదల చేశారు.

## భూ రీ సర్వే

(మొదటి పేజీ తరువాయి)

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చామన్నారు. రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తి స్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్టినట్లు తెలిపారు. మార్చి 2027 నాటికి మూడు విడతల్లో రీ సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీ సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ. 50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ. 60లు అందజేస్తామని తెలిపారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 2బిహెచ్‌కె ఇండ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ సర్వేను నవంబర్ లోపు పూర్తి చేయాలన్నారు. రెండవ విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి 2027 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ హౌసింగ్ కార్పోరేషన్ ఎండి విపి గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుడిసెలను గుర్తించిన వాటిలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సెర్ప్ సిఈవో దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంల న్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. జులై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జులై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డిఆర్‌డిఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో భూ రీ సర్వే చేపట్టామన్నారు. నాలుగు యంత్రాలను సిఎస్ఆర్ నిధుల ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎస్. శ్రీనివాస్, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఐదు వికెట్లతో రెచ్చిపోయిన క్రాంతి గౌడ్




లార్డ్స్ లో జరుగుతున్న చరిత్రాత్మక టెస్టులో భారత పేసర్ క్రాంతి గౌడ్ (3–25) నిప్పులు చెరిగింది. తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శనతో ఇంగ్లాండ్ నడ్డివరిచింది. స్వింగ్‌తో టాపార్డర్‌ను కూల్చిన క్రాంతి.. లంచ్ తర్వాత విజృంభించగా ఆతిథ్య జట్టు 170కే ఆలౌటైంది. అమీ జోన్స్(52), కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) మినహా ఎవరూ రాణించకపోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 115 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. సయాలీ సత్ఘరే(1–36), స్నేహ్ రాణా(1–35) రాణించారు. లార్డ్స్ టెస్టులో రెండో రోజు పట్టుబిగించిన భారత జట్టు పేసర్ క్రాంతి గౌడ్ (5–37) సంచలన ప్రదర్శనతో ఇంగ్లాండ్‌ను పడగొట్టింది. సొంతగడ్డపై దంచేయాలనుకున్న ఇంగ్లాండ్ బ్యాటర్లను వణికించిన క్రాంతి.. మొదటి సెషన్‌లోనే కోలుకోలేని దెబ్బకొట్టింది. ఓపెనర్ మియా బౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే(9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(240), స్నేహ్ రాణా(241) రెచ్చిపోగా లంచ్ లోపే సగం మంది పెవిలియన్ చేరారు. అర్ధ శతకం బాదిన అమీ జోన్స్ (52) వెనుదిరిగినా.. పట్టువదలకుండా క్రీజునంటుకున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) పోరాడింది. కానీ, లంచ్ తర్వాత ఆమెను సైతం గౌడ్ వెనక్కి పంపింది. లారెన్ బెల్‌ను ఔట్ చేయడం ద్వారా టెస్టుల్లో మొదటిసారి ఐదు వికెట్లు తీసింది భారత స్పీడ్‌స్టర్. చివరి బ్యాటర్ లారెన్‌ను దీప్తి ఎల్బీ చేయడంతో 170 వద్ద ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాకు 115 పరుగుల ఆధిక్యం లభించింది.

## వింబుల్డన్‌కు క్రికెట్ కళ..


### రాయల్ బాక్స్‌లో గిల్, సచిన్..!

ఇంగ్లాండ్ వేదికగా జరుగుతున్న వింబుల్డన్ టోర్నీకి క్రికెట్ కళొచ్చింది. టెన్నిస్ గ్రాండ్ స్లామ్ గ్యాలరీలో సచిన్ టెండూల్కర్, వెస్టిండీస్ లెజెండ్ బ్రియాన్ లారా, భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తళుక్కుమన్నారు. రాయల్ బాక్స్‌లో రాయల్ లుక్‌తో గిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. సతీమణి అంజలి సమేతంగా సచిన్ హాజరయ్యాడు. విరామంలో వీరితో టెన్నిస్ గ్రేట్ రోజర్ ఫెదరర్ కలవడంతో కెమెరా కళ్లన్నీ వీరివైపే తిరిగాయి. వన్డే సిరీస్‌కు ముందే ఇంగ్లాండ్ చేరుకున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బిజీగా గడుపుతున్నాడు. పాప్ సింగర్లను కలిసి.. మెర్సిడెజ్ బెంజ్ గ్యారేజ్‌లో ఫార్ములా వన్ రేసర్ ఆంటినెల్లాతో కలిసి కారిడార్ క్రికెట్ ఆడిన గిల్ ఈసారి వింబుల్డన్‌లో మెరిశా డు. భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ సతీసమేతంగా మ్యాచ్ చూసేందుకు రాగా.. రాయల్ బా క్స్‌లో వారి పక్కనే కూర్చున్నాడు టీమిండియా కె ప్టెన్. మ్యాచ్ చూసేందుకు వచ్చిన వెస్టిండీస్ వెటరన్ బ్రియాన్ లారా, టెన్నిస్ లెజెండ్ రోజర్ ఫెదరర్‌తో కాసేపు ముచ్చటించాడు గిల్. జకోవిచ్, సినర్ మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ వీక్షించారు వీరంతా.



## 10.14 సెకన్లలో 100 మీటర్లు

### తొలి భారతీయుడిగా అనిమేశ్ రికార్డు




భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ ఆశాకిరణంగా అవతరించిన అనిమేశ్ కుజుర్ మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇండియన్ ఉసేన్ బోల్ట్‌గా పేరొందిన ఈ కుర్రాడు విదేశీ గడ్డపై 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేశాడు. జర్మనీ వేదికగా జరిగిన పుమా ఫాస్ట్ ఆరమ్స్ లెగ్స్ 2026 మీట్‌లో సత్తా చాటిన అనిమేశ్ భారత్ అవతల ఇంత వేగంతో వంద మీటర్లు పరుగెత్తిన తొలి అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాడు. ట్రాక్ మీద బుల్లెట్ వేగంతో దౌడు తీస్తూ జాతీయ స్థాయిలో రికార్డులు బద్ధలు కొడుతున్న అనిమేశ్ కుజుర్ మళ్లీ మెరిశాడు. టోక్యోలో జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ మీద గురి పెట్టిన అతడు పుమా పాస్ట్ ఆరమ్స్ లెగ్స్ 2006 మీట్‌లో చిరుతలా పరుగుతీశాడు. 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేసి ఔరా అనిపించాడు. తొలుత 10.19 సెకన్లకు పరిమితమైన అనిమేశ్ ఫైనల్లో తన వేగాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. అయితే.. అత్యంత వేగంగా 100 మీటర్ల పరుగుతో రికార్డు సాధించిన గురిందెర్వీర్ సింగ్ (10.09 సెకన్లు)ను మాత్రం అందుకోలేకపోయాడీ రన్నర్.

#### గురిందెర్వీర్‌కు పోటీగా..

అనిమేశ్ కుజుర్‌ది ఛత్తీస్‌గఢ్‌లోని మారుమూల గ్రామం. ఆరడుగుల రెండు అంగుళాల పొడవుండే ఇతడు టీనేజ్ నుంచే తన స్పీడ్‌తో అందరీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఈమధ్యే 100 మీటర్ల దూరాన్ని 10.18 సెకన్లలో చేరుకొని చరిత్ర సృష్టించాడు. తద్వారా గురిందెర్వీర్ (10.20 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును బద్ధలు కొట్టి 'ది ఫాస్టెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అవతరించాడు అనిమేశ్. 22 ఏళ్లకే దేశం గర్వించదగ్గ అథ్లెట్‌గా మారిన అతడు ఈమధ్యే మొనాకో డైమండ లీగ్‌లో పోటీపడ్డాడు.

**100 మీటర్ల చిరుతలు**

1. గురిందెర్వీర్ సింగ్ – 10.09 సెకన్లు
2. అనిమేశ్ కుజుర్ – 10.14 సెకన్లు
3. అనిమేశ్ కుజుర్ – 10.15 సెకన్లు
4. గురిందెర్వీర్ సింగ్ – 10.17 సెకన్లు
5. అనిమేశ్ కుజుర్ – 10.18 సెకన్లు




# స్థిరపడిన మార్కెట్లు

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 77,763.91 పాయింట్లు. ముగింపు 77,569.39 పాయింట్లు. నష్టం 194.52 పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 24,270.85 పాయింట్లు. ముగింపు 24,206.90 పాయింట్లు. నష్టం 63.95 పాయింట్లు.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,44,820
22 క్యారెట్లు: రూ. 1,32,751
18 క్యారెట్లు: రూ. 1,08,620.



(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).



ఈ వారం (జులై 6–10) భారతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. చివరికి స్వల్ప నష్టాలతో బయటపడ్డాయి. అయితే ఈ గణాంకాలు కనిపించేంత ప్రతికూలంగా మార్కెట్ పరిస్థితి లేదని చెప్పవచ్చు. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించినప్పుడు ప్రపంచ మార్కెట్లలో ఒక్కసారిగా ఆందోళన నెలకొనగా, భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగే అవకాశంపై పెట్టుబడిదారులు అమ్మకాల వైపు మొగ్గు చూపడంతో భారత మార్కెట్లు కూడా భారీ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. కానీ, ఆ తరువాత పరిస్థితి కొంత స్థిరపడింది. విదేశీ మార్కెట్లలో భయాందోళనలు తగ్గడం, దేశీయ ఆర్థిక వ్యవస్థపై పెట్టుబడిదారుల విశ్వాసం కొనసాగడం, బ్యాంకింగ్, ఐటీ వంటి రంగాల్లో కొనుగోళ్లు రావడం వల్ల సూచీలు తమ కనిష్ఠ స్థాయిల నుంచి గణనీయంగా కోలుకున్నాయి. ఇది మార్కెట్‌లో కొనుగోలు ఆసక్తి ఇంకా బలంగానే ఉందని సూచిస్తోంది. ఇలావుంటే, వచ్చే వారం మార్కెట్ దిశ ప్రధానంగా అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికా–ఇరాన్ సంబంధాల్లో మరిన్ని ఉద్రిక్తతలు ఏర్పడతాయా లేదా పరిస్థితి చల్లబడుతుందా అన్నది పెట్టుబడిదారుల భావోద్వేగాలను ప్రభావితం చేస్తుంది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరిగితే భారత మార్కెట్‌పై ఒత్తిడి కొనసాగవచ్చు. మరోవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ప్రవాహం కొనసాగితే మార్కెట్‌కు బలం చేకూరుతుంది. సాంకేతిక విశ్లేషణ పరంగా చూస్తే నిఫ్టీ 24,100– 24,150 స్థాయిల వద్ద మద్దతు పొందే అవకాశం ఉండగా, 24,350– 24,450 స్థాయిల వద్ద ప్రతిఘటన ఎదురయ్యే అవకాశం ఉంది. సెన్సెక్స్‌కు 77,300 ప్రాంతం కీలక మద్దతుగా, 78,000 ప్రాంతం కీలక నిరోధక స్థాయిగా మారవచ్చు. మొత్తం మీద వచ్చే వారం మార్కెట్ అధిక ఒడిదుడుకులతో కూడిన పరిమిత శ్రేణిలో కదిలే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. అంతర్జాతీయ పరిస్థితుల్లో ప్రతికూల వార్తలు లేకపోతే స్వల్ప సానుకూల ధోరణి కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## భారత్‌పై అదనపు పన్ను ప్రతిపాదన!

అమెరికా ప్రతిపాదించిన 12.5 శాతం అదనపు దిగుమతి సుంకం భారత్‌ను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది. ఇరు దేశాల మధ్య వాణిజ్య వివాదాలను ఏకపక్ష నిర్ణయాల ద్వారా కాకుండా, పరస్పర చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఈ ఘటనపై స్పందించిన భారత్ స్పష్టం చేసింది. యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్) నిర్వహించిన బహిరంగ విచారణలో భారత వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీ బ్రిజ్ మోహన్ మిశ్రా పాల్గొని, అమెరికా



దర్యాప్తు నివేదికలో అనేక లోపాలు ఉన్నాయని మండిపడ్డారు. వెట్టిచాకిరి లేదా బలవంతపు కార్మిక వ్యవస్థ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతిని నిరోధించడంలో భారత్ విఫలమైందన్న అమెరికా ఆరోపణలను ఆయన పూర్తిగా తిరస్కరించారు. బలవంతపు కార్మిక వ్యవస్థ నిర్మూలన అనేది భారత రాజ్యాంగ విధి అని, దేశం అంతర్జాతీయ చట్టాలను తూచా తప్పకుండా పాటిస్తోందని స్పష్టం చేశారు. ఎటువంటి నిర్దిష్ట ఆధారాలు లేకుండా, కేవలం అపోహలతోనే అమెరికా ఈ నివేదికను తయారు చేసిందని భారత్ వాదించింది. వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం ఫస్ట్ సెక్రటరీ శ్రేయాన్స్ గుప్తా మాట్లాడుతూ, భారత బియ్యం దిగుమతుల వల్ల అమెరికా మార్కెట్ దెబ్బతింటోందనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అమెరికాకు ఎగుమతయ్యే బియ్యం కఠినమైన నిబంధనలకు లోబడి, నమోదిత మిల్లుల నుండే వస్తుందని తెలిపారు. కాబట్టి ఈ విచారణను నిలిపివేయాలని లేదా భారతీయ బియ్యానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారతీయ పారిశ్రామిక సంస్థలైన ఫిక్కీ, సిఐఐ కూడా అమెరికా పన్ను ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ అదనపు పన్నుల వల్ల భారత ఎగుమతిదారులతో పాటు, అమెరికాలోని తయారీదారులు, వినియోగదారులపై కూడా తీవ్ర ద్రవ్యోల్బణ (ధరల పెరుగుదల) భారం పడుతుందని ఫిక్కీ హెచ్చరించింది. బలవంతపు కార్మిక వ్యవస్థ వంటి కారణాలను చూపుతూ 2026 మార్చిలో యుఎస్‌టిఆర్ దర్యాప్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా భారత్, చైనాతో సహా 54 దేశాలపై 12.5 శాతం అదనపు సుంకాలను ప్రతిపాదించింది. అయితే, ఇది ప్రాథమిక ప్రతిపాదన మాత్రమే కావడం వల్ల, తుది నిర్ణయానికి ముందు అన్ని దేశాల అభ్యంతరాలను యుఎస్‌టిఆర్ పరిశీలించాల్సి ఉంటుంది.

## రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రావడం ఖాయం

### టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయ ప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంగారెడ్డి నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ అయినా, జనరల్‌గా ఉన్నా నిర్మల జగ్గారెడ్డే కాంగ్రెస్ అభ్యర్థిగా ఉంటారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయ ప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) అన్నారు. తాను సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోనని మాత్రమే చెప్పానని, వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేయబోనని ఎక్కడా చెప్పలేదని ఆయన స్పష్టత ఇచ్చారు. గాంధీ భవన్‌లో శనివారం మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రావడం ఖాయమని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారన్నారు. 117 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించే లక్ష్యంతో సిఎం రేవంత్ రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. పార్టీ బలోపేతానికి సిఎం చేపడుతున్న వ్యూహాలు, నిర్ణయాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, రేవంత్ రెడ్డి ఆలోచనలతో తమకు ఏకాభిప్రాయం ఉందని తెలిపారు.అభ్యర్థుల ఎంపిక అంశంపై స్పందిస్తూ, ఎవరికెవరికీ టికెట్లు ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షుడు, పార్టీ రాష్ట్ర ఇంచార్జీ కలిసి తీసుకునే నిర్ణయమని స్పష్టం చేశారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం సరైన ఆలోచనే నని పేర్కొన్నారు. ఎవరి సర్వేలు వారు తమకు అనుకూలంగా నిర్వహిస్తారని, వాటిని చూసి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గతంలో కెసిఆర్ తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా పలువురు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల పనితీరు సరిగా లేదని సర్వేలు వెల్లడించాయని గుర్తు చేశారు. ప్రతిపక్షం అధికార పార్టీని విమర్శించడం రాజకీయాల్లో సహజమని, అదే రాజకీయ నీతి అని జగ్గారెడ్డి అన్నారు. ఎంఎల్‌ఎల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, అవసరమైన చోట ప్రజా ప్రతినిధులకు సూచనలు చేస్తూ పాలనను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నారని జగ్గారెడ్డి అన్నారు.

## ఎల్‌నిఓ ప్రభావం దృష్ట్యా పంటల మార్పిడిపై దృష్టి సారించాలి

### రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవడంతో పాటు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు సకాలంలో రైతు భరోసా ఆర్థిక సాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలకు తెలంగాణ రైతాంగం తరపున రైతు కమిషన్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయనపేర్కొన్నారు.పంటల మార్పిడి అవసరాన్ని రేవంత్ రెడ్డి ముందుగానే ప్రస్తావించారని, అదే అంశంపై రైతు కమిషన్ కూడా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించిందని కోదండరెడ్డి వెల్లడించారు. వాతావరణ మార్పులు, నీటి లభ్యత, మార్కెట్ అవసరాలను దృష్టి లో ఉంచుకుని పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం కూడా సూచిస్తోందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తమ ప్రాంతాలకు అనువైన సంప్రదాయ పంటల సాగుపై మళ్లీ దృష్టి సారించాలని ఆయన సూచించారు. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే పంట నష్టాలను తగ్గించుకోవడంతో పాటు ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ సాధనకు తొలి ఉద్యమం ఎఐటియుసిదే

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ తొలి ఉద్యమానికి శ్రీకారం చుట్టింది ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ యూనియనేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. శనివారం శ్రీరాంపూర్‌లోని ఆర్‌కె 5 గనిలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ 2013లోనే సచివాలయాన్ని ముట్టడించి అరెస్టులకు గురైన ఘనత ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ దేనని గుర్తు చేశారు. ప్రస్తుతం తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్‌తో పాటు మిగిలిన అన్ని బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చామని, త్వరలో రీజినల్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగే చర్చలు విఫలమైతే ఆగస్టు నెలలో సమ్మెకు వెళ్లడం ఖాయమని వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించారు. నాలుగు లేబర్ కోడ్ల కారణంగానే వేజ్ బోర్డు అమలు ఆలస్యమవుతోందని విమర్శించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు 40 శాతం లాభాల వాటాను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయ పన్నును రద్దు చేయాలని, సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే వసూలు చేసి, కొత్త బొగ్గు ప్రాజెక్టులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ మోత్కూరి కొమురయ్య, ఏరియా మైనిస్టాఫ్ ఇన్‌చార్జ్ అడ్డు శీను, ఆర్కే5 ఫిట్ సెక్రెటరీ నరసింగరావు, నాయకులు మల్లేష్, ప్రవీణ్, జిపి రావు, శంకర్రావు పాల్గొన్నారు.

## కార్మిక బద్ధ వ్యతిరేకి ప్రధాని మోదీ

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నిరంతరం కార్మికుల యొక్క హక్కులను కాలరాస్తున్న కార్మిక బద్ధ వ్యతిరేకి నరేంద్ర మోడీని సాగనంపాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్ ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించిన ఎఐటియుసి 11వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వతంత్రానికి పూర్వం సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను నేటి మోదీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకవచ్చిందని మండిపడ్డారు. గుత్తా పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కార్మిక వ్యతిరేకి మోదీని వచ్చే ఎన్నికల్లో సాగనంపే వరకు మరో స్వతంత్ర పోరాటానికి కార్మికులు సన్నద్ధం కావాలని కోరారు. రాష్ట్రంలో మాటల గారడితో మాయ చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందు దొందుగానే మిగిలాయని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాజకీయ పబ్బం గడుపుతూ కార్మికులను పేద ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అంతకు ముందు ఎఐటియుసి జెండాను ఆవిష్కరించారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా దంతాల రాంబాబు, శ్యామల అశోక్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, చివ్వెంల మండల కార్యదర్శి కె. రాము, యూనియన్ నాయకులు సైదులు, దీకొండ శ్రీనివాస్, పెంద్ర కృష్ణ, వెంకన్న, సాయిబాబా, ఏఐవైఎఫ్ నాయకులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.




## సీతారామను సత్వరం పూర్తి చేయండి

### ముఖ్యమంత్రికి సిపిఐ వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మంజిల్లా సాగునీటికి సంబంధించి ప్రధాన జీవనాధారంగా ఉన్న సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల నూతన ఆయకట్టుకు సాగునీటిని ఇవ్వడంతో పాటు నాలుగున్నర లక్షల ఎకరా ల ఆయకట్టు స్థిరీకరణకు సంబంధించి ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టు నిధు ల కేటాయింపు లేక నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు బిఆర్‌ఎస్ తొమ్మిదివేల కోట్లు ఖర్చు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపు సరైన రీతిలో లేకపోవడంతో ప్రాజెక్టు అంచనా వ్యయం పెరుగుతూ వచ్చిందన్నారు. ఎలినినో ప్రభావం కృష్ణా పరివాహక ప్రాంతాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల రీత్యా సీతారామ సత్వర నిర్మాణానికి సరిపడ నిధులు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. ఖమ్మం మినహా అన్ని ఉమ్మడిజిల్లాల్లో యూనివర్సిటీలు ఉన్నాయని ఖమ్మంలో యూనివర్సిటీని స్థాపించాలని జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాల ని సంక్షోభంలో కూరుకుపోతున్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని వినతి ప త్రంలో పేర్కొన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షన్నర మంది ఆధారపడిన గ్రా నైట్ పరిశ్రమకు చేయూతనివ్వాలని వినతి పత్రంలో కోరారు. ఖమ్మంజిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. ఖమ్మం నగరం ఇటీవల కాలంలో బాగా విస్తరించిందని ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని ఫ్లైఓవర్ల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు దూసరి గోపాలరావు ఉన్నారు.

## అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ సరికాదు



- బిఎల్‌ఒ విధుల నుండి తక్షణమే మినహాయింపు ఇవ్వాలి
- ఎన్నికల హామీలను సిఎం నిలుపుకోవాలి
- నేటి నుండి అంగన్వాడీల సమస్యలపై పాదయాత్ర
- ఎఐటియుఎసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్

**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై పనిభారం మోపుతూ వెట్టిచాకిరీ చేయించడం సరికాదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు గోనె మణితో కలిసి ఆయన మాట్లాడారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతల సంక్షేమంలో కీలకపాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీలను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అదనపు విధుల పేరుతో వేధింపులకు గురి చేయడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికార యంత్రాంగం నిర్వాకంతో అంగన్‌వాడీ వ్యవస్థ క్రమంగా కుప్పకూలుతోందన్నారు. కనీస అవసరాలు సమకూర్చకపోగా, సిబ్బందిపై పనిభారం మోపడం సరైంది కాదన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే వ్యవస్థ నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని నరాటి అభిప్రాయం వ్యక్తం చేశారు. బిఎల్‌ఒ విధులు అప్పగించడం ద్వారా కేంద్రాల నిర్వహణ ఇబ్బందిగా మారిందని సర్వేల పేరుతో బాధ్యతలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి క్రమంలో పౌష్టికాహారం ఎవరు అందిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీపై హామీల వర్షం కురిపించిన పాలకులు అధికారంలోకి వచ్చాక మరిచారని, ఇచ్చిన మాట నిలుపుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. నెలకు రూ.15వేల జీతం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ ఆదివారం నుండి రెండు రోజుల పాటు పాదయాత్ర నిర్వహించతలపెట్టామని, ఆ పాదయాత్ర ఆదివారం భద్రాచలం నుండి ప్రారంభమైన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాతో ముగుస్తుందని ఆయన చెప్పారు. ఇప్పటికైనాప్రభుత్వం నిద్రమత్తు వీడి అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్, వేల్పుల మల్లిఖార్జున రావు, మండల రాజు, రత్నకుమారి, చిన్నారి, కంభంమెట్టు శ్రీనివాస్, మారెడ్డి శివాజీ, ఎస్వీఎస్ నాయుడు, మీసాల భాస్కర్ రావు, భద్రాద్రి వెంకటేశ్వరరావు, మహేష్, గుంజ రామారావు, సత్తినేడు సాయిరామ్, రద్ర బ్రదర్స్, చింతలరామారాజు తదితరులు పాల్గొన్నారు.



## 'నేడు' నకిరేకల్ నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి పర్యటన

### ఏర్పాట్లను పర్యవేక్షించిన ప్రభుత్వ విప్ వీరేశం

**ప్రజాపక్షం/రామన్నపేట** : నకిరేకల్ నియోజకవర్గంలో ఆదివారం రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా నియోజకవర్గ పరిధిలో పలు కీలక అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేయనున్నారు. మంత్రి పర్యటనలో భాగంగా నార్కట్‌పల్లి మండలంలో ప్రజలు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దీనితో పాటు, ఎంతో ప్రాధాన్యత కలిగిన చిట్యాల భువనగిరి ప్రధాన రహదారి విస్తరణ పనులకు కూడా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భూమిపూజ చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే ప్రాంతీయ రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోనున్నాయి. శంకుస్థాపన కార్యక్రమాల అనంతరం రామన్నపేటలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మంత్రి పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ సభకు నియోజకవర్గ నలుమూలల నుండి ప్రజలు,ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. పర్యటన విజయవంతం చేయడానికి నియోజకవర్గంలో చేపట్టిన ముందస్తు ఏర్పాట్లను ఆయన శనివారం అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

## జాప్యం లేకుండా దరఖాస్తులు

### మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గంలో తప్పుల్లేని పరిపూర్ణ ఓటరు జాబితా రూపకల్పన కోసం బూత్ లెవెల్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామం, మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డు వినోభానగర్ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు విస్తృత సవరణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. క్షేత్ర స్థాయిలో అందుతున్న సేవలపై ప్రజలను, సిబ్బందిని అడిగి ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకుండా నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించాలన్నారు. బీఎల్‌ఓల వద్ద పెండింగ్‌లో ఉన్న ఫారాలను ఎప్పటికప్పుడు పూర్తి చేసి ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కొత్తగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునే యువతకు, మార్పులు చేర్పుల కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ మరియు రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 'సర్' నెల రోజుల పాటు పొడిగించాలి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ




**ప్రజాపక్షం/చౌటుప్పల్** : ఓటర్లను చైతన్యం చేయడంలో అధికార యంత్రాంగం విఫలం చెందుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగొని సత్యనారాయణ అన్నారు. నేడు సిపిఐ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో నిర్వహిస్తున్న సర్‌లో చాలా మందికి ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని, ఫారాలు నింపడంలో సరైన అవగాహన లేక ఓటర్లు తెలిసి తెలియక పూర్తి చేసి ఇబ్బందులు గురి అవుతున్నారని. ఓటర్లను బిఎల్‌ఓలు తమ దగ్గరికే వచ్చి ఫారాలు తీసుకోవాలని చెబుతున్నారని, ఇంటింటికి తిరిగి ఫారాలు పంపిణి చేయడం లేదన్నారు. గ్రామ స్థాయిలో గ్రామ సభలు నిర్వహించి ఓటర్లకు సరైన అవగాహనా కల్పించే విదంగా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. సర్ ప్రక్రియ అనేది పారదర్శకంగా జరగాలి తప్ప బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే కుట్రగా చేయకూడదని డిమాండ్ చేశారు.ఓటర్లను గుర్తించడం ఆలస్యం వల్ల మరో నెల రోజులు పొడిగించి న్యాయమైన ఏ ఒక్కరి ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండి ఇమ్రాన్, మున్సిపాలిటీ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి, ఉడత రామలింగం, కొండూరి వెంకటేష్, దాసరి అంజయ్య, టంగుటూరు రాములు, రోషణగారి అంజయ్య, రొండి నర్సింహా, బద్దుల సుధాకర్, రొండి నరసింహ, నీళ్ల బిక్షపతి, కాకి పాండు,కుంటి పాపయ్య, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పెన్‌పహాడ్ మండలం మేఘ్య తండ గ్రామ పంచాయితి పరిధిలోని గంగలి తండలో నిర్మిస్తున్న దేవాలయంకు తనవంతు సహకారంగా ఆర్థిక సహాయంను అందజేసి మాట్లాడారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని, దేవాలయాలు సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందించే కేంద్రాలన్నారు. అనంతరం మేఘ్య తండ సర్పంచ్ భూక్య రాజునాయక్ మాట్లాడుతూ దేవాలయ భూమి పూజకు హాజరైన సమయంలో పటేల్ రమేష్ రెడ్డి దేవాలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పి తన మాట నిలబెట్టుకున్నారని ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాలోతు వరలక్ష్మి వెంకన్న, సిద్ధు, శోభన్, మురళి, రమేష్ పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతాం

## హుజూర్‌నగర్, కోదాడలను

### ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకెళ్తాం

### మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల అభివృద్ధి తనకు రాజకీయ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసానికి ఇచ్చే జీవనాంత కృతజ్ఞత అని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు నియోజకవర్గాలను తెలంగాణలోనే అత్యుత్తమ మౌలిక వసతులు, ఆధునిక విద్య, వైద్యం, శాశ్వత సాగునీటి వసతులు కలిగిన ఆదర్శ నియోజకవర్గాలుగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రతిపాదికన పనిచేస్తోందని స్పష్టం చేశారు. రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి రూ.21 కోట్ల వ్యయంతో కోదాడ లో నూతన ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి, హుజూర్‌నగర్ బస్టాండ్ ఆధునికరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. హుజూర్‌నగర్, కోదాడ ప్రజలతో తన బంధం ఎన్నికలతో ఏర్పడింది కాదని, మూడు దశాబ్దాలకు పైగా విశ్వాసం, అప్యాయత, పరస్పర నమ్మకంతో నిర్మితమైన అనుబంధమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆరుసార్లు శాసనసభకు, ఒకసారి లోక్‌సభకు తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి అభివృద్ధినే మార్గంగా ఎంచుకున్నానని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక అని పేర్కొన్న మంత్రి రెడ్లకుంట, ఆర్9, శాంతినగర్ ఎత్తిపోతల పథకాలతో పాటు నాగార్జునసాగర్ ఆయకట్టు మేజర్, మైనర్ కాలువలకు లైనిగ్ పనులు చేపట్టి ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల, 50కోట్లతో జవహర్ నవోదయ పాఠశాల, రూ.26 కోట్లతో సిటి స్కాన్ సౌకర్యంతో కూడిన 100 పడకల ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి, యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు అందించే అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోదాడ పురపాలక సంఘాన్ని ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించామని, రోడ్లు,డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుధ్యం, పట్టణ సుందరీకరణ వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. హుజూర్‌నగర్, కోదాడ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలు మాత్రమే కాదని, ప్రజాస్వామ్య విలువలకు అండగా నిలిచిన రాజకీయ చైతన్యానికి ప్రతీకలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల పవార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగుల నిరసన

**ప్రజాపక్షం/నందికొండ:** టీవీవీపీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగార్జునసాగర్ కమల నెహ్రూ ఏరియా ఆసుపత్రి ఎదుట శనివారం ఉద్యోగులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా తెలంగాణ వైద్య ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి వడపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, టీవీవీపీకి వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించి రీడిప్లాయ్‌మెంట్, ప్రమోషన్లు, రెగ్యులరైజేషన్, రీయింబర్స్‌మెంట్ బిల్లులు,సాధారణ బదిలీలకు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించి కొత్తగా ఏర్పాటు చేసిన ఆసుపత్రులకు అవసరమైన క్యాడర్ నియమిస్తూ పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రిజిస్టర్లను సంబంధిత ఆసుపత్రులకు పంపించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులను ముందుగానే జారీ చేసి వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, డాక్టర్లు చక్రవర్తి, శ్రీకాంత్ రెడ్డి,శ్రీదేవి,నిర్మల,ధనలక్ష్మి, కిషోర్, శ్రావణ్, వేణు,మధు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/డిండి** : కార్మికుల సమస్యల పరిష్కారానికై ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం డిండి పట్టణంలోని ఎలకుర్తి జైపాల్ గార్డెన్‌లో జరిగిన ఏఐటీయూసీ డిండి మండల 8వ మహాసభకు హాజరైన దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని, స్వాతంత్రానికి పూర్వమే కార్మిక చట్టం, ఫ్యాక్టరీల చట్టం, పారిశ్రామిక విధానాల చట్టం, కనీస వేతన చట్టం సాధించుకోవడం జరిగిందన్నారు. నాడు సామ్రాజ్య వాద పెట్టుబడిదారుల చేతుల్లో నలిగిపోయిన కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచి అనేక ఉద్యమాల ద్వారా కార్మిక చట్టాలను హక్కులను సాధించిన ఏకైక సంఘం ఎఐటియుసి అని అన్నారు. రాష్ట్ర ఏర్పడి 12 ఏళ్లు అవుతున్నా నేటికి రాష్ట్రంలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు మారలేదని కనీస వేతనం లేక పిఎఫ్, ఈఎస్ఐ అమలు నోచుకోక శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రభుత్వ హాస్టల్లో వంట కార్మికులు , అవుట్‌సోర్సింగ్, మిషన్ భగీరథ, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఆటో డ్రైవర్స్, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులు, గ్రామ పంచాయతీ, స్కావేజర్లు, కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని కార్మికులపై ప్రభుత్వాలు సవితి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. అనంతరం మండల నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి కనకాచారి, లింగమయ్య, దేవయ్య, జవహర్‌లాల్, హుస్సేన్, వినయ్, వెంకటయ్య, సాయిలు, చెన్నయ్య, భారతి, తిరుపతయ్య, అలివేలు, లాబాను, గంగమ్మ, బాలరాజు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలు పరిష్కరించకుండా పాలకుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : కార్మికుల హక్కుల పరిరక్షణకు శ్రమ చట్టాలు అమలు, కనీస వేతనాల పెంపు కోసం కార్మికుల ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఏఐటీయూసీ నాలుగవ మహాసభల అరుణ పతాకాన్ని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొలగాని సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ మండల మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలు అమలవుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరిచే చర్యలు ఆందోళన కరమని పేర్కొన్నారు. అదేవిధంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఇమ్రాన్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కనీస వేతనాలు, ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ విధానాలను తగ్గించి శాశ్వత ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ సీపీఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, సర్పంచ్ ముత్యాల అంజయ్య, దుబ్బాక సంజీవ, మంచాల సైదులు, పూలమోని గిరి, జనగాం శంకర్, పాలకూర లక్ష్మమ్మ, మంచాల గాలయ్య, లోడే యాదయ్య,మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, ట్రాక్టర్ యూనియన్, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ఐఎన్‌టియుసి నుండి ఎఐటియుసిలో చేరిక..**

సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో జరిగిన ఏఐటీయూసీ మండల మహాసభల సందర్భంగా ఐఎన్టీయూసీ నుండి పూలమాని శంకర్, దుర్గం ప్రభాకర్‌లు ఎఐటియుసి చేస్తున్న ఉద్యమాలకు ఆకర్షితులై చేరుతున్నట్లు ఎఐటియుసి జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో చేరారు.

## ఖరీఫ్ పంటల ప్రణాళికలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున పంటల ప్రణాళికలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జూలై మొదటి రోజుల్లో వర్షపాత ధోరణి సాధారణం కంటే చాలా తక్కువగా నమోదైందన్నారు. కాబట్టి మారుతున్న వర్షపాత పరిస్థితి, సాగునీటి లభ్యతను బట్టి రైతులు విచక్షణతో కూడిన పంట ప్రణాళికను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాకు సాగునీరు అందించే ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో ప్రస్తుత నీటి లభ్యతలో కూడా నీటి నిల్వలకు తగ్గువగా ఉన్నాయని వివరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో 312.05 టిఎంసిల నీటి సామర్థ్యం కాగా 138.21 టిఎంసిల నీరు మాత్రమే ఉందన్నారు. ఎస్ఆర్‌ఎస్‌పి స్టేజ్2లో నిల్వ సామర్థ్యం 24.034 టిఎంసిలు కాగా ప్రస్తుతం 5.70 టిఎంసిలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. మూసి ప్రాజెక్టుకు 3.54 టిఎంసిల సామర్థ్యం కాగా ప్రస్తుతం నిల్వ ఖరీఫ్ సాగునీటి అవసరాలను తీర్చడానికి మాత్రమే సరిపోతుందన్నారు. అక్కడక్కడ కురిసే విడివిడి వర్షాల ఆధారంగా రైతులు విత్తనాలు చల్లడం లేదా నాట్లు వేయడం వంటివి చేయవద్దని సూచించారు. తక్కువ సాగునీరు అవసరమయ్యే స్వల్పకాలిక వరి రకాలైన ఆర్ఎన్ఆర్, హెచ్‌ఎంటి, జెజిఎల్, జైశ్రీరామ్, డబ్ల్యుజిఎల్44, కెఎన్‌ఎమ్1638, కెఎన్‌ఎమ్7715 వంటి రకాలను సాగు చేయాలన్నారు. సాగునీటి లభ్యత అనిశ్చితంగా ఉన్న చోట వరికి బదులుగా పప్పు ధాన్యాలు, తక్కువ నీరు అవసరమయ్యే ఇతర పంటలు లేదా తగిన కూరగాయల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

## ఏసురత్నం మృతికి.. నేతల నివాళులు



**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బావ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంటేపాక ఏసురత్నం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వేముల వీరేశం,మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేతతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు ఏసురత్నం భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పాడెను మోసి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏసురత్నం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జి మంజుల మాధవరెడ్డి,చామల శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందాల ప్రమీల,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్నరాజ్,వివిధ పార్టీల నేతలు, గాదగోని కొండయ్య,లింగాల వెంకన్న,పన్నాల రాఘవరెడ్డి,రాచకొండ వెంకన్న గౌడ్, వంటేపాక వెంకటేశ్వర్లు, వెంకటాద్రి పాల్గొన్నారు.



## 117 కాదు 17 స్థానాలు కూడా గెలువలేరు

### మాజీ రాజ్యసభ సభ్యులు లింగయ్య యాదవ్

**ప్రజాపక్షం/సూర్యాపేట** : కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో 117 కాదు ఉత్త 17 స్థానాలు కూడా గెలవలేరని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ విమర్శించారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన సభలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రులను ముఖ్యమంత్రి విమర్శించడం పట్ల శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఘాటుగా స్పందించారు. ఏదైనా సభ జరిగితే మీరు చేసింది, చేయాల్సింది, ఇచ్చిన హామీలు అమలు చేసినవి, అమలు చేయాల్సినవి చెప్పాలి తప్ప సిఎం స్థాయిని మరచి బజారు వ్యక్తిగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అసలు కానే కానీ డిలిమిటేషన్‌లో 185 స్థానాలు అవుతాయంటూ అందులో తామే 117 గెలుస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీ దొంగ తెలివి తేటలు ప్రజలకు అర్థమయ్యాయని వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో నువ్వు పడుతున్న ఫ్రస్టేషన్ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు పెట్టిన కెసిఆర్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్‌ను ఆన్‌చేసి రైతులకు నీళ్ళు ఇవ్వకుండా ఆంధ్రకు 100 టిఎంసిల నీళ్ళు మలిపావని ఆరోపించారు. బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దేవుళ్ళ మీద ఒట్టు వేయడం పరిపాటిగా మారిందని ఆయన ఒట్టు వేయని దేవుడు ఉన్నాడా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ జడ్‌పిటిసి జీడి బిక్షం పాల్గొన్నారు.

## కామ్రేడ్ ఉజ్జిని యాదమ్మ మృతి బాధాకరం



**ప్రజాపక్షం/డిండి:** సిపిఐ గొనకోల్ గ్రామ శాఖ సహాయ కార్యదర్శి ఉజ్జిని యాదమ్మ మృతి బాధాకరం అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం గోనకోల్ గ్రామంలో యాదమ్మ పార్థివ దేహంపై సిపిఐ ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, డిండి మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి శైలేష్, గ్రామశాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ డిండి మండల కార్యదర్శి బబ్లు, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్ కుమార్ పాల్గొన్నారు.

## ఆగని అక్రమ ఇసుక దందా...

### అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో ఇసుక తరలిస్తే చర్యలు

**ప్రజాపక్షం/డిండి:** అక్రమ సంపాదన కోసం రాత్రి వేళల్లో ట్రాక్టర్ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే ఒక్కో ట్రాక్టర్ ఇసుక 5వేల నుండి 6వేల వరకు అక్రమ సంపాదన కోసం అటు ప్రజలను మోసం చేస్తూ మరో వైపు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ఎలాంటి అనుమతులు అక్కరలేకుండా దుందుబీ వాగు నుండి రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న గోనబోయినపల్లికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు డిండి ఎస్ఐ బాలకృష్ణ శనివారం తెలిపారు. మరోవైపు మండలంలోని కందుకూరు వాగు నుండి చెక్ డ్యాం పేరుతో శనివారం ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండల ప్రజలందరూ అవసరాల మేరకు ఇసుకను ప్రభుత్వం ఏర్పాటు చేసిన మన ఇసుక వాహనం యాప్‌లో మాత్రమే బుక్ చేసుకొని తక్కువ ధరకు మాత్రమే ఇసుక పొందాలన్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలుంటాయని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

## పిఆర్‌టియు సభ్యత్వ నమోదు

**ప్రజాపక్షం/మునగాల:** ఉపాధ్యాయల సమస్యల పరిష్కారం ఒక్క పిఆర్‌టియు యూనియన్‌తోనే సాధ్యమవుతుందని పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల నరేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మద్యాహ్న భోజన విరామ సమయంలో పిఆర్‌టియు సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్‌టియు మండల అధ్యక్షులు అడిదల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల మధుబాబు ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు నాయకులు పప్పుల వీరబాబు, కె.వీరబాబు, ఓరుగంటి రవి, కొల్లు వెంకటేశ్వరరావు, ఊటుకూరి రవీందర్‌రెడ్డి, బజ్జూరి శ్రీకాంత్‌రెడ్డి, సతీష్, శ్రీరామ్ శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, శంకర్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు రామకృష్ణ, బిఎస్‌గౌడ్, జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ నుంచి హౌరా వరకు కొత్త రైలు



ప్రజాపక్షం / కాగజ్ నగర్ : సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హౌరా జంక్షన్ వరకు కొత్త రైలు నడపాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఆదివారం హైదరాబాద్ విచ్చేసిన కేంద్ర మంత్రిని నోవోటెల్ హోటల్‌లో ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త రైలు ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న బెంగాలీ ప్రజలు కలకత్తా చేరుకోవడం సులభం అవుతుందని వివరించారు. సికింద్రాబాద్ నుంచి నాగపూర్ నడిచే వందే భారత్ రైలులో అదనంగా బోగీలను పెంచాలని, సిర్పూర్ టౌన్ రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను నిలపాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి తగిన ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం బాటిల్ కలకలం



ప్రజాపక్షం / వాంకిడి: ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే ప్రభుత్వ ఆ సుపత్రి ప్రాంగణంలో మద్యం బాటిల్ కనిపించడం స్థానికంగా తీవ్ర చ ర్చకు దారితీసింది. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల ప్ర భుత్వ ఆసుపత్రి ఆవరణలో డీకే బ్రాండ్‌కు చెందిన ఖాళీ మద్యం బాటిల్ దర్శనమివ్వడం రోగులు, వారి కుటుంబ సభ్యులను ఆశ్చర్యానికి గురిచేసింది. నిత్యం వందలాది మంది రోగులు వచ్చే ఈ ఆసుపత్రిలో ఇలాంటి వస్తువులు కనిపించడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆసుపత్రి వైద్యుడు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు ఆ రోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రిలో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలతో తమ దృష్టికి వస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## భీమ్‌గల్‌లో 'ఊర పండుగ'కు సర్వం సిద్ధం




ప్రజాపక్షం/భీమ్‌గల్: పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న సాంప్రదాయ ఊర పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సర్వసమాజ్ కమిటీ అధ్యక్షులు పతాని కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సర్వసమాజ కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కృష్ణ మాట్లాడారు. పండగను ఘనంగా నిర్వహించేందుకు సర్వసమాజ్ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం దేవత విగ్రహాలకు కావల్సిన చెట్లు కొట్టడం కార్యక్రమం మొదలవుతుందన్నారు. అనంతరం విగ్రహాల తయారీకి కావల్సిన చెక్కల ఊరేగింపు ఉంటుందన్నారు. భూలక్ష్మీ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం సాంప్రదాయంగా గొర్రెపోతు గావు పట్టడం కార్యక్రమం నిర్వహించి రాత్రి 10 గంటలకు మైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక ముగింపు పూజలతో ఊర పండగ ముగుస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రఘు ,కార్యదర్శిరాజేశ్వర్, క్యాషియర్ భూమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాపక్షం/నేరడిగొండ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు భారీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు వారిని నమ్మించి మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా నాయకులు మజర్ మండిపడ్డారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. మొదటి క్యాబినేట్‌లోనే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి యువత గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండున్నరేళ్లలో దాదాపు 20 నుంచి 25 క్యాబినెట్ సమావేశాలు జరిగాయని, మరి ఇన్ని సమావేశాల్లో నిరుద్యోగ యువత గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జాబ్ క్యాలెండర్ ప్రకటించి, నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై అవగాహన



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ పట్టణంలోని 1వ వార్డు, 27 వార్డుల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, ఎమ్మార్వో లక్ష్మ ణ్ బాబు తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో ఓటర్లుకు అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు సకాలంలో చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వివరాలను సరిచూసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు బొజ్జ పవన్, భూపతిరాజ్, బాల్ రాజ్, సురేష్, గణేష్, లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

## బైంసా మండలంలో ఎఐకెఎంఎస్ జిల్లా మహాసభ

ప్రజాపక్షం/బైంసా : బైంసా మండలం హంపోలి కె గ్రామంలో రేపు జరిగే మహాసభను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె రాజు రైతు కూలీలకు పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని,వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోతూ రైతాంగ ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు కార్పొరేట్ అనుకూలంగా ఉన్నాయని వీటిని ఎదుర్కోవడానికి రైతు కూలీ ఉద్యమాన్ని బలోపేతం చేయవలసి ఉందని దీనికై జరిగే ఉమ్మడి జిల్లా మహాసభలో అధిక సంఖ్యలో రైతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## నాణ్యమైన సాంకేతిక విద్య, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



ప్రజాపక్షం/ సంగారెడ్డి : ఇంజనీరింగ్ ,ఫార్మా స్యూటికల్ సైన్సెస్ విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసి కళాశాల బస్సులతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన పిఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ అండ్ సీమ్యులేషన్ ల్యాబోరేటరీ స్మార్ట్ కంప్యూటింగ్ ల్యాబోరేటరీ ,కంప్యూటరీ అప్లికేషన్ ,ఇన్ ఫార్మసీ ల్యాబోరేటరీలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దా మోదర రాజనర్సింహ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఆర్ పాండు జెఎన్‌టియుహెచ్ అధికారులు ,అధ్యాపకులు ,విద్యార్థులు ప్రజాపతినిధులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదరరాజనర్సిం హ మాట్లాడుతూ నాణ్యమైన సాంకేతిక విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పనకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలను మరింత పెంచుతాయని తెలిపారు. తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా రెండు కళాశాలకు బస్సులను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ బస్సుల ద్వారా విద్యార్థులకు సురక్షితమైన సౌకర్యవంతమైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. కొత్తగా ప్రారంభించిన ప్రయోగశాలల్లో సెమీ కండక్టర్ టెక్నాలజీ పిఎల్ ఎస్ఐ డిజైన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ డేటా సైన్స్ క్లోడ్ కంప్యూటింగ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పరిశోధన ఆవిష్కరణలు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధికి ఈ ప్రయోగశాలలు దోహదపడతాయిని పేర్కొన్నారు. అనంతరం సుల్తాన్ పూర్ క్యాంపస్‌లో ప్రతిపాదిత క్లాక్ టవర్ నిర్మాణ స్థలాన్ని మంత్రి పరిశీలించి నిర్మాణ రూపకల్పన వ్యయ అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. క్లాక్ టవర్ విద్యార్థుల్లో సమయపాలన క్రమ శిక్షణకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. అలాగే జెఎన్‌టియుహెచ్ యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అందోల్ క్యాంపస్ నిర్మానానికి 57 కోట్లు మంజూరైనట్లు వెల్లడించిన మంత్రి భవనాల నిర్మాణానికి సంబందించిన స్ట్రక్చరల్ డిజైన్ ను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం పరిశ్రమ విద్యాసంస్థల భాగస్వామ్యంతోనే ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, ఆవిష్కరణలు నైపుణ్యాలను విద్యార్థులను తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుహెచ్‌డైరెక్టర్ డా.ఎదామోదరం, చీఫ్ ఇంజనీర్ డా .ఎస్ శ్రీనివాసులు, జెఎన్‌టియుహెచ్ యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా.సునీతా రెడ్డి, యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డా.ఎస్ విశ్వనాథ్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డా. వై రాఘవేందర్‌రావు ,విభాగాధిపతులు, అధ్యాపకులు ,విద్యార్థులు తోషిబా సంస్థ ప్రతినిధులు, పాల్గొన్నారు.

## జిల్లాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం /ఆసిఫాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లో 20 లక్షల రూపాయల చొప్పున నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించామని, వీటి ద్వారా ప్రజలకు మెరుగైన పరిపాలన అందుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలు పారదర్శక సేవలు అందించాలని ఆదేశించారు. కెరమెరి మండలం ధనోరాలో 10 లక్షల రూపాయలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించిన ఆయన, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం అనేక స్వయం ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. కెరమెరి మండలం సుర్దాపూర్ పోడు రైతుల భూ సమస్యపై మంత్రి స్పందిస్తూ 2005కు ముందు నుంచి సాగు చేస్తున్న పాత పోడు భూముల విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు సూచించారు. కొత్తగా అటవీ భూములను ఆక్రమించవద్దని, గిరిజనేతర రైతుల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించి చట్టపరమైన న్యాయమైన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థానాల్లో నిలబెట్టడం తల్లిదండ్రుల బాధ్యతని, విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని హితవు పలికారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యల సాధనే లక్ష్యంగా ఎఐటియుసి పోరాటాలు

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం * 17 అనుబంధ సంఘాలు గల ఏకైక సంఘం * 22న నిజామాబాద్ జిల్లాలో మహాసభ



ప్రజాపక్షం/నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా పోరాటాల ఖిల్లా స్వాతంత్ర్య ఉద్యమం తెలంగాణ సాయుధ పోరాటంలో తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక భూమికను పోషించింది నిజామాబాద్ జిల్లాలో సిపిఐ పార్టీ అనుబంధంగా ఎఐటియుసి ఎన్నో పోరాటాలు సాగించింది. కార్మికులకు బాసటగా నిలిచింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేస్తున్న పోరాటాలు ఒకపక్క, జిల్లావ్యాప్తంగా కార్మిక సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు చేస్తూనే ఉంది. అణగారిన వర్గాల కార్మికుల కోసం కార్మికుల హక్కుల కోసం ఇళ్ల స్థలాల కోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. జిల్లాలో 17 అనుబంధ సంఘాలు ఏర్పాటు చేసి కార్మిక సంఘాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతుంది. ఏ ఒక్క కార్మికుడికి అన్యాయం జరిగిన అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం ముందుండటం విశేషం. తెలంగాణలో ఎఐటియుసి నిజామాబాద్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కార్మికులను దొంగలుగా చిత్రీకరించి అబండాలు వేసిన తరుణంలో 1500 మంది కార్మికులతో జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద చేసిన నిరసన జ్వాల కార్యక్రమం రాష్ట్రస్థాయిలో ఎఐటియుసికి మరింత గుర్తింపునిచ్చింది. నిరసన తెలిపిన 8 మందిపై కేసులు వేసి 40 రోజులు జైలుకు పంపితే, మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేసి వారికి క్షమాపణలు చెప్పించిన ఘనత ఎఐటియుసికే దక్కింది. మున్సిపల్ కార్పోరేషన్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏడుగురు సభ్యులతో గ్రూప్ చేయాలని అధికారులు జీతాలు నిలిపివేసి ఆదేశాలు జారీ చేస్తే ఎఐటియుసి వామపక్ష సంఘాలతో కలిసి భారీ ధర్నాను నిర్వహించి కార్మిక సంఘాల సత్తా చాటడం జరిగింది. అనంతరం ఏడుగురు సభ్యులు కాకుండా 15 మంది సభ్యులకు పెంచుతూ గ్రూప్ చేయటం విశేషం. కార్మికులకు నిలిపివేసిన జీతాలను సైతం ప్రతినెల ఇప్పించి ఔరా అనిపించారు. రైస్‌మిల్ ఫిట్టర్స్ యూనియన్ జిల్లా కేంద్రంలో 200 గజాల స్థలంలో నిర్మించుకోవటం జరిగింది. మెదలక్ కాంట్రాక్ట్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి మెడికల్ కళాశాలలో పని చేస్తున్న కార్మిక స్థానిక సమస్యలపై పోరాటాలు చేసి విజయాలు సాధించింది. మార్కెట్ యార్డు హమాలీ యూనియన్ ద్వారా బస్తా రేట్లను పెంచుకోవటం 55 సంవత్సరాలు నిండిన హమాలీలకు 65 సంవత్సరాల వరకు లైసెన్స్‌లు పునరుద్ధరించాలని, పది లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, హమాలీలకు నాల్గవ తరగతి ఉద్యోగులకు డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, హమాలీ, వెల్ఫేర బోర్డును సాధించుకోవడానికి పోరాటాలు, మధ్యాహ్న భోజన ప థకం వర్కర్లకు గతంలో రూ.1000లు మాత్రమే గౌరవ వేతనముండగా రెండు వేలకు పెంచి ప్రతి కార్మికుడికి 3 000లు ఇప్పించటంజరిగింది. కిషన్‌గంజ్ హమాలీ యూనియన్ పోరాట ఫలితంగా ఆదివారం సెలవును సాధించారు. 2024 జెంటిమాసంలో సిఐటియు నుంచి కా॥ చక్రపాణి నాయకత్వంలో 23 మండలాల నుంచి కార్మికులు ఎఐటి సులువు చేరడం విశేషం. ఇలా ఎఐటియుసి అనుబంధ సంఘాల సమస్యల పరిష్కారం కోసం పోరాడి ఎన్నో విజయాలు సాధించటం జరిగింది.

**మహాసభలకు రానున్న ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు**

22వ జిల్లా మహాసభలు జూలై 12, 13లలో పి నర్సింగ్ రావు ప్రాంగణం, యు అంబేద్కర్ భవన్ నిజామాబాద్ లో అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు కనీస వేతనాలు బోర్డు మెంబర్ ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి,రైతు సంఘం ఉపాధ్యక్షులు కంజర భూమయ్య హాజరు కానున్నారు.

**గ్రామ గ్రామాన ఎఐటియుసిని విస్తరిస్తాం: జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య**

గ్రామగ్రామాన ఎఐటియుసి జెండా ఎగురవేస్తాం. జిల్లాలో కార్మిక వర్గాల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసి, విజయాలు సాధించాం. 17 అనుబంధ సంఘాలుగా విస్తరించాం. 17 సంఘాలలో 10 ప్రత్యేక ఎఐటియుసి ఏకై సంఘాలు ఏర్పాటు చేయటం జిల్లాలో గర్వకారణం. పోలీసు కేసులకు భయపడకుండా కార్మిక సంక్షేమాన్ని ఆకాంక్షించి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నాం. సమస్యల పరిష్కారం కోసం ముందడుగు వేయటమే ఎఐటియుసి లక్ష్యం. కార్మికులు పాల్గొని 22వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

## రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెరుగైన విద్య


ఎమ్మెల్యే పవార్



ప్రజాపక్షం/బైంసా : ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు, సౌకర్యాలను కల్పించాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు.బైంసాలోని తన నివాసంలో కస్తూరిబా, సోషల్ వెల్ఫేర్, మైనార్టీ, ఆదర్శ పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపల్‌లచే సమీక్ష సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సందర్భంగా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, మంచి పౌష్టికాహారాన్ని అందించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రాజు మాట్లాడుతూ తమ పాఠశాలకు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సందర్శించి, 45 లక్షల రూపాయల నిధులను వెచ్చించి, పనులు పూర్తి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. శాసనసభ్యుడు రామరావ్ పటేల్ విద్యా రంగంపై దృష్టి సారించడం పట్ల కృతజ్ఞతలు చెప్పారు.సమావేశంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపల్‌లు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై దృష్టి


బిఎల్ఒలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు సేకరించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/ నిర్మల్,లక్ష్మ ణ్ చందా : ఓటరు జాబితా ప్రత్యేక సవరణప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన సోన్, లక్ష్మ ణచందా మండలాల్లో పర్యటించి, జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని,అర్హులైన ప్రతి ఒక్కరి పే రు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు బాధ్యతాయుతం గా పనిచేయాలనిసూచించారు.క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అ ధికారులు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణకు సంబంధించిన ఫారమ్‌లను సేకరించి రోజువారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని సూచించారు.అనంతర ం లక్ష్మ ణచందా మండలం పార్‌పల్లి గ్రా మంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా సూపర్ వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని, తప్పులు లే ని జాబితా రూపకల్పనకు కృషి చేయాల ని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.ఈ పర్యటనలో తహసిల్దార్లు సంతోష్,సరిత,స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీపై వివక్షాస్త్రం!

నిర్మల్ జిల్లాలో 2.37 లక్షల మంది గ్రామీణ పేదల బతుకులు ఛిన్నాభిన్నం




ప్రజాపక్షం/నిర్మల్ : గ్రామీణ పేదల కష్టార్జితంపై కేంద్ర ప్ర భుత్వం మరోసారి తన వివక్షను చాటుకుంది. వికసిత్ భారత్ అంటూ ఆర్భాటపు ప్రచారాలు చేసుకుంటున్న పాలకులు, క్షేత్రస్థాయిలో రెక్కాడితే గానీ డొక్కాడని ఉపాధి హామీ కూలీల పొట్ట కొట్టారు. కొత్తగా తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ చట్టం (విబి–జి–రామ్‌జి ఆక్ట్) ద్వారా పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచుతున్నట్లు ప్రకటించి పెద్ద ఎత్తున హడావుడి చేసిన కేంద్రం.. వేతనాల పెంపు విషయానికి వచ్చేసరికి దారుణమైన మొండిచేయి చూపించింది. మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, కూలీల జీవన వ్యయం భారంగా మారుతుంటే.. తెలంగాణ కూలీలకు గత ఏడాది ఉన్న రూ.307 వేతనానికి కేవలం ఒక్కటంటే ఒక్క రూపాయి మాత్రమే పెంచి రూ.308గా ఖరారు చేయడం పట్ల సర్వత్రా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

**లక్షలాది జనం నోట్లో మట్టి కొట్టిన నిర్ణయం..!**

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) గణాంకాలే కేంద్రం చేసిన అన్యాయ తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో 1.32 లక్షల యాక్టివ్ జాబ్ కార్డులు ఉండగా, నిత్యం చెరువుల పూడికతీత, మట్టి పనులు, కాలువల నిర్మాణాలపై ఆధారపడి బతుకుతున్న 2.37 లక్షల మంది యాక్టివ్ కూలీల ఆశలపై ఈ నిర్ణయం పిడుగులా పడింది. సమాజంలో అత్యంత వెనుకబడిన 3,196 మంది దివ్యాంగ కూలీల నోటి కాడి కూడును సైతం ఈ అరకొర వేతనం దూరం చేస్తోంది. రోజుకు రూ.308తో ఈ రోజుల్లో ఒక కుటుంబం మూడు పూటలా తిండి తినడం సాధ్యమేనా అని పాలకపక్షాన్ని కార్మిక నేతలు నిలదీస్తున్నారు.పెంచిన పనిదినాల వల్ల గరిష్టంగా రూ.37 ,500 ఆదాయం వస్తుందని కాగితాల్లో లెక్కలు చూపిస్తున్న అ ధికారులు, వాస్తవ పరిస్థితులను విస్మరిస్తున్నారు. శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కనప్పుడు ఎన్ని రోజులు పని కల్పిస్తే ఏం లాభమని కూలీలు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండివైఖరిని వీడి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ దినసరి వేతనాన్ని కనీసం రూ.400కు పెంచాలని, లేనిపక్షంలో గ్రామీణ పేదల ఆగ్రహానికి గురికాక తప్పదని కార్మిక సంఘాలు గట్టిగా హెచ్చరిస్తున్నాయి.

## పైకి మినరల్.. లోపల 'జనరల్'!



ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో మినరల్ వాటర్ పేరుతో సాగుతున్న వ్యాపారం ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా పరిణమిస్తోంది. పైకి మినరల్ వాటర్ అని చెబుతూనే.. లోపల మాత్రం సాధారణ నీటిని సరఫరా చేస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్యూర్ మినరల్ వాటర్, ఆర్వో వాటర్ అనే లేబుళ్లు అంటించి విక్రయిస్తున్న నీటిలో వాస్తవానికి శుద్ధి ప్రమాణాలు పాటిస్తున్నారా.. లేదా..అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. చాలా చోట్ల మినరల్ వాటర్ పేరుతో సాధారణ బోరు నీటిని స్వల్పంగా శుద్ధి చేసి క్యాన్లలో నింపి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

**విచ్చలవిడిగా ప్లాంట్లు.. లోపించిన అనుమతులు :** నిర్మల్ పట్టణంలో సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో ఇలాంటి వాటర్ ప్లాంట్లు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పలు కాలనీలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పదుల సంఖ్యలో వాటర్ ప్లాంట్లు ఏర్పడి ప్రతిరోజు వందలాది 20 లీటర్ల క్యాన్లను ఇళ్లకు, హోటళ్లకు, దుకాణాలకు సరఫరా చేస్తున్నాయి. అయితే వీటిలో చాలా ప్లాంట్లకు అవసరమైన అనుమతులు, నాణ్యత ధ్రువపత్రాలు లేవనే విమర్శలు ఉన్నాయి. కొన్ని ప్లాంట్లలో ఫిల్టర్లు, యూవీ, ఆర్వో యంత్రాలను సకాలంలో మార్చకపోవడంతో నీటి నాణ్యత దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు.

**నిబంధనలు అమలు ఎక్కడ..?** ఆహార భద్రత, కాలుష్య నియంత్రణ, మున్సిపల్,గ్రామపంచాయతీ తదితర శాఖల అనుమతులు తప్పనిసరి అయినప్పటికీ చాలా ప్లాంట్లు ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా నడుస్తున్నాయి. పరిశుభ్రత పాటించకపోతే ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటం..** శుద్ధి చేయని లేదా నాణ్యత లేని నీటిని తాగడం వల్ల వైరల్ జ్వరాలు, విరేచనాలు, టైఫాయిడ్, జీర్ణాశయ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎక్కువ శాతం కలుషిత నీరు వల్లే వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

"వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూనిక్ హారర్-కామెడీ 'కొరియన్ కనకరాజు'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్-ప్రొడక్షన్ చివరి దశలో ఉంది."

రీల్

## ఆగస్టు 7న 'కొరియన్ కనకరాజు'



వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూనిక్ హారర్-కామెడీ 'కొరియన్ కనకరాజు'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్-ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'కసంరంగా' కూడా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది.చిత్ర నిర్మాతలు ఆగస్టు 7వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ విడుదల తేదీగా అధికారికంగా ఖరారు చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్ ఆటిట్యూడ్, ఇంటెన్స్‌ని ప్రజెంట్ చేస్తోంది. వరుణ్ తేజ్ ఒక చేతిలో రక్తం మరకలున్న కత్తి, మరో చేతిలో గ్రెనేడ్‌లతో కుర్చీలో హుందాగా కూర్చుని, రఫ్ అండ్ అల్ట్రా స్టైలిష్ అవతార్లో కనిపిస్తున్నారు. భయపెట్టే కొరియన్ గ్యాంగ్‌స్టర్ గ్యాంగ్ చుట్టుముట్టి ఉన్నప్పటికీ, అతను ఏమాత్రం బెదరనట్లు కనిపించారు. కళ్లు చెదిరే నియాన్ లైటింగ్ బ్యాక్ డ్రాప్, గ్యాంగ్‌స్టర్ నేపథ్యం మరింత ఆసక్తిని పెంచింది. రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, కమెడియన్ సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. మనోజ్ రెడ్డి కటసాని డీవోపీగా పని చేస్తున్నారు. చిత్రానికి సంగీతం: ఎస్ థమన్, డిఓపి : మనోజ్ రెడ్డి కటసాని.



## 'ఓ.. సుకుమారి' హిలేరియస్ ట్రైలర్ రిలీజ్

తిరు వీర్, ఐశ్వర్య రాజేష్ కలిసి నటిస్తున్న ఈ చిత్రం 'ఓ.. సుకుమారి' ఇప్పుడు. రొమాన్స్, కామెడీ, పల్లెటూరి అందాలతో కంప్లీట్ వినోదభరితంగా నిర్మిస్తున్నారు. భరత్ దర్శన్ రచన, దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని, 'శివం భాజే' విజయం తర్వాత గంగా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. అనిల్ రావి పూడి ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ చేశారు. దామిని గురించి ఊరంతా భయపడుతూ ఉంటుంది. కారణం ఏమిటంటే... ఆమెను ఎవరైనా తాకితే వారికి కరెంట్ షాక్ తగులుతుంది. ఈ విచిత్రమైన రహస్యాన్ని దాచిపెట్టి ఆమెను హీరోతో పెళ్లి చేస్తారు. పెళ్లి తర్వాత అసలు విషయం తెలిసిన హీరో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడు? ఈ సమస్యను భార్యాభర్తలు కలిసి ఎలా ఎదుర్కొన్నారు? చివరకు వారి జీవితంలో ప్రేమ, ఆనందం ఎలా చోటుచేసుకున్నాయి? అన్నదే సినిమా ప్రధాన కథాంశం. దర్శకుడు భరత్ దర్శన్ ఈ విభిన్నమైన కాన్సెప్ట్‌ను వినోదాత్మకంగా చూపిస్తూ, ఎమోషన్స్‌ను చక్కగా మేళవించినట్లు ట్రైలర్ ప్రెజెంట్ చేస్తోంది.తిరు వీర్ మరోసారి కొత్త తరహా కథను ఎంచుకుని, అమాయకమైన పల్లెటూరి యువకుడి పాత్రలో సహజంగా కనిపించారు. ఐశ్వర్య రాజేశ్ కూడా తన పాత్రలో ఆకట్టుకునేలా కనిపించారు. అందం, నటన రెండింటితో అలరించారు. మురళీధర్ గౌడ్, విష్ణు ఓయ్, రూపన్, ఆమని, ఆనంద్, జయరామ్ తదితరులు తమ పాత్రలతో వినోదాన్ని మరింత పెంచారు.సినిమాటోగ్రాఫర్ సిహెచ్ , భరత్ మంచిరాజు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, 'బలగం' ఫేమ్ తిరుమల ఎం. తిరుపతి ప్రొడక్షన్ డిజైనర్గా పని చేయగా, శ్రీ వరప్రసాద్ ఎడిటింగ్ నిర్వహించారు. అను రెడ్డి అక్కటి కాస్ట్యూమ్స్ డిజైన్ చేయగా, పూర్ణాచారి పాటలకు సాహిత్యం అందించారు.'ఓ.. సుకుమారి' ట్రైలర్ కామెడీ, ప్రేమ, భావోద్వేగాలను కలిపిన వినోదాత్మక ఫ్యామిలీ ఎంటర్టైనర్గా సినిమాపై అంచనాలను పెంచింది. ఈ చిత్రం 17న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆర్ట్ డైరెక్టర్: తిరుమల ఎం తిరుపతి, ఎడిటర్: శ్రీ వరప్రసాద్, కాస్ట్యూమ్ డిజైనర్: అను రెడ్డి , లిరిక్ రైటర్: పూర్ణాచారి, ఫైట్స్: అంజి, కొరియోగ్రఫీ: జెడి మాస్టర్.

# ఆ తప్పు ఇప్పుడు చెయ్యను : నటనకే నా ప్రియారిటీ

### రోల్స్ అన్నీ నా ఇష్ట ప్రకారమే ఎంపిక 'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో హీరోయిన్ ఎస్తర్ నోరోన్హా



దర్శకుడు తేజ తెరకెక్కించిన చిత్రం 'వెయ్యి అబద్ధాలు'. ఈ చిత్రం ద్వారా తెలు తెరకు పరిచయమైన హీరోయిన్ ఎస్తర్ నూరోన్హా. సెలెక్టివ్ గా తనకు నచ్చిన పాత్రలను మాత్రమే సెలక్ట్ చేసుకుని దూసుకెళ్తున్న ఎస్తర్ ముక్కు సూటిగా మాట్లాడుతుంది. ఉన్నది ఉన్నట్టు కుండా బద్దలు కొట్టి మరీ చెప్తుంది. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, కొంకణి భాషల్లో సినిమాలు చేసిన ఎస్తర్ మంచి గాయని కూడా. నటి, గాయని, డ్యాన్సర్ ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎస్తర్ ను అభివర్ణించడం అతిశయోక్తి కాదు. తద్దైనా శైలి లో సినిమాలు చేస్తున్న ఎస్తర్ ఇటీవల హైదరాబాద్ కు వచ్చిన నేపథ్యంలో ప్రజాపక్షం పలకరించింది. చక్కగా తెలుగులో మాట్లాడే ఎస్తర్ చాలా విషయాలు ప్రజాపక్షంతో పంచుకున్నారు.

**ప్రశ్న : మీ చిన్నతనంలోని విషయాలు గుర్తున్నాయా ?**

**ఎస్తర్ :** నేను పుట్టి పెరిగింది గోవా. నేనంటే మా ఇంట్లో చాలా ఇష్టం. నేను అందరితో కలసి ఉండేదాన్ని కాదు. ఫ్యామిలీ ఫంక్షన్ కు వెళ్లినా కూడా నేను ఎక్కువగా పిల్లలతో కలిసేదాన్ని కాదు.నేను చిన్నప్పుడు ఆటో కూడా ఎక్కలేదు. బస్సు కూడా ఎక్కలేదు. ఎక్కడికి వెళ్లినా కారులోనే, దగ్గర అయితే నడిచి వెళ్లేదాన్ని కానీ ఏ రోజూ ఆటో బస్సు ఎక్కలేదు.

**ప్రశ్న : మల్టీ టాలెంటెడ్ కదా మీరు .... దేనికి ప్రాధాన్యత ఇస్తారు ?**

**ఎస్తర్ :** గోవాలో నేను సింగర్ ను. తెలుగులో యాక్టర్‌ను . సింగింగ్ , యాక్టింగ్, డ్యాన్సింగ్ ఇలా అన్ని చెయ్యగలను. కాకపోతే అనుకోకుండా వచ్చిన ఛాన్స్ యాక్టింగ్. గోవాలో నను స్టేజిమీద పిలిచినపుడు తెలుగులో నటిగా పిలుస్తుంటే చాలా గర్వాంగా ఉంటుంది. అయితే నేను యాక్టింగ్ మీదనే ఫోకస్ చేస్తున్నాను. ఎందుకంటే చాలా భాషల్లో నటిగా ఎస్టాబ్లిష్ అయ్యాను. తెలుగు ప్రేక్షకులు ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. చాలా సినిమాలు చేస్తున్నాను కాబట్టి నేను ఖచ్చితంగా యాక్టింగ్ కే ప్రాధాన్యత ఇస్తాను. ఖచ్చితంగా సినిమాలు చేస్తూనే ఉంటాను.

**ప్రశ్న : సంస్కార్ కాలనీ , ఎల్‌జిబిటి లాంటి సినిమాలు ఒక రకమైన బ్రాండ్ మీ మీద పడుతుంది కదా ?**

లేదండి ...ఎవరు ఏం అనుకుంటారో అనేది నేను పెద్దగా పట్టించుకోను. సంస్కార్ కాలనీ , ఎల్‌జిబిటి సినిమాల్లో రోల్స్ వచ్చినప్పుడు డైరెక్టర్ సునీల్ రెడ్డి గారు నను అడిగారు. నువ్వు ఈ రోల్స్ కు ఒప్పుకోకపోతే నేను వేరే వాళ్ళను చూసుకుంటా కానీ ఫస్ట్ ప్రియార్టీ మీకే అని చెప్పి కథ నాకు చెప్పినప్పుడు నేనే ఈ రోల్స్ ఒప్పుకున్నాను. ఇక మాట్లాడేవారు రకరకాలుగా మాట్లాడుతూనే ఉంటారు . కాబట్టి నేను రూమర్స్ గురించి నేను పెద్దగా పట్టించుకోను. మంచి , చెడు రెండు మనలోనే ఉంటాయి.

**ప్రశ్న : తెలుగు చాలా బాగా మాట్లాడుతున్నారు...నేర్చుకున్నారా?**

**ఎస్తర్ :** అవునండి... తెలుగు నేర్చుకున్నాను. నాకు ఇక్కడే ప్రేమ లభించింది. ఇక్కడే నాకు స్టార్ డం వచ్చింది. కాబట్టి నేను ఏ భాషలో పని చేస్తున్నానో ఆ బాషా నేర్చుకోవాలనేది నా ఆశయం. అందుకే నేర్చుకున్న. భాషా నేర్చుకుంటే నాకే మంచిది కదా. యాక్టింగ్ ఛాన్స్ అనుకోకుండా వచ్చింది కాబట్టి యాక్టింగ్ ను సీరియస్ గా తీసుకున్నాదు. అందుకే బాషా నేర్చుకున్నాను. మాట్లాడుతున్నాను. తెలుగు బాషా మాట్లాడితే ఖచ్చితంగా ప్రతి అక్షరం అర్థం తెలుస్తుంది కదా. ఇక్కడ ఉప్పు తిని, ఇక్కడ సంపాదించి తెలుగు కొంచెం కొంచెం వచ్చు అని యాక్టింగ్ చేస్తూ మాట్లాడే వాళ్ళను మీరు ఎంతో మందిని చూసి ఉంటారు.

**ప్రశ్న : మీకు తెలుగు సినిమాల్లో రావలసినంత గుర్తింపు రావడం లేదని భావిస్తున్నారా ?**

**ఎస్తర్ :** నేను సోషల్ సైన్సెస్, సైకాలజీ చదివాను. కాబట్టి ఈ విషయాన్ని నేను పెద్దగా ఫీలింగ్ లేదు. ఎందుకంటే నేను నిజాయితీగా ఉంటాను. నిజాయితీకి ప్రాధాన్యత ఇస్తాను. నాకు రావలసినంత గుర్తింపు ఎందుకు రాలేదు...మీరందరునన్ను గుర్తిస్తున్నారుకదా. మీరందరు ఇంటర్వ్యూ తీసుకుంటున్నారు. మీతో నేను మాట్లాడుతున్న అంటే నాకు గుర్తింపు మీరు ఇస్తున్నట కదా . కాకపోతే మన దగ్గర జెన్యూనిటీని తక్కువగా చూస్తాం. వీడు జెన్యూన్ గా ఉన్నాడు అంటే అతనితోనే ఏదో ప్రాబ్లమ్ ఉంది అనే సమాజం మనది.

**ప్రశ్న : 'యస్'' చెప్పకపోతే సినిమా ఛాన్స్ రావు అంటారు ? నిజమేనా?**

**ఎస్తర్ :** ఇది తప్పు... అందరి విషయంలో ఇది జరగకపోవచ్చు. నాకు కూడా ఎప్పుడు అనుభవం కాలేదు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే నేను సినిమాలు వదులుకుంటాను తప్ప యస్ అని చెప్పే ప్రసక్తే లేదు. ఇది కాకపోతే దేవుడు నాకు ఇంకో దారి చూపిస్తాడు. నేను ఇదే నమ్మి పని చేస్తాను .

**ప్రశ్న : రెండో పెళ్లి ఎప్పుడు చేసుకుంటున్నారు ?**

**ఎస్తర్ :** గతంలో నేను ఒక తప్పు చేశాను ...ఇప్పుడు కూడా అలాంటి తప్పు చెయ్యదలచుకోలేదు. ఇంకో రెండేళ్లలో చేసుకోవాలని ఆలోచిస్తున్నాను. తగిన వాడు దొరికితే చూద్దాం. నేను చదువుకునేతప్పుడు కొంతమంది నా ఫ్రెండ్స్ కు లవ్ అఫైర్స్ ఉండేది. ఆ గిఫ్ట్ ఇచ్చాడని, ఈ గిఫ్ట్ ఇచ్చాడని చెప్పేవారు. అయితే వీళ్లకు ఇదే పనా? అనుకునే దాన్ని. నాకు ఇరవై రెండేళ్లు ఉన్నప్పుడు ఎవరైనా దొరక్కపోతారా అని చూశాను. దొరికారు కానీ వాళ్ళ బిహేవియర్ నచ్చక నేను లవ్ కు దూరంగా ఉన్నాను. ఇరవై నాలుగు ఏళ్ళు వచ్చినప్పుడు నాకు ఇంకా ఎవరూ దొరకడం లేదు అని అనుకున్నారు. బహుశా ఆ ఆతృత, కాబట్టి అలాంటి తప్పుడు ఇప్పుడు చెయ్యను. ఎందుకంటే ఇప్పుడు నేను ఏంటనేది నాకు బాగా అర్థమైంది. అప్పుడు నాకు తెలియక చేసిన పొరపాటు. నేను ఒక అమ్మగా అవసరమైతే ఎవరినైనా దత్తత తీసుకుంటాను.

## అసూయగా ఉంది : లెనిన్ 'సక్సెస్ మీట్' లో నాగార్జున



లెనిన్ సినిమా సక్సెస్ కోసం పని చేసిన తీరు చూస్తే నాకు అసూయగా ఉందని హీరో అక్కినేని నాగార్జున వ్యాఖ్యానించారు. అన్నమయ్య సినిమా రిలీజ్ తరువాత సమయంలో కూడా నేను తిరుమల తిరుపతి శ్రీవారి వద్దకు వెళ్లి మొక్కినా, ఎప్పుడు తనకు ఫలానా కావాలని ఆడాలేదని, కానీ ఈ సారి మొదటి సారి నా కొడుక్కు బ్లాక్ బస్టర్ హిట్ ఇవ్వమని శ్రీవారిని వేడుకున్నానని చెప్పారు. శనివారం జరిగిన లెనిన్ సక్సెస్ మీట్ లో నాగార్జున మాట్లాడారు. మొన్న తండేల్ , ఇప్పుడు లెనిన్ రెండు హిట్లు రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఇద్దరు నాకు రెండు కళ్ళు అని నాగార్జున వ్యాఖ్యానించారు. లెనిన్ సినిమాను ఎంతగానో ప్రేమించి పని చేశారు. వీళ్ళు చేసిన పని తీరు చూస్తుంటే తనకు ఈర్ష్య కలుగుతోందని తెలిపారు. ఈ సినిమాకు అడిగిన వెంటనే వాయిస్ ఓవర్ ఇచ్చిన తారక్ (జూనియర్ ఎన్టీఆర్) కు ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలిపారు. డైరెక్టర్ నందును ఎక్కువ సార్లు కలిశానన్నారు. డైరెక్టర్ నందు, ఎడిటర్ ఒక సైకోలాగా పని చేశారని అన్నారు. ఇంటికొచ్చి నందు సీన్స్ గురించి చర్చించేవాళ్లమన్నారు. హిట్ రావడం లేదు అని అఖిల్ రెగ్యులర్ గా అనేవాడు ఇప్పుడు ఆ బాధ లేదని చెప్తున్నాను. ఇక నుంచి కొత్త లైఫ్ ఉంటుంది అఖిల్ కు అని చెప్పారు.

## 'జననాయగన్' సినిమాకు 'ఏ' సర్టిఫికెట్



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన తాజా చిత్రం 'జననాయగన్'. విజయ్ ముఖ్యమంత్రి కాకముందు విడుదల కావలసిన ఈ సినిమా ఆగిపోయింది. ఇప్పుడు ఈ సినిమాకు విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సినిమాకు సంబధించిన సెన్సార్ కార్యక్రమాలు కూడా ఇటీవలే పూర్తయాయ్యి. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ లభించింది. అంటే పద్దెనిమిదేళ్లు నిండిన వారు మాత్రమే ఈ సినిమాకు వెళ్లాల్సి ఉంటుంది. విజయ్ సరసన మమిత బైజు, పూజ హెగ్డే హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇతరపత్రాల్లో బాబీ డియోల్, మోనిష బ్లేస్సి, ప్రియమణి, ప్రకాష్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పొలిటికల్ పిక్చర్ గా తెరకెక్కిన ఈ సినిమాకు హెచ్. వినోద్ దర్శకత్వం వహించారు. వెంకట్ కె నారాయణ ఈ చిత్రాన్ని నిర్మించారు. చిత్రానికి సంబధించిన అన్ని పనులు పూర్తి చేసి త్వరలోనే విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# రామ మందిరం కేసుపై మౌనమెందుకు?

### ప్రధాని మోదీకి సిపిఐ ప్రశ్న



**న్యూఢిల్లీ:** అయోధ్యలోని రామ మందిరం విరాళాల చోరీ వ్యవహారంలో జ్యుడిషియల్ విచారణ జరిపించాలన్న తన డిమాండ్‌ను సీపీఐ పునరుద్ఘాటించింది. ఈ భారీ కుంభకోణంపై కేంద్రం, బీజేపీ, ప్రధాని మోదీ మౌనాన్ని ప్రశ్నించింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో అయోధ్య కుంభకోణంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం నమ్మకద్రోహం చేసిందని విమర్శించారు. కేవలం రాజీనామాలు చేయించి చేతులు దులిపివేసుకుంటే సరిపోదని దుయ్యబట్టారు. 'విశ్వాసమే... ప్రజల్లోని నమ్మకాన్ని మోసం చేస్తున్నది. విశ్వాసాన్ని నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. ప్రధాని మోదీ మౌనం కొనసాగుతోంది. ఇప్పటివరకు ఆయన పెదవి విప్పలేదు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా ఈ అంశంపై ఒక్క మాటైనా మాట్లాడలేదు' అని డి.రాజా అన్నారు. 2024 ఒడిశా అసెంబ్లీ ఎన్నికలప్పుడు జగన్నాథ ఆలయ రత్నబంధార్‌లో చోరీపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.... ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారు అని డి.రాజా నిలదీశారు. ముందు నుంచి ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ డిమాండ్ చేస్తున్నదన్నారు. ఈ విచారణ పూర్తిస్థాయిలో పారదర్శకంగా జరగాలని, ఎవరూ తప్పించుకునే పరిస్థితి ఉండకూడదని, రాజీనామాలతో సమాధానం లభించిందని వ్యాఖ్యానించారు. కేవలం సిబ్బందిని మార్చడం వల్ల ప్రజల్లో దెబ్బతిన్న విశ్వాసాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించలేరని దుయ్యబట్టారు. పరిపాలన వైఫల్యాలకు తాజా వ్యవహారం అద్దంపడుతోందని విమర్శించారు. అదే సమయంలో పార్టీ అధ్వర్యంలో జరగబోయే దేశవ్యాప్త పాదయాత్రలు, ప్రచారోద్యమం గురించి వెల్లడించారు. మోదీ సర్కారు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఉద్దేశంగా మార్పు అనివార్యం నినాదంతో ముందుకెళుతున్నట్లు డి.రాజా చెప్పారు. జీవనోపాధి, నిరుద్యోగం, గ్రామీణ అనిశ్చితి, కార్మికులురైతులు, యువత విద్యార్థులు మహిళల సమస్యలను లేవనెత్తుతామని వెల్లడించారు. సెప్టెంబరు 1వ తేదీన ఢిల్లీ రామ్ లీలా మైదానంలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి హామీ చట్టం రద్దు వంటి అంశాలను ప్రస్తావించారు. కొత్త ఉపాధి పథకం రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందని అన్నారు. దీనిని అమలు చేయడం రాష్ట్రాలకు తలకు మించిన భారమే అవుతుందన్నారు. ఎంజీఎన్ఆర్‌జీఏ పునరుద్ధరణకు డిమాండ్ చేశారు.

## ఫిన్లాండ్‌లో విషాదాంతం..

### సముద్రంలో హైదరాబాద్ విద్యార్థి మణిదీప్ రెడ్డి మృతదేహం గుర్తింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫిన్లాండ్‌లో గత రెండు నెలలుగా అదృశ్యమైన హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి మణిదీప్ రెడ్డి కేసు విషాదాంతమైంది. సముద్రంలో లభ్యమైన మృతదేహం మణిదీప్ రెడ్డిదేనని ఫిన్లాండ అధికారులు ధృవీకరించారు. ఈ ఘటనలో ఎలాంటి నేర అనుమానాలు లేవని అక్కడి పోలీసులు ప్రాథమికంగా వెల్లడించారు. ఈ వార్తతో హైదరాబాద్‌లోని వనస్థలిపురం వైదేహినగర్‌లో నివసిస్తున్న మణిదీప్ కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మణిదీప్ రెడ్డి 2025 ఆగస్టులో ఉన్నత విద్య కోసం ఫిన్లాండ్‌కు వెళ్లాడు. అక్కడ లహ్తి నగరంలోని ఎల్‌యుటి యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఈ ఏడాది మే 5న రాజధాని హెల్సింకికి వెళ్లిన అనంతరం అతనితో కుటుంబ సభ్యులు, స్నేహితులకు సంబంధాలు తెగిపోయాయి. మరుసటి రోజు నుంచి అతని ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో స్నేహితులు మే 11న లహ్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విస్తృతంగా గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. తమ కుమారుడి జాడ కోసం మణిదీప్ కుటుంబ సభ్యులు ఫిన్లాండ్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని ఆశ్రయించడంతో పాటు, ఇటీవల తెలంగాణ హైకోర్టును కూడా ఆశ్రయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని అతని ఆచూకీ కనుగొనేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలువురు రోజులుగా మణిదీప్ కోసం ఆందోళన చెందుతున్న కుటుంబానికి, సముద్రంలో అతని మృతదేహం లభించిందనే సమాచారం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఘటనపై ఫిన్లాండ అధికారులు చేసినట్లు సమాచారం.

## స్పీడుబోటు బోల్తా

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరరో నలుగురు పర్యాటకులు గల్లంతైనట్లు సమాచారం. ఫూ కాక్ ద్వీపం సమీపంలో స్పీడుబోటు తలక్రిందులైనట్లు రాయిటర్స్ వార్తాసంస్థ పేర్కొంది. హోన్ మీరుట్ ద్వీపం నుండి ఆన్‌థోయ్ పోర్టుకు ప్రయాణిస్తున్న పడవ సముద్రంలో 400 కి.మీ లోతుకు వెళ్ళిన తర్వాత బోల్తాపడిందని రాయిటర్స్ పేర్కొంది. 21 మందిని కాపాడామని, మృతదేహాలన్నింటినీ ఒడ్డుకు చేర్చామని అధికారులు తెలియజేశారు. ఈ బోటులో విహారం చేస్తున్నవారిలో ఎక్కువమంది తమ మొబైల్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులేనని లావా మొబైల్ కంపెనీ ప్రకటించింది. ఈ వార్త విని తమ గుండె బద్దలైందని కంపెనీ ఒక ప్రకటనలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. మృతులంతా తమ ఛానల్ భాగస్వాములు,టీమ్ మెంబర్లేనని ప్రకటించింది. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేసినట్లు పేర్కొంది. అధికారులతో తాము సంప్రదింపులు చేస్తున్నామని, మృతుల కుటుంబాలకు పూర్తి సహాయం చేస్తామని కంపెనీ ప్రకటించింది. ఈ ఉద్యోగులలో ఎక్కువమంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. వియత్నాంలో భారత రాయబార కార్యాలయం ఈ సమాచారాన్ని ధృవీకరించింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వియత్నాం న్యూస్ పోర్టల్ వివిఎన్ ఎక్స్‌ప్రెస్ ఇంటర్నేషనల్ చెప్పిన ప్రకారం, స్పీడు బోటు వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో ఈ పడవలో 32 మంది భారతీయ పర్యాటకుల తోపాటు మరో నలుగురు బోటు సిబ్బంది ఉన్నారు. సహాయ బృందాలు మిగిలినవారిని రక్షించి ఆసుపత్రులకు తరలించాయి. ఈ ద్వీప పరిసరాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని,సహాయ చర్యల నిమిత్తం స్థానికంగా ఉన్న భారత దౌత్యకార్యాలయం కూడా ఇక్కడ ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తోందని సోషల్ మీడియా ద్వారా భారత రాయబార కార్యాలయం తెలియజేసింది. బాధిత కుటుంబాలకు సమాచారం అందించడానికి హోచిమిన్ సిటీలో ఉన్న భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో, హనోయ్ నగరంలో ఉన్న భారత రాయబార కార్యాలయంలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. +8436 281 7930+8491 552 3714— +8433 452 0414 నంబర్లకు ఎవరైనా ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చు. అదేవిధంగా హనోయ్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు +8491 308 9165 నెంబరుకు డయల్ చేయాలి. ఈ ఘటనకు సంబంధించిన ఖచ్చితమైన వివరాలను రాబట్టేందుకు స్థానిక అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. భారత్ నుండి వియత్నాంకు ఇటీవలికాలంలో గణనీయంగా పర్యాటకుల సంఖ్య పెరిగింది. కాగా ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ విషయం తెలుసుకుని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తన సంతాపం తెలియజేశారు. తక్షణం పర్యాటకులకుతగిన సహాయ సహకారాలు అందజేయాలని ఉన్నతాధికారులను కోరారు. వియత్నాంలో ఉన్న దౌత్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిసున్నారని ఎక్స్‌వేదికగా మోదీ పేర్కొన్నారు. కాగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఈ ప్రమాద ఘటనపట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలియజేశారు. కాంగ్రెస్‌పార్టీ నాయకుడు పవన్ ఖెరా కూడా మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపం తెలియజేశారు.

## రూ.7.86 కోట్ల టోకరా

(మొదటి పేజీ తరువాయి)

ముకేష్ కుమార్ జైన్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం 2025 మార్చిలో బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన జ్యువెలరీ ప్రదర్శనలో హైదరాబాద్‌కు చెందిన నితిన్ రమేష్ గులాబానీ పరిచయం అయ్యాడు. కేవీ జ్యువెలర్స్, నితిన్ జ్యువెలర్స్ పేర్లతో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు చెప్పి, పరస్పర వ్యాపార సంబంధాలు ప్రారంభించాడు. ప్రారంభ దశలో పంపిన రెండు బంగారు ఆభరణాల సరుకులకు ఒప్పందం ప్రకారం 30 రోజుల్లో చెల్లింపులు జరపడంతో నమ్మకం పెరిగింది. ఆ విశ్వాసంతో 2026 మార్చి నుంచి జూన్ మధ్య నాలుగు విడతల్లో మొత్తం రూ.13,81,47,259 విలువైన 22 క్యారెట్ల బంగారు ఆభరణాలను హైదరాబాద్‌లోని సోమాజిగూడ బాబుఖాన్ మాల్‌లో ఉన్న కార్యాలయానికి సరఫరా చేశారు. సరుకు స్వీకరించిన తర్వాత నిర్ణయించిన గడువులో చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, మొత్తం బిల్లులో రూ.5,95,16,570 మాత్రమే చెల్లించారు. మిగిలిన రూ.7,86,30,689 బకాయిని పలుమార్లు కోరినా వాయిదాలు వేస్తూ వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బకాయి వసూలు కోసం ఫిర్యాదుదారు తరచూ తన సిబ్బందిని హైదరాబాద్‌కు పంపించగా, ప్రతి సారి త్వరలో చెల్లిస్తామని హామీలు ఇచ్చినట్లు తెలిపాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానని, మరికొంత సమయం ఇవ్వాలని, ఆలస్యానికి నెలకు రెండు శాతం వడ్డీ కూడా చెల్లిస్తానని నితిన్ గులాబానీ నమ్మబలికినట్లు ఫిర్యాదులో వివరించాడు. జూన్ 17న స్వయంగా హైదరాబాద్‌కు వచ్చిన ఫిర్యాదుదారుకు మరుసటి రోజు రూ.2 కోట్లు చెల్లిస్తానని హామీ ఇచ్చినప్పటికీ, జూన్ 18న కార్యాలయానికి వెళ్లేసరికి తాళాలు వేసి కనిపించిందని పేర్కొన్నాడు. నిందితుడి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో పాటు సిబ్బంది ఫోన్లు కూడా అందుబాటులో లేకపోయాయని తెలిపాడు. నివాసానికి వెళ్లినా తాళాలు వేసి ఉండటంతో మోసపోయినట్లు గుర్తించినట్లు వెల్లడించాడు. నితిన్ రమేష్ గులాబానీతో పాటు విపిన్ రమేష్ గులాబానీ, అకౌంట్స్ మేనేజర్‌గా పరిచయం చేసుకున్న ధన్‌రాజ్ సింగ్, సేల్స్ ఇన్‌చార్జిగా ఉన్న హరీష్ కలిసి కుట్రపూరితంగా విలువైన బంగారు ఆభరణాలను దిగుమతి చేసుకుని నమ్మకద్రోహానికి పాల్పడ్డారని ఫిర్యాదులో ఆరోపించారు. ఏసిపి ఎస్. రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మోసానికి పాల్పడిన నగల వ్యాపారులు ఇదే పద్ధతిలో మరేవరినైనా మోసగించారా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.

## తక్షణమే డిజిటలైజేషన్

(మొదటి పేజీ తరువాయి)

చేసిన హెల్ప్ డెస్క్‌ను పరిశీలించిన సిఈఓ, బిఎల్‌ఓలు ఫారాల పంపిణి సజావుగా చేస్తున్నారా? ఓటర్లు నింపిన ఫారాలను ఎప్పటికప్పుడు తిరిగి తీసుకుంటున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ బిఎల్‌ఓలు ఓటర్ల నుంచి సేకరించిన ఫారాలను వెంట వెంటనే డిజిటలైజేషన్ చేయించాలని, ఆపరేటర్లతో ఈ ప్రక్రియను చాలా జాగ్రత్తగా, తప్పులు దొర్లకుండా చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఆ తర్వాత బాలాజీ నగర్ పరిధిలోని పలు అపార్ట్‌మెంట్‌లలో బిఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఫారాల అప్లోడింగ్, స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అందుబాటులో లేని ఓటర్ల వివరాలను ఫోన్‌ల ద్వారా సేకరించి, వారికి ఫారాలు అందించాలని, వారు దొరకని పక్షంలో ఆ వివరాలను సూపర్‌వైజర్లకు నివేదించాలని సూచించారు. 2002లో లేని వారి ఫారాలను ఏ విధంగా పూరించాలనే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కెపిహెచ్‌బి 6వ ఫేజ్‌లోని అపార్ట్‌మెంట్‌లు, ఇండో ఫార్చ్యూన్ గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులను సిఈఓ సందర్శించారు. అక్కడ ఓటర్లతో నేరుగా మాట్లాడి, 'సర్' ప్రక్రియపై వారికున్న పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ పర్యటనలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, తహసిల్దార్ అశోక్, డిసి ఆంజనేయులు పాల్గొన్నారు.

**ముషీరాబాద్‌లో డేటా ఎంట్రీ కేంద్రాన్ని తనిఖీ**

ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో సాగుతున్న 'సర్' పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను సిఈఓ సుదర్శన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అదనపు కమిషనర్ (ఎన్నికలు) బి.సంతోష్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని వాలీ బాల్ గ్రౌండ్ తళ్ళబస్తీ కమ్యూనిటీ హాల్లో జరుగుతున్న డేటా ఎంట్రీ నాణ్యత, మౌలిక సదుపాయాల లభ్యత, వినియోగిస్తున్న మానవ వనరులను ఉన్నతాధికారుల బృందం క్షుణ్ణంగా సమీక్షించింది. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, సకాలంలో దోషరహితంగా డిజిటలైజేషన్ను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

విడిచినట్టు కుటుంబ సభ్యులు నిర్ధారించారు. నైటింగేల్ ఆఫ్ ఇండియాగా పిలవబడే జానకి స్వరం మూగబోయింది. అరవై ఏళ్ళ సినిమా కెరీర్ లో నలభై ఎనిమిది వేలకు పైగా పాటలు పాడారు. దాదాపు ఇరవై భాషల్లో ఆమె పాటలు పాడారు. వందల సంఖ్యలో ఆమె అవార్డులు అందుకున్నారు. 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్, గుంటూరులోని, రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో జానకి జన్మించారు. దక్షిణ భారత కోకిలగా ఆమె పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, సంస్కృతం, ఒడియా, తులు, ఉర్దూ, పంజాబీ, బడగ, బెంగాలీ, కొంకణి వంటి 20 భారతీయ భాషల్లో , ఇంగ్లీష్, జపనీస్, జర్మన్ సింహాళం వంటి విదేశీ భాషలలో కూడా పాటలు పాడారు. ఆమె తన కెరీర్‌లో అత్యధిక పాటలు పాడిన భాష కన్నడ, ఆ తర్వాత మలయాళం. ఆమె 'భావవ్యక్తీకరణ స్వర మార్పుల రాణి'గా కూడా ఆమెను పిలుస్తారు.

1957లో తమిళనాడు ప్రవేశంచారు. తెలుగులో ఎస్ పి బాలసుబ్రమణ్యంతో కలసి అనేక హిట్ పాటలు పాడారు. 4 నేషనల్ అవార్డులు, 33 ఫిలిం అవార్డులు , 10 నంది అవార్డులు, కేరళ ప్రభుత్వ నుంచి 11 అవార్డులు ,తమిళ నుంచి 6 అవార్డులు, ఒడియా నుంచి ఒక అవార్డు ఇలా అనేక అవార్డులు ఆమె సొంతం చేసుకున్నారు.

ఎస్ జానకి 1957లో ఎం ఎల్ ఎ సినిమాతో తెలుగు సినిమాల్లో తన కెరీర్‌ను ప్రారంభించింది. బావ మరదళ్ళు, పూజా ఫలం, బంగారు పంజరం వంటి చిత్రాలలో ఎస్. జానకి పాటలు పాడారు. అవి చాలా ప్రజాదరణ పొందాయి. ఆమె 1960— 70లలో నిరంతర విజయాలను అందుకున్నారు. దాదాపు 90ల మధ్య వరకు ఈ పరంపరను కొనసాగించింది. 'నీ ఆశ అదియాసా' , 'ఇదేనండి ఇదేనండి భాగ్యనగరము' ఎం ఎల్ ఎ (1957), 'పోదము రావోయి బావ' కుటుంబ గౌరవం (1957), 'అనుకునాదంట' అన్న తమ్ముడు (1958) 'గాజులమ్మ గాజులు' కార్తవరాయుని కథ (1958), 'లే లే లే' శోభా (1958), 'ఆకాశమేలే అందాల రాజే' రక్త సంబంధం (1962) 'ఈ పగలు' సిరి సంపదలు (1962), 'వేణుగానమ్ము వినిపించెనే' సిరి సంపదలు (1962), 'పువ్వు నవ్వేను' సిరి సంపదలు (1962) సింహరాశిలో 'పిలిచి' (2001) అనేక హిట్ పాటలు పాడారు. ప్రముఖుల సంతాపం గాయని జానకి మరణం భారతీయ సినిమా పరిశ్రమకు తీరనిలోటని పలువురు తెలుగు సినిమా ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెపాటలు పడితే సినిమా హిట్టు అయినట్టే అని ప్రముఖ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఆమె చేత పాట పడించడం కోసం నిర్మాతలు క్యూ కట్టేవారని చెప్పారు. చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంతాపం ప్రకటించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com